# చీకటికి వెయ్యికళ్ళు

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 69

జనవరి 2012 నుంచి డిసెంబర్ 2012 వరకు

కౌముది మాసపత్రికలో

సీరియల్‌గా పునర్ముద్రణ పొందిన నవల

# 1

**డిటెక్టివ్ యుగంధర్ తన కన్సల్టింగ్ రూంలోకి అడుగు పెట్టగానే, ఆమె లేచి నిలుచుంది. చిరునవ్వు నవ్వింది.**

"యుగంధర్ గారూ!" అన్నది.

యుగంధర్ తన చేతిగడియారం చూసుకున్నాడు. తొమ్మిది గంటలు దాటింది. కొంచెం విసుగ్గా ఆమెని చూశాడు.

"తమ పేరు?" అడిగాడు.

"మంగళ. మీ సహాయం కోసం వచ్చాను" అన్నది.

"కూర్చోండి" అని యుగంధర్ బల్లవెనక ఉన్న రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు. ఏమిటో చెప్పమన్నట్లు ఆమెని చూశాడు. ఆమె సందేహిస్తూ ఒకసారి గదంతా చూసింది. చాలా విశాలమైన గది అది. మూడు గోడలకీ ఆనించి నిలువెత్తున రోజ్ వుడ్ అలమరాలున్నాయి. వాటిలో లా పుస్తకాలు, వైద్య పుస్తకాలు, సైన్సు పుస్తకాలు ఉన్నాయి. ఆ గదికి ఒకే కిటికీ ఉంది - చాలా పెద్ద కిటికీ సహానికి నీలంరంగు తెర కట్టివుంది. ఆమె యుగంధర్ బల్లవైపు చూసింది. బల్ల మీద ఫౌంటెన్ పెన్ పెట్టుకునే స్టాండు, లెటర్ పాడ్, గుండుసూదులు గుచ్చుకునే కుషనూ, టెలిఫోను ఉన్నాయి. యుగంధర్ కుర్చీపక్కన ఒక చిన్న బల్ల, బల్ల వెనుక కుర్చీ ఉన్నాయి. ఆ బల్లమీద టైపు మిషనూ, ఫైల్సు, కాగితాలూ, పెన్సిళ్ళూ ఉన్నాయి. యుగంధర్‌కి మరొకవైపున ఖరీదయిన సోఫాసెట్టు ఉన్నది.

యుగంధర్ ఆమెనే చూస్తున్నాడు. ఆమె గొంతు సవరించుకుంది. చిన్న జేబురుమాలుతో విసురుకుంటోంది. యుగంధర్ కుర్చీలోంచి లేచి వెళ్ళి ఫాన్ స్విచ్ తిప్పి వచ్చాడు. యుగంధర్ని ఆమె రెప్పవాల్చకుండా చూస్తోంది. ఆరడుగుల మూడు అంగుళాల పొడుగు, బలిష్టమైన శరీరం, విశాలమైన నుదురు, కోలగా వున్న మొహం, కండలు తిరిగిన చేతులు, తీక్షణంగా ఉన్న కళ్ళు, నల్లని దట్టమైన కనుబొమలు చూసి నోరు మెదపలేకపోయిందామె.

"మీరు వచ్చిన పని కొంచెం త్వరగా చెబితే -" అన్నాడు యుగంధర్.

ఆమె బలవంతంగా నవ్వు తెచ్చిపెట్టుకుంది. "ఎందుకో భయమేస్తుంది" అంది.

యుగంధర్ ఆమెని ఆపాదమస్తకమూ పరీక్షగా చూశాడు. ఇరవై, ఇరవై అయిదేళ్ళలోపుంటుంది ఆమె వయస్సు. పెదిమలకి ఎర్రని రంగు, చెంపలకి గులాబీల పూత, కృత్రిమంగా తీర్చిదిద్దిన కనుబొమలు, కత్తిరించి ఉంగరాలు చుట్టించిన నల్లని జుట్టు, ఆ జుట్టులో ఒక పక్కగా గుచ్చిన ఎర్ర గులాబీ ఆమె వయస్సు అయిదేళ్ళు ఎక్కువగా కనబడేటట్లు చేసివుండవచ్చు. లేదా అయిదేళ్ళు తక్కువగా కనబడేటట్లు చేసి ఉండవచ్చు. మేకప్‌లో ఉన్న చిత్రమే అది అనుకున్నాడు యుగంధర్.

జారి జారిపోతున్న చీర పమిటని లాగిలాగి భుజం మీద వేసుకుంటోంది. ఎదురుగా కూర్చున్న మొగవాళ్ళని ఇబ్బంది పెట్టేందుకు కొంతమంది స్త్రీలు పమిట పదేపదే జారవిడుస్తుంటారు. ఈమె అటువంటిదేనా అనుకున్నాడు యుగంధర్. యుగంధర్ తనని పరీక్షగా చూడటం గమనించి ఆమె చిన్నగా దగ్గి, పమిట వెనకవేపు నుంచి లాగి, నడుంకి బిగించి "నా పేరు మంగళ" అన్నది.

"ఇందాక చెప్పారు" అన్నాడు యుగంధర్.

"మా వారి పేరు రామారావుగారు."

"ఏ రామారావుగారు? ఆయనకి ఏం ఉద్యోగం? ఎక్కడ ఉంటున్నారు?" చకచక అడిగాడు యుగంధర్ - ఆమె పని త్వరగా ముగించాలని.

"వి.రామారావుగారు వీరాధ్యుల వారు. ఆయన ఏ ఉద్యోగం చేయటం లేదు. చేయవలసిన అవసరమూ లేదు. ఆస్తిపరులు. ఆయన అన్నామలైపురంలో నాల్గవ క్రాస్ రోడ్లో 790 నెంబర్ ఇంట్లో ఉంటున్నారు" అన్నదామె.

"మీరు మీ భర్తతో ఉండడంలేదా? " అడిగాడు యుగంధర్.

ఆమె ఆశ్చర్యంతో చూసి తలవూపి "మనిషిని చూడగానే వాళ్ళ రహస్యాలు కనుక్కునే లాగున్నారే" అంది.

యుగంధర్ నవ్వి "నా కటువంటి విద్యలేవీ రావు. 730 నెంబర్ ఇంట్లో మీవారుంటున్నారని చెప్పారు. అంటే మీరు ఉండడం లేదని అనుకున్నాను" అన్నాడు.

"నాకు తెలుసు - నేను అనుకున్నది నిజం" అన్నది.

"ఏమిటది?"

"మిమ్మల్ని గురించి చాలా విన్నాను. కానీ నమ్మలేదు, మిమ్మల్ని గురించి అందరూ చెప్పుకునే విషయాల్లో అతిశయోక్తి ఏమీలేదని ఇప్పుడు తెలుస్తోంది. మీరు తలుచుకుంటే నా సమస్య క్షణంలో పరిష్కారం చెయ్యగలరు" అన్నది మంగళ.

"అదేమిటో త్వరగా చెబితే "

"చెబుతాను. నాకు కాసిని మంచినీళ్ళు కావాలి. మీరు లేవకండి. ఆ కిటికీలో ఉన్న కూజాలోనివి మంచినీళ్ళేగా! నేను తీసుకుంటాను" అని మంగళ లేచి కిటికీ దగ్గరికి వెళ్ళింది.

వెళుతూ ఒకసారి వెనక్కి తిరిగి యుగంధర్ని చూసింది. కూజాలోంచి గ్లాసులోకి నీళ్ళు వంచుకుని తెచ్చుకుంది. ఆమె నడుస్తున్నట్టు లేదు. గాలిలో తేలిపోతున్నట్టుంది. తనలో వలపు, వయస్సు పుష్టి ప్రస్ఫుటంగా గోచరించేటట్లు ఊగుతూ నడిచింది. ఆమెకది అలవాటా లేక ఆ ప్రదర్శన తనకోసమా అనుకున్నాడు యుగంధర్.

మంగళ  బల్లదగ్గరికి తిరిగివచ్చి మంచినీళ్ళ గ్లాసు బల్లమీద పెట్టి కూర్చున్నది.

"నాకూ, నా భర్తకీ పొసగలేదు. నేను విడిగా ఉంటున్నాను" అంది.

యుగంధర్ ఏమీ మాట్లాడలేదు.

"విడాకులు ఇవ్వమని వార్ని అడిగాను. ఇవ్వనన్నారు."

"ఏం? ఆయనకి మీరంటే చాలా ఇష్టమా?"

"అబ్బే! అటువంటిదేమీ లేదు. చాలా తిరుగుబోతు, పేరు ప్రతిష్టలు పోతాయిట. వారిది సాంప్రదాయమైన, గౌరవమైన కుటుంబమట. రచ్చకెక్కడం ఇష్టంలేదట, అంతా అబద్ధం" అంది కసిగా.

"విడాకులు ఇవ్వకపోవడానికి అసలు కారణం?"

"నన్ను బాధించడానికి. అంతకన్నా ఏముంది?"

"ఎందుకు మిమ్మల్ని బాధించడం? మీమీద ఆయనకెందుకు కసి?"

"ఏమో! ఆయన తత్వం అంతే! హృదయ వైశాల్యం లేదు."

"విడాకులు ఇస్తే తనకీ సుఖమేగా?" అడిగాడు యుగంధర్.

"ఇప్పుడూ తనకి ఆటంకం ఏముంది? ఆయన తన సుఖం తను చూసుకుంటూనే ఉన్నారు" అని కాసేపు ఆగి "ఎటొచ్చీ కష్టం నాకే. జీవనాధారానికి కూడా డబ్బు ఇవ్వడంలేదు. పెళ్ళిలో అత్తింటివారు పెట్టిన నగలన్నీ కూడా తన ఇనపపెట్టెలో పెట్టుకుని, నాకొక్కటీ ఇవ్వలేదు. నడివీధిలోకి నెట్టేశారు."

"కారణం?" అడిగాడు యుగంధర్.

"అదంతా ఇప్పుడు చెప్పి మిమ్మల్ని వేధించడం దేనికి? ఆయనకి పరిమిట్ ఉన్నది. తాగుతారు. రేసులకి వెళతారు. మరికొన్ని ఏహ్యమైన వ్యసనాలు కూడా ఉన్నాయి. నాకళ్ళముందు, అదే ఇంట్లో -" అని పెదిమలు కొరికి, వస్తున్న దుఃఖాన్ని ఆపుకుని మాటలు నిలిపివేసింది.

"అయితే మీరే విడాకులకి అర్జీ పెట్టుకోవచ్చుగా! కోర్టుద్వారా మీ నగలు, స్త్రీ ధనం సంపాదించుకోవచ్చుగా" అన్నాడు యుగంధర్.

"అంత సులభం కాదు. సాక్ష్యం లేదు. సాక్ష్యం లేకుండా జాగ్రత్తపడ్డారు. ఆయన్ని భరించలేక నేను రెండునెలలనుంచీ విడిగా ఉంటున్నాను" అన్నదామె.

"నేను విడాకుల కేసులు తీసుకోను. నాకు అసహ్యం" అన్నాడు యుగంధర్.

"ఆ విషయం నాకు తెలుసు. విడాకుల గురించి కాదు నేను వచ్చింది. ఓ చిక్కులో ఇరుక్కున్నాను. మీరు సహాయం చెయ్యాలి" అన్నది మంగళ.

"చెప్పండి"

"ఒక రోజున చాలా పెద్ద పోట్లాట అయిన తర్వాత నేను మా వారి ఇంట్లోంచి వచ్చేశాను. రెండురోజులు ఓ స్నేహితురాలింట్లో ఉండి తర్వాత ఇల్లు అద్దెకి తీసుకున్నాను. ఆ పోట్లాట వేడిలో మా వారి ఇనపపెట్టె తాళం చెవి తీసుకు వచ్చేశాను. మా వారి దగ్గర ఇంకో తాళం చెవి ఉందిలెండి."

"ఆ!" అన్నాడు యుగంధర్ శ్రద్ధగా వింటున్నాడు.

"దాన్నెలాగాయినా సంపాదించాలని నిశ్చయించుకున్నాను. మా వారి ఇంట్లోకి నేను వెళ్ళడానికి వీలులేదు. నన్ను ఇంట్లోకి రానివ్వద్దని నౌకర్లకి చెప్పారు. అందుకని ఓ చిన్న పన్నాగం పన్ని ఆ నెక్లెస్ ఒకటి తీసుకువచ్చి నా కివ్వమని జోగయ్యకి ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చాను."

"ఆయన ఏమన్నాడు?"

"సరేనన్నాడు."

నమ్మశక్యం కాకుండా ఉంది అన్నట్లు చూశాడు యుగంధర్.

"జోగయ్య ఒప్పుకోవడానికి కారణం ఉంది. మావారికీ, నాకూ మనస్పర్థలు కలిగిన విషయం అతనికి మొదట్నుంచీ తెలుసు. ఆయనకి చాలా సన్నిహితుడు. ఆ అవకాశం తీసుకుని అతను నాతో చనువు పెంచుకోడానికి ప్రయత్నించాడు. ఒకటి రెండుసార్లు కాస్త మితిమీరి ప్రవర్తించాడు కూడా." యుగంధర్ కళ్ళలోకి చూస్తూ మంగళ నవ్వి, "జోగయ్యని మైలు దూరంలో ఉంచాను. ఈ సహాయం చేసిపెడితే నా దగ్గరకి రానిస్తాననే ఆశ కలిగేటట్లు చేశాను. ఆ ఆశ నెరవేర్చే ఉద్దేశం మాత్రం నాకు లేదు. అతనికి జరిగే అపకారమూ లేదు. అతనిమీద మా ఆయనకి చాలా నమ్మకం. అతన్ని మా ఆయన అనుమానించరు" అన్నది.

"ఇనప్పెట్టిలోంచి నెక్లెస్ దొంగిలించి మీకు తెచ్చి ఇవ్వడానికి ఒప్పుకున్నాడా ఆయన?" అడిగాడు యుగంధర్.

"అవును. ఈ వేళ పొద్దున్న ఆయన నాదగ్గరకి వచ్చాడు. నెక్లెస్ దొంగిలించాననీ, అది తనదగ్గర ఉందనీ చెప్పాడు."

"మీకివ్వలేదా?"

"లేదు. పదివేల రూపాయలు ఇస్తే ఇస్తానన్నాడు" యుగంధర్ వైపు జాలిగా చూసింది. "నా దగ్గర అంత డబ్బు లేదనీ, ఉంటే ఈ దొంగతనమే చేయించేదాన్ని కాననీ చెప్పాను. అతను వినిపించుకోలేదు. పదివేలు ఇస్తేనే నెక్లెస్ తెచ్చి ఇస్తానన్నాడు" ఆమె తల

వంచుకున్నది. "చివరికి నా ఆఖరు అస్త్రం, సమ్మోహనాస్త్రం కూడా ప్రయోగించి చూశాను. ప్రయోజనం లేకపోయింది. అతను చలించలేదు. పదివేలు కావాలన్నాడు"

ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. "ఆ నెక్లెస్ అమ్మితే దాదాపు లక్ష వస్తుంది. దానాలు వద్దు, కోర్టులూ వద్దు. నా దారిన నేను ఉందామనుకున్నాను. అంతా అయోమయం అయింది. నా దగ్గిర అంత డబ్బులేదు కనుక ఆ నెక్లెసుని యథాస్థానంలో ఆయన ఇనుపపెట్టెలో పెట్టేసి తాళం చెవి నాకిచ్చేయమని చెప్పాను. అతను నవ్వి, అదేం కుదరదని చెప్పాడు. వజ్రాలు ఊడదీసి, బంగారం, వజ్రాలు విడివిడిగా అమ్ముతానన్నాడు. తనని ఎవరూ పట్టుకోలేరని అన్నాడు" మంగళ కాసేపు మౌనంగా ఉండిపోయింది. "జరిగినదంతా విపులంగా రాసి మా ఆయనకి ఉత్తరం పంపిద్దామనుకున్నాను. కానీ జోగయ్య అంతా అబద్ధమంటే నిజమని నేనెలా నిరూపించగలను. ఆయన అతని మాటలకే విలువ ఇస్తారు. పోలీసులకి రిపోర్టు చేద్దామనుకున్నాను. కానీ తాళం చెవి అతనికిచ్చినట్లు సాక్ష్యం లేదు. అతను అడిగినట్లు పదివేలు ఇద్దామంటే నా దగ్గర డబ్బులేదు. ఏం చేయడానికీ తోచక మీ దగ్గరికి వచ్చాను."

యుగంధర్ మంగళని కొంచెం విసుగ్గా చూశాడు. "నన్నేం చేయమంటారు" అడిగాడు.

"ఎలాగయినా ఆ నెక్లెస్ అతని దగ్గర్నుంచి తెచ్చిపెట్టండి. మిమ్మల్ని వేడుకుంటున్నాను. అది నాది. స్త్రీ ధనం. దాన్ని మీరు నాకు తెచ్చి ఇవ్వడంలో తప్పులేదనుకుంటాను" మంగళ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. యుగంధర్ మౌనంగా ఉండిపోయాడు. కాసేపు దీర్ఘంగా ఆలోచించి బల్లమీదవున్న టెలిఫోన్ స్విచ్ నొక్కాడు. "ఇప్పుడే వస్తాను" అని ఆ గదిలోంచి బయటికి వెళ్ళాడు. తిన్నగా మేడమీదికి తన గదిలోకి వెళ్ళి టెలిఫోను తీసి ఒక నెంబర్ తిప్పాడు.

"హల్లో! ప్రసాదరావుగారున్నారా" అడిగాడు. పిలుస్తానని అవతలనుంచి చెప్పారు. క్షణం తర్వాత టెలిఫోనులో యుగంధర్‌కి బాగా పరిచితుడయిన ప్రసాదరావు పలికాడు.

"ప్రసాదరావుగారూ వీరాధ్యుల రామారావుగారు మీకు తెలుసా?" అడిగాడు.

"ఎక్కువ పరిచయంలేదు కానీ తెలుసు. రేస్ క్లబ్ మెంబరు. ఏం?"

"ఆయన భార్యని గురించి మీకేమైనా తెలుసా?"

"ఆమెనీ చూశాను ఒకటి రెండుసార్లు."

"ఆమెని వర్ణించి చెప్పగలరా?"

"తెల్లగా ఉంటుంది. కత్తిరించిన జుట్టు, గుండ్రని మొహం, మంచి ఒంటి రంగు. పొడుగు, నల్లని కళ్ళు చాలా?"

"ఇంకా"

"అదొక రకమైన బొంగురు కంఠస్వరం. అందులో జీర ఉంటుంది. బాగుంటుంది. నవ్వుతున్నప్పుడు మరీ బావుంటుంది."

"మనిషి ఎలాంటిది?"

"చాలా మంచిదని విన్నాను. రామారావుని గురించి అలా చెప్పుకోరు. ఆ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కలిగాయనీ, ఆమె భర్తని చదిలి విడిగా ఉంటున్నదనీ మొన్ననే ఎవరో చెప్పగా విన్నాను."

"థాంక్స్" అని యుగంధర్ టెలిఫోను పెట్టేసి కిందకి వచ్చాడు.

"మంగళాదేవిగారూ! తగాదాలు సన్మార్గంలో పరిష్కరించుకోవాలి. న్యాయం మీ వైపేవున్నా, నైతికంగా ఒప్పు మీదే అయినా మీరు న్యాయాన్ని సంపాదించుకోవడంలో అవలంబించే మార్గాలు న్యాయంగా ఉండాలి. అడ్డదారులు మంచివి కావు. చిక్కులు తెచ్చి పెడతాయి. వివేకమూ, లోకానుభవమూ లోపించడంవల్ల మీరిలా ప్రవర్తించారనుకుంటాను. మీకు సహాయం చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ఆ జోగయ్య ఉండడం ఎక్కడ?" అడిగాడు యుగంధర్.

"కోడంబాకంలో, ట్రస్టుపురం అరవక్రాస్ రోడ్లో 570 నెంబర్ ఇంట్లో"

"మీరిక్కడే ఉండండి కాసేపట్లో తిరిగి వస్తాను" అని యుగంధర్ బయటికి వెళ్ళాడు.

●●●

**డిటెక్టివ్ యుగంధర్ ట్రస్టుపురం చేరుకున్నాడు.** కోడంబాకంలో కొత్తగా తయారయిన కాలనీ అది. ఏ వీధికా వీధికి మొదట్లోనే ఇళ్ళ నెంబర్లు బోర్డుమీద రాసి ఉండడం వల్ల జోగయ్య ఇల్లు తెలుసుకోవడం కష్టం కాదనుకున్నాడు యుగంధర్. మొదటి క్రాస్ రోడ్డులోకి వెళ్ళగానే కారు ఆపి, కాలి నడకన బయలుదేరాడు. ఆరవ క్రాస్ రోడ్ చేరుకున్నాడు. కుడివైపుకి తిరిగి, ఇళ్ళ నెంబర్లు చూసుకుంటూ నడిచాడు. అన్నీ కొత్తగా కట్టిన ఇళ్ళు. చాలా ఇళ్ళు ఇంకా ఖాళీగా ఉన్నాయి. కొన్ని ఇళ్ళకి ఇంకా ఎలక్ట్రిక్ దీపాలు రాలేదు. వీధి దీపాలు కూడా చాలా దూరదూరంగా ఉన్నాయి.

570 నెంబర్ ఇంటిముందు ఆగాడు యుగంధర్. అది చాలా చిన్న ఇల్లు. 'డి' టైపు ఇల్లు. లోపల చిన్న దీపం వెలుగుతోంది. ఇంటి చుట్టూ ఫెన్సింగ్ కానీ, గేటుకానీ లేదు. యుగంధర్ తలుపు తట్టాడు. ఎవరూ పలక్లేదు. మళ్ళీ తట్టాడు.

"ఎవరు?" లోపల్నించి ఓ మొగగొంతు పలికింది.

"జోగయ్యగారి ఇల్లు ఇదేనా?" యుగంధర్ అడిగాడు.

"మీరెవరు?" లోపల్నించి ప్రశ్న.

తనెవరో తెలిస్తేకానీ, ఆ ఇల్లు జోగయ్యది అయినదీ కానిదీ చెప్పదలచుకోలేదని యుగంధర్ గ్రహించాడు.

"నా పేరు చెప్పినా మీకు తెలియదు" అన్నాడు.

"ఏం పని?"

"జోగయ్యగారిల్లిదేనా?" యుగంధర్ మళ్ళీ అడిగాడు.

"ఏం పని?" లోపల్నించి ఆ బొంగురు స్వరం అడిగింది.

"ఆయనతో మాట్లాడాలి" యుగంధర్ కాస్త కోపంగా అరిచాడు.

మంచం మీదనుంచి లేచినట్టు, తలుపువైపు నడుస్తున్నట్లు అలికిడి అయింది. యుగంధర్ తలుపుకి అరడుగు దూరం వెనక్కి జరిగాడు. తలుపు గడియ తీసి, తలుపు తెరిచాడు లోపల మనిషి. "ఎవరు?" అడిగాడు.

"మీరేనా జోగయ్యగారు?" అన్నాడు యుగంధర్.

"అవును, మీరెవరు?" అడిగాడు జోగయ్య.

అతనికి దాదాపు ముప్పయి ఏళ్ళు దాటి ఉంటాయి. పైజమా, షర్టు వేసుకున్నాడు. మాటలు కాస్త ముద్దగా ఉన్నాయి. ఒక చేత్తో తలుపు పట్టుకున్నా నిటారుగా నిలుచోలేకుండా ఉన్నాడు.

"మీతో మాట్లాడడానికి వచ్చాను, లోపలికి రానివ్వండి" అన్నాడు యుగంధర్.

"అక్కర్లేదు. ఇక్కడే నిలుచుని పనేమిటో చెప్పండి" అని అతను అంటూండగానే యుగంధర్ తలుపు సందులో బూటు కాలు పెట్టి చేత్తో జోగయ్యని వెనక్కి ఒక్కతోపు తోశాడు. ఆ తోపుకి జోగయ్య వెనక్కి వెళ్ళాడు. పడిపోకుండా అతను కాళ్ళమీద నిలబడడం చాలా కష్టమైంది. ఆలోగా యుగంధర్ లోపలికి వెళ్ళి, తలుపు మూసి లోపల గడియ పెట్టాడు.

జోగయ్య తేరుకుని, యుగంధర్ని ఉరిమి చూసి, జేబులోకి చెయ్యి పోనిచ్చాడు.

"ఆగు. చెయ్యి జేబులోకి పోనివ్వక" అన్నాడు యుగంధర్, చేతిలో పిస్తోలున్నది.

జోగయ్య బిత్తరపోయి చూస్తున్నాడు.

"జేబులోంచి ఆ పిస్తోలు తీసి ఇటు ఇచ్చెయ్యి. నువ్వు దాన్ని పేల్చినా నాకు తగలదు. తాగి మత్తులో ఉన్న నువ్వు గురిపెట్టలేవు" అన్నాడు యుగంధర్.

జోగయ్య నిర్ఘాంతపోయి, జేబులోంచి పిస్తోలు తీసి యుగంధర్‌కి ఇచ్చేశాడు.

"నువ్వెవరు?" అడిగాడు మళ్ళీ.

"నే నెవర్నయితే నీకేంగాని, ఆ నెక్లెస్ ఇలా ఇయ్యి" అన్నాడు యుగంధర్.

"ఏ నెక్లెస్?"

"బుకాయించక. ఏ నెక్లెసో నీకు తెలుసు. రామారావు ఇనప పెట్టెలోంచి నువ్వు దొంగిలించిన వజ్రాల నెక్లెస్."

"ఇదేదో కథలా ఉంది. ఏమిటీ దౌర్జన్యం? నెక్లెసేమిటి? అసలు నువ్వెవరు? నీ మొహం ఎక్కడో చూసినట్టున్నది" అని జోగయ్య కళ్ళుమూసుకుని ఒక క్షణం ఆలోచించాడు.

"ఎందుకు శ్రమపడతావు. నేనెవరయితే నీకేం! నెక్లెస్ ఇలాతే. మంగళాదేవి చెప్పింది అంతా. ఇనప పెట్టె తాళంచెవి నీకివ్వడం, నువ్వు ఆమె భర్త రామారావు ఇంట్లోంచి నెక్లెస్ దొంగిలించుకు రావడం - పదివేలు రూపాయలు ఇస్తే కానీ అది ఇవ్వననడం-"

జోగయ్య యుగంధర్ని ఓరకంటితో చూశాడు. "ఆ! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. డిటెక్టివ్ యుగంధర్ కదూ! మీ ఫోటో పత్రికలలో చూశాను. మళ్ళీ చెప్పండి. నెక్లెసేమిటి? మీకెవరు చెప్పారు" అడిగాడు.

"మంగళాదేవి నాకు జరిగిందంతా చెప్పింది."

"అదేమిటో నాకు చెప్పండి" అన్నాడు జోగయ్య, అతని పెదిమలమీద చిరునవ్వు వెలిగింది.

"తన భర్త ఇంట్లో ఇనపపెట్టెలో ఉన్న నెక్లెస్‌ని దొంగిలించి తీసుకువచ్చి తనకివ్వమని ఇన్పపెట్టె తాళం చెవి నీకు ఇచ్చిందామె. నువ్వు సరేనని ఆ తాళం చెవి తీసుకున్నావు. ఇవాళ పొద్దున్న ఆమెని కలుసుకుని పదివేల రూపాయలు ఇస్తే నెక్లెస్ ఇస్తానన్నావు. ఇవ్వకపోతే నెక్లెస్ అమ్ముకుంటానన్నావు."

"అలాగా?" అన్నాడు జోగయ్య పరధ్యానంగా.

"ఏం? అబద్ధమా!" అడిగాడు యుగంధర్.

"నిజమే! అయినా మంగళ కాని, మీరు కాని చేయగలిగిందేముంది? పదివేలు ఇచ్చి నెక్లెస్ తీసుకోవాలి. లేదా నోరు మూసుకు ఊరుకోవాలి"

"ఊరుకోనవసరంలేదు జోగయ్యా నిన్ను జైల్లో పెట్టించగలను" అన్నాడు యుగంధర్.

జోగయ్య నవ్వుతూ "సాక్ష్యం ఏమున్నది? ఆమె నాకు ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చిందని రుజువేంటి? ఆ మాటకు వస్తే నేను ఇనుప పెట్టె జోలికే వెళ్ళలేదనీ, అందుకు అవకాశం లేదనీ రామారావు నా తరపున సాక్ష్యం ఇస్తాడు" అన్నాడు.

"అంత సులభంగా తప్పించుకోలేవు జోగయ్యా! నీమీద ఇప్పుడు పోలీసులకి రిపోర్టు ఇవ్వను. కాచుకునుంటాను. నువ్వు ఆ నెక్లెస్‌ని అమ్మడానికి, అందులో ఒక్క వజ్రం అమ్మడానికి ప్రయత్నం చేసినా పట్టుబడతావు. ఈ క్షణం నుంచీ నీ జీవితం దుర్భరం చేస్తాను. రాత్రనక, పగలనక నీ వెంట నీడల్లా నా మనుషులుంటారు. నువ్వు నిద్రపోతే నీ మంచం కింద నా మనిషి ఒకడు దాక్కుంటాడు. నువ్వు రైలు ఎక్కితే నీతో పాటు రైలు ఎక్కుతాడు. వెంటాడడంలో బాగా శిక్షణ పొందిన నా మనుష్యులని తప్పించుకోలేవు. వాళ్ళు నీ వెంటవుండగా నెక్లెస్ అమ్మలేవు. అమ్మావా వెంటనే పట్టుకుంటారు. నీ వెంట నా మనుష్యులు నీడల్లా తిరిగితే నువ్వెంతకాలం భరిస్తావో నేను చూస్తాను."

"సరే! చూద్దాం. నాకు నిద్రవస్తోంది. ఇక మీరు వెళ్ళండి. గొప్పవారు నా ఇంటిని పావనం చేసినందుకు థాంక్సు" అని జోగయ్య యుగంధర్‌కి తలుపు చూపించాడు.

యుగంధర్ వెనక్కి తిరుగుతున్నట్లు తిరుగుతూ, పిడికిలిని బిగించి జోగయ్యని బలంగా గెడ్డం కింద కొట్టాడు. ఆ దెబ్బకి జోగయ్య కట్టె విరిగినట్లు నేలమీద కూలాడు. యుగంధర్ పెదిమలు బిగించి, ఒంగి జోగయ్య నాడి చూశాడు. తనలో తను నవ్వుకుంటూ తన పని ప్రారంభించాడు.

ఇల్లంతా గాలించాడు. ఏ ఒకచోటూ విడవకుండా వెతికాడు. ఆఖరికి బూట్సు లోపలా, తూముల సందుల్లో, బాయిలర్ నీళ్ళల్లో, పరుపుల లోపలా అంతా వెతికాడు. నెక్లెస్ ఎక్కడా కనిపించలేదు. జోగయ్య పడున్న చోటికి వచ్చాడు. అతను అప్పుడే కళ్ళు తెరవబోతున్నాడు. చకచక అతని జేబులు వెతికాడు. నెక్లెస్ కనిపించలేదు.

జోగయ్య నవ్వాడు. "నెక్లెస్ దొరకలేదా?" అడిగాడు లేచి కూర్చుంటూ.

"ఇంతటితో తప్పించుకున్నావనుకోక జోగయ్యా నిన్ను నీడలా వెంటాడడానికి ఈ రాత్రే మనుష్యులను పంపిస్తాను. ఇకనుంచి నీకు క్షణం శాంతి లేకుండా చేస్తాను. కాచుకో" అని యుగంధర్ బయిటికి నడిచాడు. వీధిలోకి వెళ్ళి వెనక్కి తిరిగి చూశాడు జోగయ్య కిటికీలోంచి తననే చూస్తున్నాడు. యుగంధర్ చరచర నడుచుకుంటూ వీధి మలుపు తిరిగాడు. మలుపు తిరిగి ఆగాడు. తన వెనక జోగయ్య వస్తున్నాడేమోనని అడుగుల చప్పుడు కోసం చెవులు నిక్కబొడుచుకుని విన్నాడు. ఎటువంటి శబ్దమూ లేదు. మరికొంత దూరం నడిచి అయిదవ క్రాస్‌రోడ్లోని ఇళ్ళ పెరళ్ళు కనిపిస్తున్నాయి. ఆ ఇళ్ళని లెక్కపెట్టుకుంటూ నడిచాడు. ఒక ఇంటి పెరడు దగ్గిర ఆగాడు. ఆ ఇంటికి ఫెన్సింగ్ కానీ, కాంపౌండు గోడకానీ లేదు. దరిదాపులలో వీధి దీపం లేదు. చీకటిగా ఉంది. ఆ చీకట్లో కలసిపోయాడు యుగంధర్. ఆ ఇంటి గోడపక్కగా ముందుకు వెళ్ళాడు. గోడకి అనుకుని పక్క నిలబడ్డాడు. మునివాకిలి వైపు చూస్తున్నాడు.

జోగయ్య ఓ చిన్న తోలుపెట్టె తీసుకుని బయటికి వచ్చాడు . తలుపు తాళం వేసి వాకిలిమెట్లు దిగాడు. వీధిలోకి వెళ్ళబోతుండగా యుగంధర్ వెనకనుంచీ వచ్చి బలంగా మెడమీద ఒక దెబ్బకొట్టాడు. జోగయ్య కిందపడ్డాడు. అతని చేతిలో ఉన్న తోలుపెట్టె కింద పడ్డది. ఆ తోలుపెట్టె తాళం వేసి ఉంది. జోగయ్య జేబులోంచి తాళంచెవులగుత్తి తీసి తోలుపెట్టె తెరిచాడు. గుడ్డలు, టూత్ బ్రష్, సోపు మొదలయిన సామానులు ఉన్నాయి అందులో.

యుగంధర్ తనలో తను నవ్వుకున్నాడు. తన పాచిక పారింది. జోగయ్య బెదిరిపోయి వెంటనే పలాయనం కావడానికి ప్రయత్నిస్తాడనుకున్నాడు తను. అందుకే వెళ్ళి తన మనుష్యులని పంపిస్తానని చెప్పాడు. తోలుపెట్టె అడుగున ఒక చిన్న అట్టపెట్టె వుంది. యుగంధర్ దాన్ని తెరిచాడు.

మిలమిల మెరిసిపోతూ వజ్రాల నెక్లెస్ కనిపించింది. నవ్వుకుంటూ యుగంధర్ ఆ అట్టపెట్టె జేబులో వేసుకున్నాడు.

జోగయ్య కళ్ళు తెరిచాడు. మూలుగుతూ లేచి కూర్చున్నాడు. "యుగంధర్ నువ్వు చాలా తెలివైనవాడివి అనుకుంటున్నావు కదూ! నువ్వు ఫూల్‌వి" అన్నాడు కసితో.

యుగంధర్ నవ్వాడు. "నీ ఇష్టం వచ్చినట్టు తిట్టుకో గుడ్‌నైట్" అని మొదటి మెయిన్ రోడ్ దగ్గర ఆపిన తన కారు దగ్గరికి చకచక నడిచాడు.

●●●

యుగంధర్ తిరిగి కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళేటప్పటికి మంగళ "పేషలాస్" ఆడుకుంటోంది. అది ఒక్కరు ఆడుకునే పేకాట. యుగంధర్ని చూడగానే నవ్వి "మీరు రావడానికి ఇంకా ఆలస్యం అవుతుందనుకుంటున్నాను" అన్నది లేచి నిలుచుంటూ.

ఆమెని కూర్చోమని సంజ్ఞ చేసి తన రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు యుగంధర్.

"జోగయ్య కనిపించాడా?" అడిగిందామె.

యుగంధర్ తలూపాడు.

"ఏమన్నాడు?"

యుగంధర్ జేబులోంచి అట్టపెట్టె తీశాడు. దాన్ని బల్లమీద పెట్టి మంగళ కందేట్లు ముందుకు తోశాడు. ఆ పెట్టె తెరిచింది. ఆశ్చర్యంతో యుగంధర్ని చూసింది. "ఎలా తెచ్చారు? ఎలా ఇచ్చాడు?" అడిగింది.

"ఎలా తెస్తేనేం? తెచ్చాను చాలదూ" అన్నాడు యుగంధర్.

మంగళ నవ్వింది. "చాలు" అని ఒక క్షణం ఆగి, హేండ్ బాగ్ తెరిచి, అందులోంచి ఒక నోట్ల కట్ట తీసింది. నెమ్మదిగా ఆ కట్ట బల్ల మీద పెట్టి, లేచి నిలుచుంది. "నేను వస్తాను. మీకు ధన్యవాదాలు" అన్నది. యుగంధర్ బల్లమీద వున నోట్లకట్టని చూసి "ఏమిటిది?" అన్నాడు.

"మీ శ్రమకి" అన్నది.

యుగంధర్ బల్లమీద నోట్లకట్ట తీసుకున్నాడు. నింపాదిగా లెక్కపెట్టాడు. ఆమె వైపు తిరిగి, "వెయ్యి" అన్నాడు. ఆమె తల ఊపింది. కుర్చీలోంచి లేచి ఆమె దగ్గరికి వెళ్ళి ఆమె చేతిలో ఉన్న హేండ్ బాగ్ తీసుకుని, అందులో ఆ నోట్లకట్టని పెట్టి, బాగ్ మూసేసి ఆమెకి ఇచ్చాడు.

"అమ్మాయి! నువ్వేమీ ఇవ్వనవసరంలేదు. ఇకముందు ఇటువంటి చిక్కుల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తగా ఉండు. న్యాయం నీ వేపు ఉన్నా అడ్డదారులు మంచివి కావు అనేది జ్ఞాపకముంచుకో!" అన్నాడు. ఆమె యుగంధర్‌కి నమస్కారం చేసింది. "ఎన్నడూ మీ సహాయం మరచిపోను" అన్నదామె వెళ్ళిపోతూ. బయట కారు స్టార్టు అయిన శబ్దం విన్నాక యుగంధర్ కన్సల్టింగ్ గదిలో దీపం ఆర్పి పడక గదిలోకి వెళ్ళాడు.

## 3

మర్నాడు పొద్దున్న యుగంధర్ తన కన్సల్టింగ్ గదిలోకి వచ్చేటప్పటికి అతని అసిస్టెంటు రాజు టెలిఫోనులో ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"ఒక్క క్షణం. ఇప్పుడే యుగంధర్‌గారు గదిలోకి వచ్చారు. చెపుతాను ఉండండి" అన్నాడు. టెలిఫోను నుంచి మొహం పక్కకి తిప్పి, యుగంధర్ని చూసి, టెలిఫోనులో ఎవరో పిలుస్తున్నారని సంజ్ఞ చేశాడు.

"ఎవరు?" అడిగాడు యుగంధర్.

మౌత్‌పీస్ మీద చెయ్యి అడ్డం పెట్టి, "ఎవరో పేరు చెప్పడంలేదు. మీతో మాట్లాడాలిట." అన్నాడు రాజు.

యుగంధర్ రిసీవర్ అందుకున్నాడు. "ఎస్ యుగంధర్ స్పీకింగ్ హియర్" అన్నాడు.

అవతలనుంచి చిన్న నవ్వు వినపడింది.

"యుగంధర్! నువ్వు ఫూల్‌నని ఇప్పటికయినా తెలిసిందా?" నవ్వుతూ అవతలివైపునుంచి ఒక మొగ గొంతు అడిగింది.

యుగంధర్ కనుబొమలు చిట్లించి, "నువ్వెవరు?" అడిగాడు.

"ఎవరయితేనేం? రామారావు భార్య మంగళని ఆమె ఇంటికి వెళ్ళి ఒకసారి చూసిరా, నువ్వెంత పెద్ద ఫూల్‌వో తెలుస్తుంది."

యుగంధర్ మరేమీ అడక్కముందే అవతలివైపు రిసీవర్ పెట్టేసినట్లు క్లిక్ మని శబ్దం అయింది.

యుగంధర్ ఆలోచిస్తూ రిసీవర్ హుక్ మీద పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

"ఎవరు సార్?" అడిగాడు అసిస్టెంటు రాజు.

"ఎవరో చెప్పలేదు. కానీ ఊహించవచ్చు. అతని పేరు జోగయ్య."

"ఏమంటారు?"

"కథ అంతా చెబితే కాని నీకు అర్థంకాదు. ముందు మనం ఒకచోటికి వెళ్ళాలి. దోవ చెబుతాలే." అన్నాడు యుగంధర్.

క్రిజ్లర్ కారు యుగంధర్ డ్రయివ్ చేస్తున్నాడు. రాజు పక్కనే కూర్చున్నాను. క్రితం రాత్రి జరిగినదంతా విపులంగా రాజుకి చెప్పాడు యుగంధర్.

"ఇంతకీ జోగయ్య ఇప్పుడు ఏమంటాడు?" అడిగాడు రాజు.

"నేను ఫూల్ అయ్యానని అంటున్నాడు."

"ఎందుకని?"

"అదే తెలుసుకోవాలి" అని యుగంధర్ అన్నామలైపురంలో ఒక ఇంటిముందు కారు ఆపాడు.

"ఇదెవరి ఇల్లు?" అడిగాడు రాజు.

"రామారావు ఇల్లు."

కారు దిగి ఇద్దరు డిటెక్టివ్‌లూ గేటు దగ్గరికి వెళ్ళారు.

గేటు దగ్గిర ఉన్న ఆల్సేషియన్ కుక్క మొరగలేదు. కానీ చెవులు నిక్కపొడుచుకుని వాళ్ళని చూసింది. యుగంధర్ గేటుమీద చప్పుడు చేశాడు. లోపలినుంచి ఒకతను బయటికి వచ్చాడు. నింపాదిగా గేటు దగ్గరికి వచ్చి యుగంధర్‌నీ, రాజునీ ఎగాదిగా చూశాడు.

"రామారావుగారి ఇల్లు ఇదేనా?" అడిగాడు యుగంధర్.

"అవును."

"ఇంట్లో ఉన్నారా?"

"ఉన్నారు - నిద్రపోతున్నారు." అన్నాడు అతను.

"నువ్వేం చేస్తుంటావు ఈ ఇంట్లో?" అడిగాడు యుగంధర్.

"డ్రయివర్ని."

"అమ్మగారు ఇంట్లో ఉన్నారా?"

"లేరు."

"ఎక్కడికి వెళ్ళారు?"

"ఏమో?"

"అసలు ఇక్కడ ఉండటంలేదా?"

"ఏమో?" అన్నాడు ఆ డ్రయివర్.

యుగంధర్ జేబులోకి చెయ్యి పోనిచ్చి, ఓ అయిదు రూపాయల నోటు తీశాడు. "నేను మంగళ మేనమామని." అన్నారు.

"అలాగా!"

"మంగళ ఎక్కడున్నది?"

"నాకు తెలీదు" అన్నాడు డ్రయివర్.

"చెబితే ఇది నీది" అని యుగంధర్ నోటు చూపించాడు. ఆ డ్రయివర్ ఒక క్షణం సందేహించాడు. "నుంగంబాకంలో ఉన్నారు" అని చెప్పాడు చివరికి.

"ఎడ్రసు?"

"రామన్ స్ట్రీట్, నెం.190"

"థాంక్స్" అని యుగంధర్ ఆ నోటు అతనికి ఇచ్చి వెనక్కి తిరిగాడు.

సరిగ్గా పదిహేను నిమిషాల తర్వాత క్రిజ్లర్ కారు రామన్ స్ట్రీటులో నెం.190 ఇంటిముందు ఆగింది. గేటు తెరుచుకుని యుగంధరూ, రాజూ లోపలికి వెళ్ళారు. తలుపు లోపల గడియ పెట్టివుంది.

యుగంధర్ తలుపు తట్టాడు. ఒక స్త్రీ వచ్చి తలుపు తీసింది.

"మంగళాదేవిగారి ఇల్లు ఇదేనా?" అడిగాడు యుగంధర్.

ఆమె తల ఊపింది.

"ఉన్నారా?"

"మీరెవరు?"

"నా పేరు యుగంధర్."

"కూర్చోండి. చెబుతాను." అని హాల్లో ఉన్న కుర్చీలు చూపించి ఆమె లోపలికి వెళ్ళింది. ఆమె వంటమనిషి అయి ఉండాలనుకున్నాడు యుగంధర్.

అయిదు నిమిషాల తర్వాత ఒక స్త్రీ హాల్లోకి వచ్చింది. కత్తిరింపు జుట్టు. కొసలు ఉంగరాలు తిరిగి చుట్టలుగా వేళ్ళాడుతున్నాయి. చీర కొంగు మేలిముసుగు వేసుకుంది. లేత నీలిరంగు జార్జెటు చీర కట్టుకున్నది. బూడిద రంగు క్రేప్ జాకెట్టు తొడుక్కుంది. ఎర్రటి ఒంటిరంగు. గుండ్రని మొహం, నల్లని లోతు కళ్ళు, చిన్న నోరు, అందమైన పెదిమలు ఎర్రగా మెరుస్తున్నాయి. చాలా నెమ్మదిగా నడుస్తూ యుగంధర్ దగ్గరకి వచ్చింది.

యుగంధర్ లేచినిలుచునాడు, "నా పేరు యుగంధర్. మంగళాదేవిగారిని కలుసుకోవడానికి వచ్చాను" అన్నాడు.

"కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?" అడిగిందామె.

ఆమె గొంతులో అదొక రకమైన వణుకున్నది. భయం వల్లకాని, బెదిరిపోవడంవల్ల కాని కలిగింది కాదు - సహజమైన ఒణుకు అది. కొంచెం బొంగురుగా ఉన్న ఆమె కంఠస్వరం ఆ ఒణుకువల్ల వినేందుకు చాలా ఇంపుగా ఉన్నది.

"మీరేనా మంగళాదేవిగారు?" అడిగాడు యుగంధర్.

ఆమె తల ఊపింది. యుగంధర్ ఓసారి ఆమెని ఎగాదిగా చూశాడు. క్రితం రాత్రి తనవద్దకు వచ్చిన స్త్రీని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఆమెకీ, ఈమెకీ పోలిక చాలా ఎక్కువ. ఈమెలో ఠీవీ, దర్పమూ గోచరిస్తున్నాయి. తన సౌందర్యం ప్రతి కదలికలోనూ ప్రదర్శించాలని ఈమె ప్రయత్నించడంలేదు. విచారమూ, ఒక రకమైన వైరాగ్యమూ ఈమెలో గోచరిస్తున్నాయి. ఆమె కూర్చోలేదు. నిలుచునే యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూసింది.

"మీకూ, మీ భర్త రామారావుగారికీ మధ్య కలతలు కలిగి విడిగా ఉంటున్నారా?"

ఆమె తల ఊపింది.

"లక్ష రూపాయలు విలువగల నెక్లెస్ మీకున్నదా?"

ఆమె తల ఊపింది.

"అది మీ దగ్గరే ఉన్నదా?"

"లేదు. మావారి దగ్గరున్నది. నాకివ్వలేదు. విడాకులకి దావా వేశాను. దానితో పాటు నా నగలకోసమూ దావా వేశాను" అన్నదామె. ఒక క్షణం ఆగి "మిమ్మల్ని గురించి చాలా విన్నాను. మీ వృత్తిలో మీ కన్నా మించినవారు ఈ దేశంలో లేరని విన్నాను. మీలాటి వారిని కలుసుకునే భాగ్యం కలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. అయినా ఈ ప్రశ్నలన్నీ ఎందుకు అడుగుతున్నారు? మా ఆయన తరపున పని చేస్తున్నారా?"

"లేదు. నేనే అడుగుతున్నాను."

"నా విడాకుల విషయంతో మీకేం సంబంధం" అడిగిందామె.

యుగంధర్ నవ్వాడు.

"నిన్న రాత్రి నా ఆఫీసుకి ఓ స్త్రీ వచ్చింది. మీకూ, ఆమెకి చాలా పోలిక ఉంది. తన పేరు మంగళ అనీ, తను రామారావుగారి భార్యననీ చెప్పింది –" యుగంధర్ జరిగినదంతా ఆమెకి చెప్పాడు. ఆమె అంతా సావధానంగా విన్నది.

"ఆమె ఎవరు? ఎందుకు అలా చేసింది?" అడిగాడు యుగంధర్.

మంగళ పెదిమ విరిచి "ఏమో!" అన్నది.

"మీరు ఊహించలేరా?"

"ఏమో! మా వారి ప్రేయసి ఎవతో అయివుండవచ్చు. లేదా దాసీది అయి ఉండవచ్చు. ఎవరయితే నాకేం?" అన్నదామె.

"పోయింది మీ నెక్లెస్ కదా!" అడిగాడు యుగంధర్.

"ఆ నెక్లెస్ నా వద్దనుంచి దొంగలింప బడలేదు. దాన్ని నాకివ్వవలసిన బాధ్యత మా వారిది. అది పోతే దాని ఖరీదు వారు నాకివ్వాలి."

"మీకు ఇచ్చేందుకు ఆయన దగ్గర అంత డబ్బున్నదా?"

"లేకపోయినా ఇబ్బంది లేదు. ఆ నెక్లెస్‌ని ఇన్సూర్ చేశారు" అన్నది మంగళ.

యుగంధర్ ఒక నిమిషం మౌనంగా ఉండి తర్వాత "నేను చాలా ఇరుకులో పడ్డాను. దొంగలకి సహాయం చేశానా అని భయంగా ఉంది" అన్నాడు.

ఆమె నవ్వింది. "మీ ఇబ్బందులు మీ స్వవిషయాలు. వాటిని పరిష్కరించగలిగే సమర్ధత మీకుంది అనుకుంటాను" అని లేచి నిలుచున్నది.

ఆమె ఏదో దాస్తున్నదని యుగంధర్‌కి అనుమానం కలిగింది. ఆమెని ఇంకేం అడిగినా జవాబు చెప్పదని గ్రహించాడు. గట్టి మనిషిలా కనిపించిందామె.

యుగంధర్ లేచాడు. "వస్తాను, బహుశా మిమ్మల్ని మళ్ళీ కలుసుకోవలసి రావచ్చు" అన్నాడు.

ఆమె నవ్వి ఊరుకున్నది.

●●●

**"విచిత్రంగా ఉంది. ఆమె ఎవరో మిమ్మల్ని మోసగించింది"** అన్నాడు రాజు కారు కదిలిన తర్వాత.

యుగంధర్ నవ్వి, "అవును, ఎందుకలా చేసిందా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"నిన్న రాత్రి వచ్చిన ఆమె, జోగయ్య తోడుదొంగలయి ఉండాలి. ఆఖరు నిమిషంలో ఆ దొంగలిద్దరి మధ్యా పొత్తుకుదరక జోగయ్య నెక్లెస్‌ను కాజేశాడు. జోగయ్య నుంచి ఆ నెక్లెస్ తెచ్చుకోవడానికి ఆమె ఉపాయం ఆలోచించి మిమ్మల్ని ఉపయోగించుకుంది" అన్నాడు రాజు.

"అయ్యుండచ్చు. కానీ ఒక విషయం మర్చిపోలేకుండా ఉన్నాడు. నిన్నరాత్రి మన దగ్గరికి వచ్చిన స్త్రీకి, మంగళకీ విగ్రహంలో చాలా పోలిక ఉంది. ఆమెకి మంగళ జీవిత విశేషాలన్నీ క్షుణ్ణంగా తెలుసు కనక నమ్మేట్లు చెప్పింది. ఇందాక మంగళకి ఈ విషయం చెప్పినప్పుడు ఆమె ఆశ్చర్యపడలేదు. ఆమె ఎవరో విచారమూ ఆమెకి లేదు. మంగళకీ, ఈ దొంగతనానికీ ఏమైనా సంబంధం ఉందా? నిన్న రాత్రి నన్ను కలుసుకుని తను మంగళనని చెప్పుకున్న స్త్రీకి, మంగళకి సంబంధం ఉందా?" అని ఒక క్షణం ఆగి "మంగళ నా దగ్గిరకి వచ్చిందనీ, నెక్లెస్ తెచ్చిపెట్టుకుని నన్ను అడిగిందనీ నేను జోగయ్యతో చెప్పినపుడు అతను విని ఊరుకున్నాడు. ఎందుకు?" యుగంధర్ తనని తనే ఈ ప్రశ్నలు వేసుకున్నాడు.

"రాత్రి మిమ్మల్ని కలుసుకున్న ఆమె మంగళ కాదని జోగయ్యకి తెలుసుండాలి సార్! అందుకే మీరు నెక్లెస్ తెస్తుండగా 'ఫూల్' అన్నాడు మిమ్మల్ని. ఆమె మంగళ కాదని ఇవాళ పొద్దున్న మీకు ఫోను చేసిందీ అతనే అయివుంటుంది"అన్నాడు రాజు.

"అవును. నేను నెక్లెస్ అతని దగ్గర నుంచి లాక్కుని వస్తున్నప్పుడు నన్ను కలుసుకున్న స్త్రీ మంగళ కాదని అతనికి తెలిసి ఉండాలి. కానీ అప్పుడు చెప్పలేదు. పొద్దున్న టెలిఫోను చేసి చెప్పారు. రాత్రి ఆ విషయం చెప్పనివాడు తెల్లారేసరికి చెప్పడానికి ఈలోగా ఏం జరిగింది!"

"మనం ఓసారి ఆ జోగయ్యని కలుసుకుంటేనేం?" అన్నాడు రాజు.

"మనం అక్కడికే వెళుతున్నాం" అన్నాడు యుగంధర్ కారు కోడంబాకం హైరోడ్ వైపు తిప్పుతూ. ట్రస్టు పురంలో జోగయ్య ఇంటిముందు కారు ఆపాడు. కారులోంచి దిగనవసరం లేకపోయింది. తలుపుకి వేసివున్న తాళం వీధిలోకే కనిపించింది. యుగంధర్ వెంటనే కారు స్టార్టు చేశాడు. "జోగయ్య ఉండడని ముందే అనుకున్నాను. అతను మనకి చిక్కకుండా తప్పించుకు పోవడానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ చిక్కినా మన ప్రశ్నలకి జవాబులు చెప్పడు" అన్నాడు.

"జరిగిందేదో జరిగింది. మనకెందుకీ అనవసరపు శ్రమ?" అన్నాడు రాజు.

"ఆ నెక్లెస్ దొంగతనం చేయించింది మంగళ కాకపోతే నేను దొంగలకి సహాయం చేసిన వాణ్ణవలేదూ! అంతేకాదు. నన్ను మోసం చేసిన స్త్రీని మరోసారి చూడాలని ఉంది నాకు" అన్నాడు యుగంధర్ నవ్వుతూ. తన ఆఫీసుకి వెళ్ళాడు. కన్సల్టింగ్ రూంలో ఫాన్ ఫుల్ స్పీడు తిప్పి రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు.

మంగళ భర్త రామారావు ఇంటికి వెళ్ళి జరిగినదంతా అతనితో చెప్పి పోలీసులకి రిపోర్టు ఇవ్వమని అతనికి సలహా ఇద్దామనుకున్నాడు. కొంచె ఆలోచించి తొందరపడకూడదని నిశ్చయించుకున్నాడు. యుగంధర్ కళ్ళముందు క్రితం రాత్రి తన దగ్గరికి వచ్చిన స్త్రీ కనిపిస్తోంది. ఆమె పేరేమిటో? ఆమె ఎవరో? ఆమె లేచి కిటికీలో ఉన్న మంచినీళ్ళ కూజా దగ్గరికి వెళ్ళడం, తిరిగి వచ్చి తనకి ఎదురుగా కూర్చోవడం కళ్ళకు కట్టినట్లు కనిపించింది. ఆమెకీ, మంగళకీ పోలిక ఉంది. యుగంధర్ కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు. బల్లమీద టెలిఫోను మోగింది. ఆలోచనల్లోంచి తెప్పరిల్లి రిసీవర్ తీశాడు.

"యస్! యుగంధర్ స్పీకింగ్" అన్నాడు. అవతలనుంచి నవ్వు వినపడింది. "నువ్వెంత ఫూల్ అయిందీ తెలిసిందా?"

యుగంధర్ నవ్వాడు. "ఓహో, జోగయ్యా! ఆ! తెలిసింది. నిన్ను చూడాలని ఇందాక నీ ఇంటికి వచ్చాను. నువ్వెక్కణ్ణుంచి మాట్లాడుతున్నావు?" అడిగాడు.

"మల్లిక్ టెలిఫోను బూత్‌లోంచి, నాతో మళ్ళీ ఏం పని వచ్చింది"

"నిన్న రాత్రి నన్ను కలుసుకున్న స్త్రీ ఎవరో చెబుతానేమోనని."

జోగయ్య నవ్వాడు, "మేధావి అయిన యుగంధర్ నేను చెబితేకానీ తెలుసుకోలేడా?" అన్నాడు.

"మేధస్సు తగ్గిపోయింది" అన్నాడు యుగంధర్ కూడా రిసీవర్ పెట్టేశాడు. పెట్టివేస్తుండగా టకటక మని బూట్సుల చప్పుడు వినిపించింది. కన్సల్టింగ్ రూం తలుపు దగ్గర ఎవరో ఆగినట్లు గ్రహించి "లోపలికి రండి" అన్నాడు యుగంధర్.

సందేహిస్తూ, జంకుతూ, ఒక స్త్రీ లోపలికి వచ్చింది. ఆమెని చూడగానే యుగంధర్ కి కలిగిన ఆశ్చర్యానికి అంతులేదు. ఆశ్చర్యం పైకి కనబడనీయకుండా "రండి, మంగళాదేవిగారూ" అన్నాడు నవ్వుతూ.

ఆమె మొహం ఎర్రనయింది. "నేను మంగళని కానని మీకు తెలుసు. తెలిసే నన్ను అపహాస్యం చేయడానికి అలా పిలుస్తున్నారు" అన్నది తలుపు దగ్గరే నిలుచుని.

"అపహాస్యమేమీ లేదు. మీ పేరు మంగళ కాదని తెలుసు. మీ పేరేమిటో తెలీదు. అందుకని –"

"నా పేరు సరళ"

"రండి, సరళాదేవిగారూ! కూర్చోండి. ఏం పనిమీద వచ్చారు?"

సరళ నవ్వుతూ యుగంధర్ కి ఎదురుగా కుర్చీలో కూర్చున్నది. "క్షమాపణ చెప్పుకునేందుకు వచ్చాను" అన్నది.

"గుడ్! చెప్పండి" అన్నాడు యుగంధర్.

"నేను మంగళని కాను. మంగళ చెల్లెల్ని - సరళని"

యుగంధర్ తల ఊపాడు.

"ఇవాళ పొద్దున్న మీరు మా అక్కయ్యని కలుసుకున్నారట. నన్ను తిట్టింది" అన్నది.

యుగంధర్ ఏమీ మాట్లాడలేదు.

"నేను సదుద్దేశంతో చేశాను" అన్నది ఆమె మళ్ళీ.

"అసలు విషయం ఏంటో చెబితే మంచిది కదూ!" అన్నాడు యుగంధర్ మృదువుగా .

ఆమె నవ్వింది. నవ్వినపుడు అందమైన పళ్ళవరస తెల్లగా మెరిసింది. "నిన్న రాత్రి మా అక్కయ్యని గురించి నేను చెప్పినదంతా నిజం. మా బావా, అక్కయ్యా విడిపోయారు. బావ అక్కయ్య నగలన్నీ దాచేసి ఒకటి కూడా ఇవ్వలేదు. అక్కయ్య విడిగా వెళ్ళిపోయిన తర్వాత జరిగినదంతా నాకు ఉత్తరం రాసింది. ఆ ఉత్తరంలోనే తన నెక్లెస్ విషయం రాస్తూ ఆ నెక్లెస్ ఒకటి తనకి ఇచ్చినా చాలుననీ, జీవితాంతమూ డబ్బు చిక్కులేకుండా పోతుందనీ రాసింది. ఆ ఉత్తరం చూసుకుని నేను ఈ ఊరికి వచ్చాను."

"ఏ ఊరినుంచి?"

"బెంగుళూరులో మా మామ ఇంటిలో ఉంటున్నాను. మా నాన్నా, అమ్మ నా చిన్నప్పుడే పోయారు. మామయ్య మమ్మల్ని పెంచాడు. అక్కయ్యకి పెళ్ళిచేశాడు."

"బెంగుళూరులో మీరు చదువుకుంటున్నారా?"

"లేదు. చదువు ఐపోయింది. బి.ఏ. పాసయ్యాను."

"సరే. ఈ ఊరు వచ్చారు. వచ్చి?" అడిగాడు యుగంధర్.

"కోర్టులూ, కేసులూ పడలేవనీ, సులభమార్గాన బావ దగ్గరినుంచి తన నగలు సంపాదించే ఉపాయం ఆలోచించాలనీ అక్కయ్యకి చెప్పి చూశాను. వద్దన్నది. అక్కయ్యకి చెప్పి ప్రయోజనం లేదని నేనే ఉపాయం ఆలోచించాను. బావకి జోగయ్య చాలా స్నేహితుడని అక్కయ్య ఎప్పుడో మాటల్లో చెప్పింది. పనికట్టుకుని ఆ జోగయ్యతో స్నేహం చేశాను. ఇనుపపెట్టెలోంచి నెక్లెస్ దొంగలించి

తీసుకురమ్మని చెప్పాను. అతను ఒప్పుకున్నాడు. అక్కయ్యకి తెలియకుండా ఇనుపపెట్టె తాళం చెవి బీరువాలోంచి తీసుకుని జోగయ్యకి ఇచ్చాను. తర్వాత జరిగినదంతా మీకు నిన్న చెప్పాను" అన్నది సరళ.

యుగంధర్ తల ఊపాడు.

"మీరు పొద్దున్న అక్కయ్యని కలుసుకుని వెళ్ళిన తర్వాత అక్కయ్య నన్ను పిలిచి అడిగింది. నాకేమీ తెలియదని అబద్ధం చెప్పాను. అక్కయ్య నా పెట్టె తెరిచి చూసింది. నెక్లెసు కనిపించింది. ఇక నేను చేసినదంతా చెప్పక తప్పింది కాదు. వెంటనే మిమ్మల్ని కలుసుకుని క్షమాపణ చెప్పుకోమన్నది అందుకే వచ్చాను" అన్నది సరళ సిగ్గుపడుతూ.

"నిన్న రాత్రి వచ్చినప్పుడు మీరు మంగళనని ఎందుకు చెప్పారు? నిజం ఎందుకు చెప్పలేదు?"

"అసలు మీరు సహాయం చేస్తారో చెయ్యరో అని భయపడ్డాను. మీ సానుభూతి సంపాదించి, మీ సహాయం పొందాలంటే నేనే మంగళనని చెప్పుకోవడం అవసరమనుకున్నాను" అని ఆగి, నవ్వి "నా ఊహ సరయినదేగా" అన్నది.

యుగంధర్ కూడా నవ్వాడు. "అవును. మీరు రామారావుగారి భార్య కాదని తెలిసివుంటే వెంటనే వెళ్ళి జరిగినదంతా ఆయనకి చెప్పమని సలహా ఇచ్చేవాణ్ణి. ఇప్పుదు ఆ నెక్లెస్ విషయం ఏం చేస్తున్నారు? జోగయ్య ఊరుకునే మనిషి కాడు. రామారావుగారితో జరిగినదంతా చెబుతాడనుకుంటాను?" అన్నాడు.

"తనే తీసుకున్నానని అక్కయ్య అంటే ఎవరికీ ఏ ఇబ్బందీ రాదు. కానీ అక్కయ్య ఒప్పుకోవటం లేదు. తన నగ తను దొంగతనం చేయవలసిన ఖర్మం ఏమిటని అంటోంది. న్యాయంగా కోర్టుద్వారా రాబట్టుకుంటానంటోంది. జరిగినదంతా చెప్పి, బావకి నెక్లెస్ ఇచ్చేసి రమ్మన్నది."

"వివేకురాలు" అన్నాడు యుగంధర్.

"నేను బావదగ్గరికి వెళుతున్నాను. ముందు కాస్త అరుస్తే అరుస్తాడు. ఫర్వాలేదు. చేసిన పొరపాటుకి ఆ అరుపులు భరించవలసిందే"

"గుడ్! జోగయ్య మీకన్నా ముందు వెళ్ళి చెప్పకుండా త్వరగా వెళ్ళండి."

"తిన్నగా అక్కడికే వెళుతున్నాను. మీకు శ్రమ ఇచ్చినందుకూ, నిన్నరాత్రి మీతో అబద్ధం చెప్పినందుకూ క్షమించండి" అని సరళ లేచి తలుపు వరకూ వెళ్ళి ఆగి, వెనక్కి తిరిగి "అన్నట్లు శ్రమ కాకపోతే నెక్లెస్ బావకిచ్చేశానని జోగయ్యకి తెలియజేయండి. అతని దగ్గర ఇనప పెట్టె తాళం చెవి తీసుకుని దయచేసి నాకు ఇస్తే మీకు ఋణపడి ఉంటాను" అన్నది.

"ప్రయత్నిస్తాను" అన్నాడు యుగంధర్.

సరళ వెళ్ళిపోయింది.

●●●

**"న్యూలాండ్ ఇన్సూరెన్స్ కంపెనీ సెక్రటరీని. నా పేరు కృష్ణ"**

"కూర్చోండి" అని యుగంధర్ ఆ వచ్చిన మనిషిని పరీక్షగా చూశాడు. నలభై ఏళ్ళుంటాయి. ఫుల్ సూటులో ఉన్నాడు. చేతిలో ఒక తోలు జిప్ సంచి ఉంది.

"మా కంపెనీ తరపున ఓ విషయం దర్యాప్తు చెయ్యమని మిమ్మల్ని కోరడానికి" వచ్చాను అన్నాడు కృష్ణ.

"ఏమిటది?" అడిగాడు యుగంధర్.

"రామారావుగారనే ఆయన లక్ష రూపాయల్కి ఒక వజ్రాల నెక్లెసు మా కంపెనీలో ఇన్సూరు చేశారు. ఆ నెక్లెసు దొంగిలించబడిందని ఇవేళ రిపోర్టు ఇచ్చి మాకు తెలియజేశారు. పోలీసులు ఆ దొంగతనం ఎలాగూ దర్యాప్తు చేస్తారనుకోండి. మా కంపెనీ తరపున కూడా ఎవరయినా దర్యాప్తు చేస్తే మంచిదని భావించారు." అన్నాడు కృష్ణ.

"దొంగతనం గురించి వివరాలు ఏమయినా తెలుసా?" అడిగాడు యుగంధర్.

"రామారావుగారు ఆ నెక్లెసుని ఇనపపెట్టెలో పెట్టారు. చాలా గట్టి ఇనపపెట్టె అది. హాలుకి పక్కన ఉన్న గదిలో ఉంది. ఆ ఇనపపెట్టె ఇవాళ మధ్యాహ్నం ఆ గదిలోకి ఎందుకో వెళ్ళగా ఇనపపెట్టె తలుపు కొంచెం తెరిచి ఉండటం గమనించారట. వెంటనే లోపల చూస్తే వజ్రాల నెక్లెసు లేదట"

"ఆ ఇనపపెట్టెలో ఇంకా ఏమైనా నగలున్నాయా?"

"గాజులు, కమ్మలూ మొదలయిన నగలు చాలా ఉన్నాయి. అన్నీ కలిసి పదివేల రూపాయల ఖరీదుంటాయి. వాటిలో ఏదీ దొంగలింపబడలేదు. ఆ నెక్లెస్ ఒక్కటే పోయింది."

"దొంగ ఇనపపెట్టెని ఎలా తెరిచాడు?"

"బద్దలు కొట్టలేదు. అసలు తాళం చెవితోనో, దానికి సరిపోయే మారుతాళం చెవితోనో తెరిచి ఉండాలని ఇనస్పెక్టర్ అన్నాడు."

"దొంగతనం ఎప్పుడు జరిగిందీ తేలిందా?"

"అదీ నిర్ధారణగా తేలలేదు. రామారావుగారు ఆ ఇనప పెట్టె తెరిచి నాలుగు రోజులు దాటిందట. కనుక ఈ నాలుగు రోజుల్లో ఎప్పుడయినా జరిగి ఉండవచ్చు నంటున్నారు."

"ప్రత్యేకంగా ఎవర్నయినా అనుమానిస్తున్నారా?"

"ఇంటిలో ఇద్దరు నౌకర్లున్నారు. దాసీది ఒకతె ఉంది. పోలీసువాళ్ళు ఆ ముగ్గుర్నీ అనుమానిస్తున్నారు. నౌకర్లని అనుమానించడం మామూలేగా?" అని నవ్వాడు కృష్ణ.

"బయటినుంచి దొంగ వచ్చి నెక్లెసు అపహరించి ఉండవచ్చు. లేదా పనివాళ్ళలో ఎవరో బయట వాళ్ళెవరితోనైనా లాలూచీ చేసి దొంగతనం చేసి ఉండవచ్చు!" అన్నాడు యుగంధర్.

"మా కంపెనీ తరపున దర్యాప్తు చేయడానికి అంగీకరిస్తారా?"

"దర్యాప్తు చేయడమంటే ఏం చేయాలి?" అడిగాడు యుగంధర్.

"ఆ నెక్లెస్ ఎలా దొంగిలించబడింది? ఎవరు దొంగిలించారు? దాన్నేం చేశారు? ఈ విషయాలు తెలుసుకోవాలి. సాధ్యమైతే దాన్ని సంపాదించాలి" అన్నాడు కృష్ణ. ఒక క్షణం ఆగి, "మీ ఫీజు ఎంతో చెప్పండి?" అని గొణిగాడు.

"పోలీసులకి రిపోర్టు ఇచ్చారుగా! ఈ పనంతా వాళ్ళెలాగూ చేస్తారనుకుంటాను"

కృష్ణ ఒక నిమిషం ఏమీ మాట్లాడలేదు.

"నిర్మొహమాటంగా చెబుతాను. అసలు దొంగతనం జరగలేదని నాకు అనుమానంగా ఉంది" అన్నాడు.

"మీకా అనుమానం ఎందుకు కలిగింది?"

"ఇనప పెట్టెకి రెండు తాళం చెవులున్నాయి. రెండూ తన దగ్గిరే ఉన్నాయని రామారావుగారే అన్నారు. వాటిలో ఒకటి ఎవరో దొంగిలించారనీ, ఆ రెండో తాళం చెవి తన తాళం చెవుల గుత్తిలో లేని విషయం, నెక్లెస్ పోయిన సంగతి తెలిసేవరకూ తను గమనించనే లేదనీ ఆయన అన్నారు. ఆయనే నెక్లెస్ దాచేసి.." అని కృష్ణ నవ్వాడు.

"మీకు అనుమానం కలగడానికి కారణం? రామారావుగారు బాగా కలవారని విన్నాను."

"ఎంత చెట్టుకు అంతగాలి. ఆయన ఏం ఇబ్బందుల్లో ఉన్నారో మనకేం తెలుసు. ఆ విషయం మీరు చేసే దర్యాప్తులో బయటపడిపోతుందిలెండి."

రాజు యుగందర్ని రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

"మిష్టర్ కృష్ణా! క్షమించాలి. నేనీ కేసు తీసుకోలేను" అన్నాడు యుగంధర్.

కృష్ణ ఆశాభంగం పొందిన ముఖంతో యుగంధర్‌ని చూశాడు. "చాలా బిజీగా ఉన్నారా?" అడిగాడు.

యుగంధర్ మాట్లాడలేదు. ఆ వచ్చిన మనిషి లేచి నిలుచున్నాడు. "వస్తాను. మీకు వీలుంటే నాకు టెలిఫోను చేయండి" అని విజిటింగ్ కార్డు బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు.

అతని కారు స్టార్టు అయిన తర్వాత "చాలా చిత్రంగా ఉంది ఈ నెక్లెస్ విషయం. నెక్లెస్‌ని తన బావకి ఇస్తానని సరళ చెప్పింది కదూ! ఇవ్వలేదంటారా?" అడిగాడు రాజు.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. రామారావు నెక్లెసు పోయిందని పోలీసులకి మధ్యాహ్నం రిపోర్టు ఇచ్చాడు. న్యాయానికి సరళ ఆ లోపునే నెక్లెసు రామారావుకి ఇచ్చి ఉండాలి."

"మీరు ఇన్సూరెన్సు కంపెనీ కేసెందుకు తీసుకోలేదు? మనకి ఇప్పుడు వేరే కేసేమీ లేదుగా! సరళగానీ, మంగళగానీ మన క్లయింటు కాదుకదా!" అన్నాడు రాజు.

"అవును, కాని వాళ్ళ రహస్యాలు బయటపెట్టే అధికారం మనకి లేదు. ఈ కేసు తీసుకుంటే మనకి తెలిసిన విషయాలు చెప్పవలసి వస్తుంది."

"నౌకర్లలో ఎవరినైనా జైలులో పెట్టినా, దొంగతనం జరిగిందని ఇన్సూరెన్సు కంపెనీ రామారావుకి డబ్బిచ్చినా మనం చూస్తూ ఊరుకోగలమా!" అడిగాడు రాజు.

"అదే వచ్చిన చిక్కు, అందుకే ఏ క్లయింటు తరపునా కాకుండా మనకు మనమే ఈ కేసు దర్యాప్తు చెయ్యాలి. నిర్దోషులకి అపచారం జరగకుండా చూడాలి. ఎవరూ నష్టపడకుండా జాగ్రత్తపడాలి రాజూ. అర్జంటుగా నువ్వు మంగళ ఇంటికి వెళ్ళి సరళ ఇంట్లో ఉంటే పిలుచుకురా" అన్నాడు యుగంధర్.

యుగంధర్ చెప్పగానే రాజు చరచర వెళ్ళిపోయాడు.

అరగంట తర్వాత రాజు తిరిగి వచ్చి "సరళ ఇంట్లో లేదు సార్!" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళిందిట?" అడిగాడు యుగంధర్.

"పొద్దున మనం మంగళని కలుసుకుని వచ్చిన తర్వాత చెల్లెల్ని పిలిచి చివాట్లు పెట్టి, మీ వద్దకు వెళ్ళి క్షమాపణ చెప్పుకుని, నెక్లెసు రామారావుకు ఇచ్చిరమ్మని చెల్లెల్ని పంపిందట. అప్పుడు వెళ్ళిన మనిషి మళ్ళీ రాలేదని మంగళ చెప్పింది."

"నెక్లెసు పోయినట్లు రామారావు పోలీసులకి రిపోర్టు ఇచ్చిన విషయం మంగళకి తెలిసిందా?" అడిగాడు యుగంధర్

"ఆఁ. పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చి ఆమెని నెక్లెస్ విషయం అడిగాడుట."

"మంగళ ఏం చెప్పింది?"

"తనకేమీ తెలియదన్నదిట."

"జరిగింది చెబితే తన చెల్లెలిమీదకి నేరం వస్తుందేమోనని అబద్ధం చెప్పిందిట. మనల్ని కూడా ఏమీ చెప్పవద్దని వేడుకున్నది. తన చెల్లెలు రాగనే నెక్లెసు తీసుకుని స్వయంగా తనే వెళ్ళి రామారావుకి ఇచ్చేసి వస్తానని చెప్పింది."

యుగంధర్ ఆలోచిస్తూ కాసేపు మౌనంగా ఉండి పోయాడు. "ఇది చాలా చిక్కు పరిస్థితే! మనం ఒకసారి రామారావుని కలుసుకోవడం మంచిది" అంటూ లేచాడు.

కారు దిగి గుమ్మం దగ్గరికి వెళ్ళి "రామారావుగారున్నారా?" అడిగాడు రాజు.

"లేరు. క్లబ్బుకి వెళ్ళారు."

"క్లబ్బు ఎక్కడున్నది?"

"మౌంట్ రోడ్లో. జెంటిల్ మెన్స్ క్లబ్" చెప్పాడు నౌకరు.

రాజు కారు దగ్గరికి వచ్చి "క్లబ్బుకి వెళ్ళి రామారావుని కలుసుకుందామా?" అన్నాడు యుగంధర్‌తో.

"ఆ!"

పదిహేను నిమిషాలలో క్రిజ్లర్ కారు క్లబ్బు ముందు ఆగింది. యుగంధరూ, రాజూ లోపలికి వెళ్ళి ఒకసారి క్లబ్బంతా కలయచూశారు. ఒక మూల కొంతమంది పేకాడుతున్నారు. మరొకవైపున కొందరు బిలియర్డ్సు ఆడుతున్నారు. ఒక నౌఖరు ఒక్కొక్కరి దగ్గరికి వెళ్ళి పుస్తకంలో సంతకాలు పెట్టించుకుంటున్నాడు. యుగంధర్ ఆ నౌఖర్ని పక్కకి పిలిచి "రామారావుగారున్నారా?" అడిగాడు.

అతను క్లబ్బంతా కలయ చూసి "ఇందాక ఇక్కడే ఉన్నారు. కాంటీన్లోకి వెళ్ళారేమో?" అని వెళ్ళిపోయాడు.

యుగంధరూ, రాజూ కాంటిన్ వైపు వెళ్ళారు. కాంటిన్‌లో అడుగు పెట్టారో లేదో యుగంధర్‌కి జోగయ్య కనిపించాడు. జోగయ్య యుగంధర్ని చూడలేదు. కాఫీ తాగుతూ ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

అతని దగ్గరికి వెళ్ళి భుజం మీద చెయ్యివేసి "హాల్లో మిష్టర్ జోగయ్యా!" అన్నాడు యుగంధర్. జోగయ్య ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు. అతని మొహంలో నెత్తురు చుక్కలేదు.

"పొద్దున్న టెలిఫోను చేసినందుకు చాలా థాంక్స్" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

జోగయ్య ఖంగారుగా "దానికేం ఫర్వాలేదు లెండి. నాతో మాట్లాడడానికి వచ్చారా?" అన్నాడు లేచి నిలుచుంటూ.

యుగంధర్ మళ్ళీ నవ్వాడు. "లేదు మీకోసం రాలేదు. ఆయన మీ స్నేహితుడు రామారావుగారనుకుంటాను. ఆయనతో మాట్లాడడానికి వచ్చాను" అన్నాడు.

అంతవరకూ తనకేమీ పట్టనట్లు కాఫీ కప్పువైపు చూస్తున్న రామారావు యుగంధర్ వైపు తిరిగాడు. సన్నగా పొడుగ్గా ఉన్నాడు. పైకి దువ్వుకున్న పల్చని జుట్టులో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు - పీక్కుపోయిన దవడలు, సిగరెట్టువల్ల నల్లబడిన పెదిమలు, కళ్ళకింద గుంటలు - ఎర్రని ఒంటి రంగు, తీక్షణమైన చూపు - మనిషి వికృతంగానూ లేడు, అందమైనవాడూ కాడు. ఒకసారి చూస్తే ఆ మొహాన్ని ఓ పట్టాన మరిచిపోలేదెవరూ.

"మీరెవరు?" అడిగాడు రామారావు చేతికున్న రిస్టువాచీ బంగారం గొలుసు సవరించుకుంటూ.

"నా పేరు యుగంధర్. ఇతను నా అసిస్టెంటు రాజు."

"యుగంధర్ పేరు బాగుంది. నాతో మీకేం పని?"

అడిగాడు. అతని గొంతులో ఒక రకమైన గాంభీర్యమూ, క్రౌర్యమూ ధ్వనిస్తున్నాయి.

"మీ ఇనప పెట్టెలోంచి మాయమైన నెక్లెసు గురించి మాట్లాడటానికి వచ్చాను" అన్నాడు యుగంధర్.

రామారావు యుగంధర్ని ఒకసారి ఎగాదిగా చూశాడు. "నెక్లెసు గురించి ఏం మాట్లాడాలి?" అడిగాడు.

"పోలీసులకి మీరిచ్చిన రిపోర్టు ఉపసంహరించుకోవడం మంచిదనుకుంటాను."

యుగంధర్ ఆ మాట అంటుండగా జోగయ్య లేచి "ఇప్పుడే వస్తాను" అని వెళ్ళిపోయాడు.

యుగంధర్ రాజుని చూసి కళ్ళతో సంజ్ఞ చేశాడు. రాజు జోగయ్య వెనువెంట వెళ్ళాడు.

"మీ ఇనపపెట్టె, రెండో తాళం చెవి ఏమైందో మీకు తెలుసా?" అడిగాడు యుగంధర్.

"తెలియదు"

మీ భార్య మంగళ మీ ఇంట్లోంచి వెళ్ళిపోతున్నప్పుడు దాన్ని తీసుకు వెళ్ళింది."

"అలాగా!"

"ఆ తాళం చెవితో మీ ఇనప్పెట్టె తెరిచి నెక్లెసు ఆమె తీసుకుని వెళ్ళి ఉండచ్చు"

"అసాధ్యం. ఆమె నా ఇంట్లో అడుగు పెట్టలేదు"

"ఎవరిచేతికైనా తాళం చెవి ఇచ్చి, ఇనపపెట్టె తెరిచి నెక్లెసు తీసుకురమ్మని చెప్పి ఉండవచ్చు"

"అయినా అది దొంగతనమే. నా ఇంటికి వచ్చి, నా ఇనప్పెట్టె తెరిచి, నెక్లెసు తీసుకువెళ్ళడం దొంగతనం కాక ఏమవుతుంది?"

"ఆ మనిషి మీ భార్య ప్రతినిధిగా ఆ పనిచేస్తే?"

"అయినా అది నా ఇల్లు"

"మీ భార్యకి మీకు విడాకులు ఇవ్వలేదు. అది ఆమె ఇల్లుకూడా అవుతుంది. ఆమె ఆదేశానుసారం మీ ఇంట్లోకి వచ్చి ఇనపపెట్టె తెరిచి నెక్లెసు తీసుకు వెళ్ళి ఉంటే అది నేరం ఎందుకు అవుతుంది. ఆ నెక్లెసు మీ భార్యది. ఆమె ఇంటిలో ఇనపపెట్టెలోంచి నెక్లెసు తీసుకురమ్మని, ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చి పంపింది కనక ఆ మనిషి దొంగతనం చెయ్యలేదు. మీ భార్యకూడా దొంగతనం చెయ్యలేదు. తన నగ తను ఇంటిలోంచి తెప్పించుకుంది"

"నా ఇల్లు ఆమె ఇల్లు కాదు. ఆమె వేరే ఇంటిలో ఉంటోంది."

"అయినా మీరూ, ఆమె విడాకులు పొందనంతకాలం మీ ఇల్లు ఆమె ఇల్లే"

"సరే అయితే?"

"ఇన్సూరెన్సు కంపెనీవారికి ఈ విషయాలు తెలిస్తే ఇదంతా లాలూచీగా వాళ్ళు భావించవచ్చు. ఇన్సూరెన్సు డబ్బు సంపాదించేందుకు మీరు దొంగతనం జరిగినట్లు అబద్ధం చెప్పారనవచ్చు. అది చాలా పెద్ద నేరం."

"మా గొడవలతో మీకేం సంబంధమో దయచేసి చెప్పండి" అడిగాడు రామారావు.

"అమాయకులు నిందింపబడటం కానీ, ఎవరూ అన్యాయంగా డబ్బు కాజేయడం కానీ చూస్తూ నేను ఊరుకోలేను."

"అమాయకులు నిందింపబడరు కానీ, ఎవరూ అన్యాయంగా డబ్బు కాజేయడం కానీ చూస్తూ నేను ఊరుకోలేను"

రామారావు అయిదు నిమిషాలు ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. "మంగళ దగ్గిరే నిజంగా నెక్లెసు ఉంటే నోరు మూసుకుని ఊరుకోమని చెప్పండి. ఈ నెక్లెసు గురించి మీకు తెలిసిన విషయాలు హాయిగా మరిచిపొండి. అలా మర్చిపోగలిగితే మీకు వెయ్యిరూపాయలు ఇస్తాను" అన్నాడు రామారావు.

"అంత సులభంగా నేను ఏదీ మర్చిపోలేను" అన్నాడు యుగంధర్.

రామారావు నవ్వాడు. "అయితే మరిచిపోవడానికి ఎంత కావాలో చెప్పండి" అన్నాడు.

యుగంధర్ లేచి నిలుచున్నాడు. "పోలీసులకి ఇచ్చిన రిపోర్టు ఉపసంహరించుకోండి అప్పుడు నేను మర్చిపోతాను" అన్నాడు.

రామారావు యుగంధర్ని కోపంగా చూశాడు. "మీరు చెప్పినదంతా నిజమని నేనెలా నమ్మడం?" అడిగాడు.

"అబద్ధ చెప్పడం వల్ల నాకేం లాభం?"

"ఏమో! నిజమయితే, మంగళ దగ్గిర ఆ నెక్లెస్ ఉంటే నాకోసారి తెచ్చి చూపించండి."

రామారావు అలా అడుగుతాడని యుగంధర్‌కి ముందే తెలుసు. దానికి జవాబు చెప్పదలచుకోలేదు.

జవాబు చెప్పకుండా యుగంధర్ వెళ్ళిపోయాడు. వెళ్ళి పోతున్నప్పుడు తన వెనక రామారావు నవ్వడం వినిపించింది.

యుగంధర్ కారు దగ్గరికి వెళ్ళేటప్పటికి రాజూ, జోగయ్యా కారు తలుపుకి ఆనుకుని సిగరెట్లు కాలుస్తున్నారు. యుగంధర్ని చూసి జోగయ్య ముందుకి వచ్చాడు.

యుగంధర్ చెయ్యిచాచి "జోగయ్యా! అన్నట్టు మరిచిపోయాను. నిన్న నువ్వు ఇనప్పెట్టె తాళం చెవి ఇవ్వనేలేదు" అన్నాడు.

"అవును. ఇప్పుడు కూడా ఇవ్వను" అన్నాడు అతను.

"నీకా తాళం చెవి ఎందుకు?"

"మీ కెందుకు?"

"నిన్ను కాపాడడానికి"

"అంటే?"

"ఇవాళ పొద్దున్న సరళ నెక్లెస్ రామారావుకి ఇవ్వడానికి వెళ్ళింది. రామారావు నెక్లెస్ తీసుకుని ఇనప పెట్టెలో పెట్టి ఉంటాడు. ఆ తర్వాత నువ్వు ఆ నెక్లెస్‌ని దొంగిలించావనడానికి వీలుంది. నీ దగ్గర ఇనపపెట్టె తాళచెవి ఉందిగా."

"సరళ నెక్లెస్ రామారావుకిచ్చివుంటే - అతను దాన్ని ఆ ఇనపపెట్టెలో పెట్టి ఉంటే - బావుండేది. ఆ రెండు పనులూ జరగలేదు."

"నీకెలా తెలుసు?"

"పొద్దున్న నుంచీ నేను రామారావుతోనే ఉన్నాను."

"రామారావుకి నువ్వు ఏమీ చెప్పలేదు కదూ?"

"నేను ఫూల్‌ని కాను"

"ఎవరయినా చెబితే?"

"అతను నమ్మడు."

"ఎందుకని?"

"చెప్పి చూడండి. తెలుస్తుంది."

"నువ్వు చాలా తెలివైనవాడివని అనుకుంటున్నావు. ఏమీ ప్రయోజనం లేదు. నీకు రాగి కాని ముట్టదు. ఏదయినా ముట్టితే జైలు శిక్ష. అంతే" అని యుగంధర్ కారెక్కాడు.

●●●

**"యస్! యుగంధర్ స్పీకింగ్."**

"నేను మంగళని"

"ఆ!"

"మీరు సహాయం చెయ్యాలి. నా చెల్లెలు సరళ కనిపించడం లేదు" అన్నది మంగళ ఆదుర్దాగా.

యుగంధర్ కనుబొమలు చిట్లించాడు. చేతి గడియారం చూసుకున్నాడు. రాత్రి పది గంటలయింది.

"ఇవేళ పొద్దున్న నుంచీ కనిపించటంలేదు. అంతేనా?"

"అవును"



కౌముది

"ఈ మాత్రం దానికి ఆదుర్దా పడనవసరం లేదేమో?"

"సామాన్య పరిస్థితులలో ఆదుర్దా పడేదాన్ని కాను యుగంధర్‌గారూ! పొద్దున్న సరళ ఇంట్లిలోంచి బయటికి వెళ్ళినపుడు ఆమె లక్షరూపాయలు ఖరీదు చేసే వజ్రాల నెక్లెస్ తీసుకువెళ్ళింది. మిమ్మల్ని కలుసుకుని మీకు క్షమాపణలు చెప్పింది. ఇవాళ మధ్యాహ్నం నెక్లెస్ ఇనప పెట్టెలో కనిపించకపోయేసరికి మా వారు పోలీసులకి రిపోర్టు ఇచ్చారని తెలిసింది. కనుక సరళ మావారి ఇంటికి వెళ్ళలేదు. మిమ్మల్ని కలుసుకున్నదా? ఎక్కడికి వెళతానని చెప్పింది? "

"కలుసుకుంది. తిన్నగా రామారావుగారింటికి వెళతానన్నది."

"అందుకే ఆదుర్దా. అంత ఖరీదయిన నెక్లెస్ తీసుకుని ఎక్కడికి వెళ్ళివుంటుంది? ఏమైవుంటుంది?"

"మీ చెల్లెలు చిన్నపిల్ల కాదుకదా ఆదుర్దా పడనవసరంలేదేమో" అన్నాడు యుగంధర్.

"యుగంధర్‌గారూ సరళ పెంకి మనిషి. ధైర్యశాలి కూడా. కాని అవివేకురాలు. లౌకికం తక్కువ. సులభంగా చిక్కుల్లో ఇరుక్కుంటుంది. అందుకని నాకు భయంగా ఉంది."

"ముందూ వెనకా ఆలోచించకుండా తోచినపనల్లా చేస్తే చిక్కుల్లో ఇరుక్కోరు మరి?"

"యుగంధర్ గారు మీరు పెద్దవారు. కుర్రతనంవల్ల అనాలోచితంగా ఏదైనా చేస్తే క్షమించగల ఔదార్యం మీకుంటుంది. సరళ ఏమైందో, ఎక్కడుందో తెలుసుకోండి, మీరు 'ఊ' అంటే చాలు. నాకు ధైర్యం వస్తుంది."

యుగంధర్ ఒక నిమిషం ఆలోచించాడు. "సరే నా అసిస్టెంటు రాజుని మీ దగ్గరికి పంపుతాను. అతను అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పండి" అని రిసీవరు పెట్టేశాడు.

పక్కనే కూర్చున్న రాజు యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"రాజూ! ఈ కేసు చాలా అయోమయంగా ఉంది. వీళ్ళందరూ మోసగాళ్ళో లేక వీళ్ళల్లో కొంతమంది కొందర్ని మోసగిస్తున్నారో తెలియకుండా ఉంది. రామారావు ఇన్సూరెన్సు డబ్బుకోసం కాచుకున్నాడు. తన నెక్లెస్ పోలేదనీ, మంగళ దగ్గరే ఉన్నదని చెబితే అతను ఆ విషయం ఎవరికీ చెప్పవద్దనీ, నాకు లంచం ఇస్తాననీ అన్నాడు. ఇనపపెట్టె తాళం చెవి ఒకటి జోగయ్య దగ్గరే ఉంది. సరళ నెక్లెసు రామారావుకి ఇచ్చిన తర్వాత జోగయ్య నెక్లెస్ దొంగిలించాడా? సరళ నెక్లెస్ తెచ్చి తనకిచ్చింది కనుక మంగళ దగ్గర ఆ నెక్లెస్ లేదని రామారావుకి తెలుసుండాలి. అందుకే నెక్లెస్ చూపించమని నన్ను దబాయించాడా? జోగయ్య ఆడుతున్న నాటకం ఏమిటి? రామారావు ఇన్సూరెన్స్ డబ్బు తెచ్చుకున్నాక అతన్ని బ్లాక్ మెయిల్ చేద్దామనుకుంటున్నాడా? మంగళ కనిపించేటంత అమాయకురాలేనా? సరళ నెక్లెస్ ఎలాగో తెచ్చింది. తెచ్చిన తర్వాతనయినా దాన్ని తన దగ్గరే ఎందుకు ఉంచుకోలేదు? రామారావు ఏం చేయగలిగేవాడు కాదు కదా. చేజిక్కిన లక్షరూపాయల ఖరీదు చేసే నెక్లెస్ తిరిగి ఎందుకు పంపించేసింది? దాన్ని కోర్టు ద్వారానే రాబట్టుకోవాలని ఆమెకి ఎందుకా పట్టుదల? అన్యాయ మార్గంలో నెక్లెస్ సంపాదించడం ఆమెకి ఇష్టం లేదా? అయితే ఆమెకీ, ఆమె చెల్లెలికీ చాలా తేడా ఉందన్న మాట. ఏ విధంగానయినా సరే తనకి కావలసింది తెచ్చుకునే రకం సరళ. సరళ ఏమైంది? ఇక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళింది? రామారావు ఇంటికి వెళ్ళిందా తను చేసిన పనికి సిగ్గేసి ఎవరికీ కనిపించకుండా దాక్కుందా? లేక నెక్లెస్ చిక్కింది కనుక దాన్ని తీసుకుని పలాయనం అయిందా? లేక ఆమె దగ్గర నెక్లెస్ ఉన్నదని తెలిసిన వారెవరైనా ఆమెని ఇక్కణ్ణించి వెంబడించి, రామారావు ఇల్లు చేరుకునే లోపున ఆమెని పట్టుకుని దాచిపెట్టారా?" యుగంధర్ మాట్లాడడం ఆపాడు. కొంచెం సేపు ఉండి "రాజూ సరళ ఏమైందో తెలుసుకోవాలి, నువ్వు వెంటనే ఆ పనిమీద బయలుదేరు" అన్నాడు.

రాజు తిన్నగా మంగళ ఇంటికి వెళ్ళాడు. దాసీదానికి తన పేరు చెప్పి మంగళకి తను వచ్చినట్లు చెప్పమన్నాడు. క్షణంలో మంగళ హాల్లోకి వచ్చింది.

"మీ చెల్లెలు సరళ విషయం కనుక్కుందామని వచ్చాను. నన్ను యుగంధర్‌గారు పంపారు. ఇక్కణ్ణించి సరళ ఎన్ని గంటలకి బయలుదేరింది?"

"పది గంటల ప్రాంతాన"

"దాదాపు పదిన్నరకి మా ఆఫీసుకి వచ్చింది. అంటే ఇక్కణ్ణించి తిన్నగా మా ఆఫీసుకే వచ్చిఉండాలి. ఇక్కణ్ణించి టాక్సీలో బయలుదేరిందా? " అడిగాడు రాజు.

"ఊహు దాసీదాన్ని పంపి టాక్సీ తెప్పించుకోమని చెప్పాను. అవసరం లేదన్నది. ఈ వీధి చివర టాక్సీ స్టాండున్నది. బహుశా అక్కడ టాక్సీ ఎక్కివుంటుంది."

"ఈ ఊళ్ళో మీ బంధువులెవరయినా ఉన్నారా?"

"లేరు"

"సరళ స్నేహితులు ఎవరయినా ఉన్నారా? ఎవరింటిలోనైనా ఉన్నదేమో?"

"కొద్దిమంది స్నేహితురాళ్ళు మాత్రమే ఉన్నారు"

"వాళ్ళ పేర్లూ, చిరునామాలు తెలిస్తే చెప్పండి" అని రాజు డైరీ తీశాడు.

"పార్వతి, రాయపురంలో మాడా స్ట్రీటులో 192 నెంబరు ఇంటిలో ఉంటున్నది. పార్వతి సరళ క్లాస్‌మేట్. కృష్ణవేణి, సుమతి అనే ఇద్దరు స్నేహితురాళ్ళున్నారు. జార్జి టవునులో ఎక్కడో ఉంటున్నారు. వాళ్ళ అడ్రసులు నాకు తెలియవు. బహుశా పార్వతికి తెలిసి ఉండవచ్చు."

"బెంగుళూరులో మీ మామగారి ఇంటిలో ఉంటున్నానని చెప్పింది సరళ. అక్కడికి వెళ్ళిందేమో? ఆయన అడ్రసు చెబుతారా?"

"నేను మామయ్యకి టెలిగ్రాం ఇచ్చాను. సరళ అక్కడకి రాలేదని మామయ్య దగ్గిరనుంచి టెలిగ్రాం వచ్చింది. తరువాత సరళ అక్కడికి వెళితే వెంటనే నాకు తెలియజేస్తాడు."

"గుడ్" అని రాజు లేచి నిల్చున్నాడు.

"మిస్టర్ రాజూ.. యుగంధర్ గారు నామీద కోపంగా ఉన్నారా?" అడిగింది, మంగళ కొంచెం దగ్గిరిగా జరిగి.

"అబ్బే లేదు" అన్నాడు రాజు.

"పొద్దున్న వారిని సరిగా మర్యాద చేయనందుకూ, నిజం చెప్పనందుకూ ఆయనకి కోపం వచ్చి ఉంటే క్షమించమనండి. నా మనస్సు బాగాలేదు. పొరబాటు చేశాను. ప్లీజ్. సరళ జాడలు తెలుసుకోవాలి. నాకు చాలా భయంగా ఉన్నది" అన్నది.

"దయచేసి మీ చెల్లెలి ఫోటో ఇస్తారా?" అడిగాడు రాజు.

మంగళ తల ఊపి లోపలికి వెళ్ళి ఫోటో ఆల్బం తీసుకు వచ్చింది. "మీకు ఇష్టమొచ్చిన ఫొటో ఏరుకోండి" అన్నది.

రాజు ఆల్బం తెరిచాడు. మంగళ, సరళ చిన్నప్పుడు తీయించుకున్న ఫోటోలు చాలా ఉన్నాయి. అక్కచెల్లెళ్ళు ఇద్దరికీ కనీసం నాలుగేళ్ళయినా తేడా ఉందని చిన్నప్పటి ఫోటోలు చూస్తే తెలుస్తుంది. సరళ తన స్నేహితురాళ్ళతో తీయించుకున్న ఫోటోలు చాలా ఉన్నాయి. చాలా ఫోటోలలో సరళని గుర్తుపట్టడమే కష్టం అయింది రాజుకి. గౌనులు వేసుకుంది. ఇంగ్లీషువాళ్ళ మల్లే డ్రెస్ చేసుకుంది.

"మేము బెంగుళూరులో కంటోన్‌మెంటులో ఉండేవాళ్ళం. అక్కడ ఆంగ్లో ఇండియన్లు చాలామంది ఉన్నారు. మాకు వాళ్ళతో స్నేహాలు ఎక్కువ. మేమూ అప్పుడప్పుడు గౌనులు వేసుకునేవాళ్ళం" అన్నది మంగళ.

రాజు ఒక ఫోటో ఆల్బంలోంచి ఊడదీసి, జాగ్రత్తగా డైరీలో పెట్టుకున్నాడు.

"మీరు భయపడకండి. బహుశా మీ చెల్లెలు ఎవరి ఇంటిలోనో ఉండి ఉంటుంది. కనుక్కుంటాము."

మంగళ బలహీనంగా నవ్వింది. "థాంక్సు. అయితే ఇంకేం కావాలి?" అన్నది.

రాజు తలుపువరకూ వెళ్ళి చటుక్కున నవ్వుతూ వెనక్కి తిరిగి "మంగళాదేవిగారూ.. మీచెల్లెలికి ప్రమాదమేదైనా సంభవించి ఉండవచ్చని మీరు భయపడటానికి కారణం ఏమైనా ఉన్నదా?" అడిగాడు.

"లేదు" అన్నది మంగళ. "లక్షరూపాయలు ఖరీదయిన నెక్లెస్ కూడా తీసుకెళ్ళింది కదా! అందుకే భయం"

రాజు అక్కణ్ణించి బయలుదేరి వీధి చివర ఉన్న టాక్సీ స్టాండు వద్దకు వెళ్ళాడు. సరళ ఆనవాలు చెప్పి ఆమెకి ఎవరయిన పొద్దున్న బాడుగకి వెళ్ళారా అని డ్రయివర్లని అడిగాడు.

ఒక డ్రయివర్ ముందుకు వచ్చి, "వీధి కొసన ఉన్న అమ్మగారేనా సార్? పొద్దున్న నా బండి ఎక్కారు." అన్నాడు.

"ఎక్కడ దిగారు ఆమె?"

"మౌ బ్రీస్ రోడ్డులో ఈ ఇంటి దగ్గర దిగారు."

అది తమ ఆఫీసే కనక రాజు వివరాలు అడగలేదు.

"అక్కడ నీకు డబ్బు ఇచ్చి పంపేసిందా?"

"లేదు. ఇరవై నిమిషాలు అక్కడ కాచుకునున్నాను. తర్వాత ఆమె వచ్చి మళ్ళీ కారెక్కింది."

"అక్కణ్ణించి ఎక్కడికి వెళ్ళావు?"

"అన్నామలైపురానికి వెళ్ళమని చెప్పింది. ఆళ్వారుపేట దాటక ముందే ఆమె కారు ఆపమన్నది."

"ఆపమని?"

"నాకు బాడుగ ఇచ్చేసి దిగిపోయింది."

"రోడ్ మీద ఎవరైనా స్నేహితులు కనిపించారా?"

"ఏమో? నాకు తెలియదు" అన్నాడు డ్రైవర్.

రాజు అతని చేతిలో రూపాయినోటు పెట్టి అక్కణ్ణించి బయలుదేరాడు. తిన్నగా ఆళ్వారుపేట కార్నర్‌కి వెళ్ళాడు. అప్పటికి బాగా పొద్దుపోయింది. ఆ కార్నరులో ఉన్న కిళ్ళీకొట్లు అన్నీ మూసి ఉన్నాయి. రిక్షా స్టాండులో ఒకే ఒక రిక్షా ఉన్నది. సరళ ఆనవాలు చెప్పి, అటువంటి మనిషిని అక్కడ ఆవాళ పొద్దున్న చూశావా అని రాజు రిక్షా అతన్ని అడిగాడు.

అరగంట క్రితమే తను స్టాండుకి వచ్చాననీ, పొద్దున్నుంచీ స్టాండులో లేనని అతను చెప్పాడు. తెల్లారితే కానీ ఈలోగా ఎవరిని వాకబు చేసే ఏమీ ప్రయోజనం లేదని రాజు నిశ్చయించుకుని అక్కణ్ణించి తిన్నగా రాయపురానికి వెళ్ళాడు. పార్వతి ఇల్లు సులభంగానే కనపడ్డది. రాత్రి చాలా పొద్దుపోయినా ఆమె ఇంటిలో దీపాలు వెలుగుతున్నాయి.

రాజు తలుపు తట్టేసరికి ఒక యువతి వచ్చి తలుపు తీసింది. తన పేరు, తన వృత్తి, తను వచ్చిన పని చెప్పాడు రాజు.

"సరళ మా ఇంటికి రాలేదు" అన్నది పార్వతి.

"మీరు పొద్దున్న నుంచి ఇంట్లోనే ఉన్నారా?" అడిగాడు రాజు.

"సాయంత్రం సినిమాకి వెళ్ళాను. సరళ వచ్చివుంటే మా నాన్నగారు చెప్పేవారు. ఆయన ఇంటిలోనే ఉన్నారు."

"సుమతి, కృష్ణవేణిగార్ల చిరునామాలు మీకు తెలుసా?" అడిగాడు రాజు.

"ఎందుకు? సరళ అక్కడ ఉంటుందనా? ఉహూ ఇవాళ సాయంత్రం నేనూ, కృష్ణవేణి, సుమతి, సరళ కలిసి సినిమాకి వెళదాం అని ఏర్పాటు చేసుకున్నాం. కృష్ణ, సుమతి సాయంత్రం మా ఇంటికి వచ్చారు. సరళ కూడా సాయంత్రం ఇక్కడికి వస్తానన్నది. సరళకోసం చాలాసేపు కాచుకున్నాం. ఎంతసేపటికీ రాకపోయేసరికి, సినిమాకి టైం అయిపోతోందని మేము ముగ్గురం వెళ్ళాం. ఇప్పుడే థియేటరు నుంచి వాళ్ళిద్దరూ ఇళ్ళకు వెళ్ళారు" అన్నది.

"వాళ్ళిద్దరూ సినిమాకి బయలుదేరిన తర్వాత సరళ వాళ్ళిద్దరిలో ఎవరి ఇంటికయినా వెళ్ళివుండవచ్చుగా."

"ఏమో?"

"వాళ్ళ అడ్రసులు చెప్పడానికి మీకేమైనా అభ్యంతరమా?" అడిగాడు రాజు.

పార్వతి నవ్వింది. "లేదు. రాసుకోండి. కృష్ణవేణి, షావుకారు పేటలో మత్తు మొదలీ వీధిలో 114 ఇంటిలో ఉంటోంది. సుమతి, తిరువత్తూరులో సుబ్రమణ్యం కోవెల వీధిలో నెం 270 ఇంటిలో ఉంటోంది" అన్నది.

"థాంక్స్" అని రాజు వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ ఒకమాట."

రాజు ఆగాడు.

"ఇంతకీ సరళ గురించి ఈ రభస ఎందుకో, అసలు సంగతేమిటో చెప్పనేలేదు" అడిగింది పార్వతి.

"ఏమీలేదు. ఆమె పొద్దున్న వెళ్ళింది. తిరిగి ఇంటికి రాలేదు. ఆమె అక్క మంగళ ఆదుర్దాపడి తన చెల్లెలి జాడ తెలుసుకోమని మమ్మల్ని అడిగింది. అంతే."

"సరళ మైనారిటీ వెళ్ళని చిన్నపిల్లకాదు. తన జాగ్రత్త తను చూసుకోగలదు. వాళ్ళక్కయ్యకి ఎందుకంత భయం?"

"ఏమో?"

"ఒకరోజు ఇంటికి రానంత మాత్రాన ఇంత రభస చేస్తే సరళకి కోపం వస్తుంది."

"ఎందుకు?"

"అందరికీ రహస్యాలుంటాయి కదూ" అన్నది నవ్వుతూ.

"అంటే విపులంగా చెప్పండి?"

"విపులంగా చెప్పడానికి ఏమీలేదు."

రాజు ఒక నిమిషం ఆలోచించాడు. "సరళకి మొగ స్నేహితులున్నారా?" అడిగాడు.

పార్వతి మళ్ళీ నవ్వింది. "ఏదో మాటవరసకి అన్నాను. విడిచిపెట్టేటట్లు లేరే" అన్నది.

"ఈ విషయం చెబితే నాకు పని తగ్గుతుంది. సరళ గురించి రభస తగ్గుతుంది"

పార్వతి మళ్ళీ నవ్వింది. "ఎంతమంది స్నేహితులున్నది నాకు తెలియదు. ఒక స్నేహితుణ్ణి మాత్రం చూశాను. ఒక రోజున మేము బీచికి వెళితే అక్కడికి వచ్చాడు."

"అతని పేరేమిటి?"

"నాకు జ్ఞాపకం లేదు. ఆవేళ సరళనీ, అతన్నీ కోడంబాకంలో దింపి నేను వెళ్ళిపోయాను."

"అతని పేరు జోగయ్యా?" అడిగాడు రాజు చటుక్కున.

"అవును."

"థాంక్స్" అని రాజు అక్కణ్ణించి బయలుదేరి తిన్నగా కోడంబాకం వచ్చాడు. కోడంబాకంలో స్టేషన్ దగ్గిర కారు ఆపి, పబ్లిక్ టెలిఫోను బూత్‌లోకి వెళ్ళి యుగంధర్‌కి ఫోను చేసి, జోగయ్య ఇంటి నెంబరు అడిగి తెలుసుకుని కారెక్కాడు, జోగయ్య ఇంటిముందు కారు ఆపాడు. ఇల్లు తాళం వేసి ఉంది. ఇంటిలో ఎవరూ లేరు. సరళ జోగయ్య ఇంటికి వెళ్ళివుంటే ఇద్దరూ కలిసి ఏ సినిమాకో వెళ్ళివుంటారు. సినిమాకి వెళ్ళివుంటే తిరిగి వచ్చే టయిం అయింది. రాజు కారు ఇంటికి దూరంగా తీసుకువెళ్ళి ఆపి, జోగయ్య ఇంటివైపు చూస్తూ నిలుచున్నాడు.

## 6

జోగయ్య అడ్రసు అడగడానికి రాజు టెలిఫోను చేసిన తర్వాత యుగంధర్ కన్సల్టింగ్ గదిలో దీపం ఆర్పి మేడపై ఉన్న తన పడక గదిలోకి వెళ్ళాడు. సరళని వెదికి పట్టుకోవడం సాధ్యమైతే రాజు పట్టుకోగలడని యుగంధర్‌కి పూర్తి నమ్మకమున్నది. రొటీన్ దర్యాప్తు రాజు చాలా బాగా చేయగలడు. తను చేయవలసినది ఏమీలేదు.

పక్కమీద పడుకోగానే నిద్రపోవటం యుగంధర్‌కి అలవాటు. క్షణంలో నిద్రపోవటం, చీమ చిటుక్కుమంటే నిద్రలేపడం యుగంధర్‌కి మామూలే. అతని వృత్తికి ఆ అలవాటు చాలా అవసరం.

మంచం పక్కన ఉన్న బల్లమీద టెలిఫోను గణగణ మ్రోగేసరికి యుగంధర్ నిద్రలేచి పడుకునే రిసీవరు తీశాడు.

"యస్.. యుగంధర్ స్పీకింగ్"

"యుగంధర్ గారూ.. యుగంధర్ గారూ"

"ఆ"

"నేను మంగళని - యుగంధర్‌గారూ చాలా ఘోరం జరిగింది" ఒణుకుతున్న స్వరంతో గాభరాగా అంది మంగళ.

"ఏం జరిగింది?"

"ఎవరో పిస్తోలుతో కాల్చారు."

"ఎవరో ఎవర్నో పిస్తోలుతో కాల్చడమేమిటి?"

"అవునండీ. మా ఇంటి కాంపౌండులో ఎవరో ఎవర్నో పిస్తోలుతో కాల్చారు"

"మీకెలా తెలుసు?"

"పిస్తోలు పేలడం వినపడింది. కిటికీలోంచి తొంగి చూశాను. గేటు దగ్గిరవున్న నైట్ క్వీన్ పొదవెనక ఎవరో పడున్నారు. ఓ మనిషి పరుగెత్తుకు పోవడం చూశాను."

"మీరు వెళ్ళి చూడలేదా?"

"అమ్మయ్యో నేను వెళ్ళి చూడడమే?"

"ఇంట్లో మగవాళ్ళెవ్వరూ లేరా?"

"లేరు. దాసీది ఉంది. అది నాకన్నా భయస్తురాలు."

"పోలీసు స్టేషన్‌కి ఫోను చేయండి."

"చేస్తాను. ఈ ఘోరం మా కాంపౌండులో ఎందుకు జరిగింది?"

"నాకు ఎలా తెలుస్తుంది?"

"యుగంధర్ గారూ! సరళ కనిపించిందా?"

"లేదు, రాజు ఆ పనిమీదే ఉన్నాడు."

"యుగంధర్ గారూ! దయచేసి మీరు వెంటనే మా ఇంటికి రాగలరా?"

"ఎందుకు?"

"నాకెవరూ ఆప్తులు లెరు. పోలీసులూ గొడవ నాకు అలవాటు లేదు. మీరుంటే ధైర్యంగా ఉంటుంది."

యుగంధర్ కొంచెం విసుగ్గా "ఎవరో ఎవర్నో కాలిస్తే మీకెందుకు గాభరా?"

"ప్లీజ్ యుగంధర్ గారూ" ఆమె స్వరంలో దైన్యమూ, దుఃఖమూ ధ్వనించాయి.

"ఆల్ రైట్ వస్తున్నాను. మీరు పోలీసులకి రిపోర్టు ఇవ్వండి" అని చెప్పి యుగంధర్ చకచక దుస్తులు వేసుకుని బయలుదేరాడు. మంగళ ఇంటికి చేరుకునేటప్పటికి పోలీస్ నైట్ పెట్రోల్ కారొకటి ఇంటిముందు ఆగి ఉంది.

గేటు దగ్గర కాపలా ఉన్న కానిస్టేబుల్ యుగంధర్ పేరు వినగానే వినయంగా పక్కకి తొలిగి దారి చూపించాడు. కాంపౌండులో టార్చిలైటు వెలుగుతున్న వైపుకి నడిచాడు యుగంధర్.

నైట్ క్వీన్ పొద దగ్గర ఒక పోలీసు సార్జంటు ఒక కానిస్టేబుల్ నిలబడి ఉన్నారు. ఎవరో రావటం గమనించి సార్జంటు టార్చి వెలుగు అటు తిప్పాడు. యుగంధర్ని చూడగానే గుర్తుపట్టి, టార్చి పక్కకి తిప్పేసి "మీరా సార్?" అన్నాడు.

"అవును. నేనే. ఏమిటి జరిగింది?" అడిగాడు.

"కంట్రోలు రూం నుంచి మాకు వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది ఈ ఇంటికి వెళ్ళమని. మేము మా ఇంటికి వచ్చి తలుపు తడితే మేడ మీదనుంచి ఒకామె ఎవరో ఎవర్నో ఈ తోటలో పిస్తోలుతో కాల్చారని చెప్పింది. వెంటనే తోటలోకి వచ్చి చూస్తే ఇది కనిపించింది" అంటూ సార్జంటు టార్చి వెలుగు నేలమీద వేశాడు.

నైట్ క్వీన్ పొద దగ్గర నేలమీద మట్టిలో ఒక మనిషి పడుకున్నాడు. గూడకట్టు పంచ, వొదులైన లాల్చీ వేసుకున్నాడు. రెండూ కాషాయి రంగులో ఉన్నాయి. మెళ్ళో రుద్రాక్షమాల, జడలు కట్టిన నల్లని జుట్టు, గడ్డం, చెతికి ఒక వెండి తాయెత్తు, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. కాళ్ళూ చేతులూ చాలా పొడుగ్గా ఉన్నాయి. పీక్కుపోయిన మొహం, సన్నని ముక్కు, గుంటలు పడ్డ కళ్ళు, జుట్టు నుదుటి మీద పడుతోంది. వెల్లికిలా పడుకున్నాడు. ఛాతీమీద నుంచి రక్తం కారి వీపు పక్కన మడుగు కట్టింది.

"కంట్రోల్ రూంకి వార్త పంపాను. ఇన్‌స్పెక్టర్ వస్తారు" అన్నాడు సార్జంటు.

సార్జంటు, పోలీస్ కానిస్టేబులు శవానికి కొంచెం దూరంగా నిలుచున్నారు.

"సరే ఇన్‌స్పెక్టర్ని రానియ్యండి. అంతవరకూ శవం దగ్గరకి వెళ్ళవద్దు. ఇన్‌స్పెక్టర్ రాగానే నన్ను పిలవండి" అని యుగంధర్ ఇంటివైపు నడిచాడు.

మంగళ హాల్లో సోఫా మీద కూర్చునున్నది. ఆమె వెనుక సోఫాని పట్టుకుని నిలుచున్నది దాసీది. మంగళ మొహం పాలిపోయి ఉంది.

"యుగంధర్ గారూ వచ్చారా?" అంటూ లేచి నిలుచున్నది ఆమె.

"కూర్చోండి. అసలు ఏం జరిగిందో చెప్పండి?" అడిగాడు యుగంధర్.

మంగళ ఓ నిమిషం పాటు మాట్లాడకుండా యుగంధర్ని చూస్తూ కూర్చున్నది. "భోజనం చేసి మేడమీద పడక గదిలోకి వెళ్ళి పడుకుని కాసేపు ఏదో పుస్తకం చదువుతున్నాను. పన్నెండు గంటల ప్రాంతాన దీపం ఆర్పేసి పడుకున్నాను. కొద్దిగా నిద్రపట్టిందనుకుంటాను.అంతలో 'ఢాం' అని పిస్తోలు చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడి నిద్రలేచాను. కిటికీలోంచి చూశాను ఎవరో గేటులోంచి బయటకి పరిగెత్తుతున్నారు. నైట్‌క్వీన్‌పొద దగ్గిర ఎవరో పడున్నట్లు ఆకారం కనిపించింది. వెంటనే మీకు ఫోను చేశాను. అన్నది.

"ఆ పరిగెత్తిన మనిషి ఎలా ఉన్నాడు?"

"ఏమో? అస్పష్టంగా ఒక ఆకారం కనిపించిది. అంతే. ఎలా ఉంటాడో చెప్పలేను. ఇంత దూరం నుంచి ఎలా తెలుసుకోగలను?"

"మీ దాసీది చూసిందేమో?"

"లేదు. అది వంటింటి పక్కన ఉన్న వసారాలో పడుకుంది. నేను వెళ్ళి లేపిందాకా నిద్ర లేవనే లేదు. ఆ పడివున్న మనిషి ఎవరు? చచ్చిపోయాడా?" అడిగింది మంగళ.

"అవును, చచ్చిపోయాడు. ఎవరో సన్యాసిలా ఉన్నాడు. మీకెవరయినా సన్యాసి తెలుసా?"

మంగళ రెండు నిమిషాలు ఆలోచించింది. తల తిప్పి "ఊహూ ఏ సన్యాసితోనూ నాకు పరిచయంలేదు. నా కటువంటి నమ్మకాలు లేవు" అన్నది.

అంతలో పోలీసు కానిస్టేబులు వచ్చి ఇన్‌స్పెక్టర్ వచ్చారని చెప్పాడు.

యుగంధర్ అతనితో శవం ఉన్న చోటికి వెళ్ళాడు.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు పాంటు జేబులో చేతులు పెట్టుకుని శవం పక్కన నిలుచుని చూస్తున్నాడు.

"హల్లో ఇన్‌స్పెక్టర్ మీరే వచ్చారా?" అన్నాడు యుగంధర్.

"కష్టమైన కేసులన్నీ ఏ.సి నాకే అప్పచెపుతారుగా"

"ఇది కష్టమైన కేసా?" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"అలాగే కనిపిస్తోంది యుగంధర్.. ఏమిటి గొడవ?" అడిగాడు స్వరాజ్యరావు.

"నాకు ఏమీ తెలియదు." అని యుగంధర్ మంగళ తనకి ఫోను చేయడం, తను రావడం మంగళతో మాట్లాడిన విషయాలు చెప్పాడు.

"మీకు ఆమెతో ఇంతకు ముందు పరిచయముందా?"

"అవును" అన్నాడు యుగంధర్ ముక్తసరిగా.

స్వరాజ్యరావు జేబులోనుంచి సిగరెట్ కేసు తీసి, యుగంధర్‌కి ఓ సిగిరెట్ ఇచ్చి, తనొకటి వెలిగించి, ఆరిపోయిన అగ్గిపుల్లను జాగ్రత్తగా జేబులో వేసుకున్నాడు.

"ఇతన్ని పిస్తోలుతో కాల్చి చంపారు. ఇతని అడుగు జాడలు కాక మరొక రెండు జతల అడుగుజాడలు కూడా ఉన్నాయి ఇక్కడ" అంటూ స్వరాజ్యరావు టార్చి వెలుగు నేలమీద వేశాడు. "శవం పక్కన అడుగుజాడలున్నాయి. అందులో ఒక జత హతుడివి. ఇంకో రెండు జతలున్నాయి. ఒక జత స్త్రీ అడుగుజాడలు. ఇంకో జత పురుషుడివి. ఆ రెండు జతలు గేటు వైపుకి వెళుతున్నాయి. ఈ జాడలు దూర దూరంగా ఉన్నాయి. కనుక ఇద్దరూ పరిగెత్తారనుకోవచ్చు."

యుగంధర్ తల ఊపాడు.

"పోలీస్ సర్జన్ కాసేపట్లో వస్తాడు. ఆయన వచ్చి మనకి చెప్పగలిగిందేమీ ఉండదు. పిస్తోలుతో కాల్చి చంపబడ్డాడని తెలుస్తూనే ఉంది. ఎప్పుడు చంపబడిందీ కూడా తెలుస్తూనే ఉంది. ఈ ఇంట్లోనుంచి మీకు ఫోను చేసిన ఆమెని ఒకసారి వచ్చి శవాన్ని చూడమనడం మంచిది. ఆమెకు తెలిసిన మనిషేమో? ఎవరో అపరిచితుడు. ఎందుకు ఈమె ఇంట్లోకి వస్తాడు?" అన్నాడు మళ్ళీ స్వరాజ్యరవు.

"ఆమెని పిలిపించండి" చెప్పాడు యుగంధర్.

మంగళని పిలుచుకు రమ్మని సార్జంటుని పంపాడు స్వరాజ్యరావు.

యుగంధర్ శవం దగ్గరికి వెళ్ళాడు. మోకాళ్ళ మీద కూర్చుని టార్చి వెలుగులో శవాన్ని పరీక్షగా చూశాడు. గుండు సరిగ్గా గుండెలో తగిలింది. రక్తం అక్కడి నుంచే కారింది. ఆ మనిషి చొక్కాకి జేబులు లేవు. చేతిలో సంచిలేదు. అతనెవరో తెలిసే నిదర్శనాలు ఏమీలేవు. యుగంధర్ లేచి నిలబడుతుండగా టార్చి వెలుగు పక్కకి పడింది. ఆ వెలుగులో ఏదో మెరిసింది.

"అదేమిటి?" అంటూ యుగంధర్ అటు వెళ్ళాడు. స్వరాజ్యరావు కూడా యుగంధర్ వెనకే వెళ్ళాడు. శవానికి పదడుగుల దూరంలో గడ్డిలో పడివున్నది పిస్తోలు.

యుగంధర్ ఒంగాడు.

"వాటిని ముట్టుకోవద్దు. వేలిముద్రలుంటాయి" అని అరిచాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వాడు, "అలాగా!" అన్నాడు వ్యంగ్యంగా. ఒంగి, టార్చి వెలుగులో ఆ అట్టపెట్టెను, పిస్తోలుని పరీక్షగా చూశాడు. అది 32 కాలిబర్ పిస్తోలు.

ఆ అట్టపెట్టె నగలపెట్టె, యుగంధర్ దాన్ని నిన్న రాత్రి చూశాడు. ఆ పెట్టెనే అతడు జోగయ్య దగ్గరినుంచి తెచ్చి సరళకి ఇచ్చాడు. ఆ పెట్టెలోనే వజ్రాల నెక్లెస్ - లక్ష రూపాయల ఖరీదయిన నెక్లెస్ ఉన్నది. పెట్టె మూసిఉంది. అందులో నెక్లెస్ ఉందా? అది ఇక్కడికి ఎలా వచ్చింది? జేబులోంచి రుమాలు తీశాడు. జాగ్రత్తగా అట్టపెట్టెని రుమాలుతో పట్టుకుని మూత తెరిచాడు. అట్టపెట్టె ఖాళీగా ఉంది. అందులో నెక్లెస్ లేదు. పెట్టెమూత మూసేసి యథాస్థానంలో పెట్టేశాడు.

"హత్యకి కారణం దొంగతనం అయివుండాలి. అది నగల పెట్టె కదూ" అన్నాడు స్వరాజ్యరావు.

"అయ్యుండవచ్చు" అని యుగంధర్ జవాబు చెబుతుండగా సార్జంటు మంగళని వెంటబెట్టుకుని వచ్చాడు.

"ఈయన ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. ఈమె మంగళాదేవి" అని పరిచయం చేశాడు యుగంధర్.

మంగళ తల ఊపింది. బిత్తర చూపులతో నేలవేపు చూస్తున్నది.

"మీకు శ్రమ కలిగిస్తున్నందుకు చింతిస్తున్నాను. దయచేసి ఒకసారి శవాన్ని చూసి మీకు ఆ మనిషి తెలుసునేమో చెబుతారా?" అన్నాడు స్వరాజ్యరావు.

మంగళ తల ఊపింది.

సార్జంటు, కానిస్టేబుల్ టార్చీలు వెలిగించి వెలుగు శవం మీద వేశారు. మంగళ ఒక క్షణం శవం మొహం చూసింది. తల తిప్పేసుకున్నది. "ఎవరో నాకు తెలియదు" అన్నది.

"ఓసారి ఇటురండి" అంటూ స్వరాజ్యరావు మంగళని నగలపెట్టె పడివున్న చోటికి పిలుచుకు వెళ్ళాడు. కిందపడివున్న పెట్టెమీద టార్చి వెలుగు వేసి "ఇది మీదేనా?" అడిగాడు. మంగళ అయిదు నిమిషాలపాటు ఆ పెట్టె వైపు నిశ్చలంగా చూస్తూ ఉండిపోయింది. చివరికి "అవును" అన్నది.

స్వరాజ్యరావు ఒక నిట్టూర్పు వదిలి "అయితే దొంగతనం జరిగిందన్నమాట. ఇంట్లో ఈ పెట్టె ఎక్కడ పెట్టారు?" అడిగాడు మంగళని.

"అది నా దగ్గిర లేదు" అని యుగంధర్ వంక ప్రాధేయపూర్వకంగా చూసింది.

స్వరాజ్యరావు కాస్త చికాకుగా చూశాడు. "అంటే?" అడిగాడు.

"నా భర్త దగ్గరున్నదది."

"మీ భర్త దగ్గిర ఉన్నదంటే? అర్థమయ్యేటట్లు చెప్పండి"

"ఆయనా, నేను విడిగా ఉంటున్నాం. ఆయన ఇంటిలో ఇనప్పెట్టెలో ఉండాలి ఈ అట్టపెట్టె. అందులో నా నెక్లెస్"

"ఓ అలాగా" అని క్షణం ఆగి, "మీరు ఇంటిలోకి వెళ్ళండి నేను వస్తాను." అన్నాడు స్వరాజ్యరావు.

మంగళ యుగంధర్ని మరొకసారి చూసి ఇంటిలోకి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన తర్వాత ఇనస్పెక్టర్ యుగంధర్ వైపు తిరిగి "ఏమిటి కథ యుగంధర్?" అడిగాడు.

"అది చాలా పెద్ద కథ. తర్వాత నింపాదిగా చెబుతాను. అదుగో కారు వచ్చింది. పోలీస్ సర్జన్ అనుకుంటాను. వేలిముద్రల వాళ్ళూ, ఫోటోగ్రాఫర్లు కూడా వచ్చి ఉంటారు. ముందు ఆ పనులు కానియ్యండి" అని యుగంధర్ కూడా ఇంట్లోకి వెళ్ళాడు.

●●●

**రాజు చేతి గడియారం చూసుకున్నాడు.** ఒంటిగంట అయింది. విసుగ్గా వీధివంకా, జోగయ్య ఇంటివైపూ చూశాడు. జోగయ్యా, సరళా సినిమాకి వెళ్లివుంటే ఈ పాటికి తిరిగి రావలసింది. వాళ్లిద్దరూ ఊరు విడిచి పారిపోయారేమో అనుకుంటూ వెళ్లిపోదామని స్టార్టర్ మీదికి చెయ్యిపోనిచ్చాడు. అంతలో వెనక ఒక కారు హెడ్‌లైట్స్ జిగేలుమన్నాయి. ఆ కారు జోగయ్య ఇంటిముందు ఆగింది. జోగయ్య ఒక్కడే కారులోంచి దిగాడు. టాక్సీ అతనికి డబ్బు ఇచ్చేసి, ఇంటి గుమ్మం వైపు వెళ్లాడు.

టాక్సీ వెళ్లిపోయేంతవరకూ కాచుకుని తర్వాత రాజు జోగయ్య ఇంటివైపు తిరిగాడు. అప్పుడే జోగయ్య లోపలికి వెళ్లాడు. తలుపు గడియపెట్టలేదు తొయ్యగానే కీచుమని తెరుచుకుంది. "ఎవరు?" అంటూ జోగయ్య తలుపు దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు.

"నీ ఫ్రెండుని" అంటూ రాజు లోపలికి వెళ్లాడు.

జోగయ్య ఒక అరనిమిషం నిశ్చేష్టుడై నిలుచున్నాడు.

"ఎందుకు వచ్చావ్?" అడిగాడు.

"నిన్ను చూడడానికి, నిన్ను చూడకపోతే బతకలేను" అని అంటూ రాజు జోగయ్య దగ్గరికి వెళ్లాడు.

"జోగయ్యా సరళ ఎక్కడున్నది?" అడిగాడు.

ఆ ప్రశ్న అర్థంకానట్లు జోగయ్య బిత్తరపోయి చూశాడు.

"నిన్నే అడుగుతున్నాను. సరళ ఎక్కడుంది?"

"సరళా?" అనగలిగాడు జోగయ్య.

"అవును. సరళే - నెక్లెస్ దొంగిలించమని నీకు ఇనపపెట్టె తాళం చెవి ఇచ్చిన సరళ."

జోగయ్య ఒక నిట్టూర్పు వదిలాడు. "నాకు తెలియదు. నిద్రవస్తోంది. నువ్వు తక్షణం ఇంటిలోంచి అవతలికి నడు" అంటూ ముందుకు వచ్చాడు.

రాజు చేతులు బిగించి సిద్ధంగా ఉన్నాడు. రాజు పోట్లాటకి సిద్ధంగా ఉండడం గమనించి జోగయ్య వెనక్కి తగ్గాడు.

"మిష్టర్ రాజూ.. సరళ ఎక్కడున్నదో, ఏ గంగలో కలిసిందో నాకు తెలియదు. నా కనవసరం కూడా" అన్నాడు.

"ఇవేళ పొద్దున్న కానీ, మధ్యహ్నం కానీ నువ్వు సరళని చూశావా?"

"లేదు"

"నీ ఇంటికి రాలేదా!"

"లేదు"

"నిజమేనా?"

"ఆ!"

"అయితే ఓసారి నీ ఇల్లంతా వెతకనిస్తావా?"

"నిరభ్యంతరంగా"

అది చాలా చిన్న ఇల్లు. పది నిమిషాలలో ఇల్లంతా వెతికాడు రాజు. సరళ ఆ ఇంటిలో ఎక్కడ దాక్కున్నదని కాదు రాజు అనుమానం. ఆమె ఆ ఇంటికి వచ్చినట్లు నిదర్శనాలు ఎవైనా కనిపిస్తాయేమోనని వెతికాడు. నిదర్శనాలేవీ కనిపించలేదు.

"మళ్ళీ ఇంకోసారి వస్తాను" అని రాజు బయటికి వెళ్లి కారెక్కి తిన్నగ ఇంటికి వెళ్లాడు. యుగంధర్ ఇంట్లోలేడు. టెలిఫోను ఉన్న బల్లమీద ఒక ఉత్తరం ఉంది.

"వెంటనే మంగళ ఇంటికిరా - యుగంధర్"

ఏదో జరిగిందని గ్రహించాడు రాజు. కారు దగ్గరికి పరిగెత్తాడు. అతి వేగంగా కారు నడిపాడు.

8

మంగళ వెనకే యుగంధర్ ఇంట్లోకి వెళ్లాడు. మంగళ హాల్లో ఆగలేదు. తిన్నగా మెట్లెక్కి మేడమీదికి వెళ్లింది.

యుగంధర్ కూడా మెట్లెక్కాడు. మంగళ తన వెనక యుగంధర్ రావడం చూడలేదు. మంగళ తన గదిలోకి వెళుతుండగా యుగంధర్ పిలిచాడు. ఆమె చటుక్కున వెనక్కి తిరిగి "మీరా?" అన్నది గుండెలమీద చెయ్యి పెట్టుకుంటూ. "ఎవరో అనుకున్నాను. గుండె దడ దడమన్నది" అన్నది.

"సారీ!"

ఆమె తలుపుకి ఆనుకుని నిలుచుని "ఏమిటి?" అడిగింది.

"హత్య చేయబడ్డ ఆ సన్యాసి ఎవరో మీకు తెలియదంటున్నారు. నిజంగా తెలియదా?" అడిగాడు యుగంధర్.

ఆమె దీనంగా యుగంధర్ని చూసింది. "ఒట్టు నిజంగా తెలియదు" అన్నది.

"అతను ఇంత అర్ధరాత్రి మీ ఇంటికి ఎందుకు వచ్చాడు?"

"ఏమో!" అన్నది మంగళ.

"ఏమైనా దాస్తున్నారా?"

లేదని మంగళ తల తిప్పింది. యుగంధర్ మంగళని పరీక్షగా చూస్తున్నాడు.

అంతలో "మైడియర్ యుగంధర్" అని స్వరాజ్యరావు పిలుపు వినబడి యుగంధర్ కిందికి దిగి వెళ్లాడు.

"సర్జన్ శవాన్ని పరీక్ష చేశాడు. గుండెలోకి రెండు పిస్తోలు గుళ్లు దూసుకుపోయాయని చెప్పాడు. అంటే రెండు గాయాలు విడిగా కనిపించాయన్నమాట. అక్కడ దొరికిన పిస్తోలు చూశాను. అందులో అయిదు తూటాలున్నాయి. అది ఆరు తూటాలుండే పిస్తోలు కనుక 32 కాలిబర్ పిస్తోలులోంచి ఒకే ఒక గుండు పేల్చబడింది."

"అయితే రెండోగాయం ఎట్లా తగిలిందంటాడు డాక్టర్"

"క్షుణ్ణంగా శవ పరీక్ష చేస్తే కానీ చెప్పలేనని అన్నాడు. ఇంకో విషయం. హత్య పదకొండూ పదకొండున్నర మధ్య జరిగి ఉంటుందని సర్జన్ అన్నాడు" అని స్వరాజ్యరావు యుగంధర్ని సూటిగా కళ్లలోకి చూశాడు.

"అదెలా సంభవం? మంగళాదేవి నాకు ఫోను చేసేటప్పటికి పన్నెండున్నర అయింది. నేను గడియారం చూశాను. అంతకు అయిదు నిమిషాలకింద హత్య జరిగి ఉండాలి. పిస్తోలు పేలడం ఆమె విన్నది."

"సర్జన్ చెప్పిన విషయం చెప్పాను. పొద్దున్నే పోస్టుమార్టం రిపోర్టు వస్తుందిగా! మీరు చూడవచ్చు. చాలా అనుభవమున్న సర్జన్. పొరపాటు చెయ్యడు."

"అవునవును. విచిత్రంగానే ఉంది" అంటూ యుగంధర్ ఆలోచనలో పడ్డాడు. అంతలో రాజు వచ్చాడు.

వచ్చీ రావడంతోనే "హాల్లో సార్! ఏమిటి జరిగింది? మద్రాసు పోలీసు సిబ్బందంతా ఇక్కడే ఉనట్లుందే" అన్నాడు యుగంధర్‌తో.

"హత్య జరిగింది" అని యుగంధర్ హత్య వివరాలు రాజుకి చెప్పి "నువ్వు వెళ్లిన పనేమయింది ?" అడిగాడు.

"ఊహూ! కనిపించలేదు. జాడతెలియలేదు" చెప్పాడు రాజు.

స్వరాజ్యరావు ఆ ఇద్దర్నీ చెరొకసారి చూసి 'ఏమి'టని అడిగాడు.

"హత్యకేసు విచారిస్తున్న పోలీసు అధికారి దగ్గిర నేనెన్నడూ ఏమీ దాచలేదు. దాచను. చెబుతాను వినండి" అని యుగంధర్ జరిగినదంతా పూసగిచ్చినట్లు చెప్పి "ఈ సన్యాసి ఎవరో తనకి తెలియదంటున్నది మంగళ. సరళ ఎక్కడా కనిపించలేదు. నెక్లెస్ తన ఇనపపెట్టెలో లేదని అన్నాడు రామారావు. ఖాళీ పెట్టె శవం దగ్గర కనిపించింది. వీటిని బట్టి మీరు ఏం ఊహిస్తారు" అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు భుజాలు చరిచాడు. "తొందరపడి ఏదీ నిర్ణయించను. పిస్తోలు ఎవరిదో ముందు తెలుసుకోవాలి. సన్యాసికీ, మంగళకీ ఏమైనా సంబంధం ఉందేమో కనుక్కోవాలి. లేకపోతే ఈ సన్యాసికి ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతరులకి ఏమైనా సంబంధం ఉందేమో తెలుసుకోవాలి. వీటన్నిటి కన్నా ముఖ్యమైనది సన్యాసి 11.30 ప్రాంతాలకు హత్య చేయబడి ఉంటే మంగళకి 12.30కి పిస్తోలు పేలుడు ఎలా వినిపించిందేమో కనుక్కోవాలి" అని లేచి వెళ్లి సార్జెంటుతో ఏదో చెప్పి అయిదు నిమిషాలలో తిరిగి వచ్చి "ఓసారి ఇల్లంతా పరీక్షించాలి" అన్నాడు.

"ఎందుకు?" రాజు అడిగాడు.

"ఎవరైనా ఇంట్లోకి ప్రవేశించారేమో తెలుసుకోవాలి"

రాజూ, స్వరాజ్యరావు వెళ్లారు. యుగంధర్ హాల్లో కూర్చున్నాడు.

మంగళ మేడ దిగి హాల్లోకి వచ్చి "మీరు ఒంటిగా కూర్చునుండడం చూసి వచ్చాను." అన్నది.

"కూర్చోండి"

"సరళ జాడలు ఏమీ తెలియలేదా?"

"లేదు"

"సరళ ఏమయినా అపాయంలో ఉందేమో" అన్నది బెంగగా

యుగంధర్ ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు. "పిస్తోలు పేలుడు వినగానే మీరు కిటికీలోంచి చూశానన్నారు. ఏం కనిపించిందో మరొకసారి వివరంగా చెప్పండి" అడిగాడు.

"ఎవరో గేటువైపు పరిగెత్తడం చూశాను."

"ఊఁ!"

"నైట్‌క్వీన్ పొద దగ్గర నేలమీద ఎవరో పడుండడం చూశాను."

"ఇంకా?"

"ఇంకేం చూడలేదు"

యుగంధర్ కళ్ళు మూసుకున్నాడు. మంగళ చూసిన దృశ్యాన్ని తను ఊహించుకుంటున్నాడు.

"ఆ సన్యాసి ఎవరు?" అడిగింది మంగళ.

యుగంధర్ నవ్వి "నాకు తెలియదు" అన్నాడు.

స్వరాజ్యరావూ, రాజూ హాల్లోకి తిరిగి వచ్చారు. ఎవరూ ఇంటిలో ప్రవేశించలేదని ఇనస్పెక్టర్ తల తిప్పి యుగంధర్‌కి సంజ్ఞ చేశాడు.

సార్జంటు వచ్చి ఇనస్పెక్టర్ని పక్కకి పిలిచాడు. ఐదు నిమిషాల తరువాత స్వరాజ్యరావు తిరిగి వచ్చి "పక్కింటి వాళ్లకి కూడా 12.30 ప్రాంతాలలో పిస్తోలు ప్రేలుడు లాటి శబ్దం వినపడ్డదిట. ఏ కారో బాక్ ఫైర్ అయిందనుకున్నారుట. శవం పడున్న స్థలం మరొక్కసారి జాగ్రత్తగా చూడాలి" అని చెప్పి బయటకి వెళ్ళాడు. యుగంధరూ, రాజూ కూడా వెళ్లారు. టార్చిలైట్ల వెలుతురులో నేలంతా పరీక్షించారు.

"మూడు జతల అడుగుజాడలున్నాయి ఇక్కడ. 11.30కే ఆ సన్యాసి హత్య చేయబడి ఉంటే అతన్ని ఎక్కడో చంపి శవాన్ని తెచ్చి ఇక్కడ పడేసి ఉండాలి. ఆ అడుగు జాడలలో రెండు జతలు మొగవాళ్లని, ఒక జత స్త్రీవి. అంటే ఇద్దరు మొగాళ్లూ, ఒక స్త్రీ ఇక్కడికి వచ్చి వెళ్లారనుకోవచ్చు" అన్నాడు స్వరాజ్యరావు.

"లేదు. చెప్పులు లేని అడుగుజాడలు సన్యాసిని అయి ఉండాలి. అవి ఇంటివైపు వెళ్లేటప్పుడు పడ్డ అడుగుజాడలు. తిరిగి బయటికి వెళ్లే జాడలు లేవు" యుగంధర్ అభ్యంతరం చెప్పాడు.

స్వరాజ్యరావు యుగంధర్ని ఆశ్చర్యంతో చూశాడు.

"యుగంధర్.. పదకొండున్నరకి చచ్చిన మనిషి పన్నెండున్నరకి ఇక్కడికి నడిచెలా వచ్చాడు?" అడిగాడు.

"బతికున్నప్పుడు నడిచి రాగలడు. చాల సింపుల్ మై డియర్ స్వరాజ్యరావ్. పదకొండున్నరకి పూర్వం అతను ఇక్కడికి వచ్చి ఉండవచ్చు. పదకొండున్నరకే అతన్ని కాల్చి చంపి ఉండవచ్చు. పన్నెండున్నరకి మళ్లీ పిస్తోలు పేల్చి ఉండవచ్చు."

"పదకొండున్నరకి కాల్చి చంపివుంటే అప్పుడు మంగళకి పిస్తోలు పేలడం వినిపించిందా?"

"సైలెన్సరు ఉన్న పిస్తోలు అయివుండవచ్చు."

"గుడ్ గాడ్! అంతా అయోమయంగా ఉంది. పదండి. ఇక్కడ మనం చేయగలిగిందేమీలేదు. సన్యాసి ఎవరో తెలిసిన తర్వాత కానీ కేసు ముందుకు సాగదు" అని స్వరాజ్యరావు గేటువైపు నడిచాడు.

యుగంధర్ నైట్‌క్వీన్ పొద దగ్గరికి వెళ్లి నేలని పరీక్షగా చూశాడు. ఎవరో చాలాసేపు అక్కడ నిలుచున్నట్లు గడ్డి బాగా నలిగిపోయి ఉంది.

లోపలికి వెళ్లి తను వెళుతున్నాననీ, మళ్లీ మర్నాడు వస్తాననీ మంగళతో చెప్పి యుగంధర్ రాజుతో సహా ఇంటికి బయలుదేరాడు.

●●●

# 9

మర్నాడు పొద్దున్న ఎనిమిది గంటలకల్లా డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు యుగంధర్ కన్సల్టింగ్ రూంలో హాజరయ్యాడు.

"యుగంధర్ మీరు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు కనుక మనమిద్దరం కలిసి పనిచేయడం ఉభయులకీ మంచిదేమో!" అన్నాడు.

"ఇంతవరకూ ఈ హత్య కేసుతో నాకు ప్రమేయం ఏమీ లేదు. సరళ ఎక్కడున్నదీ కనుక్కోవడమే నాపని అన్నాడు యుగంధర్.

"సరళ కనిపించకపోవడానికీ, ఈ హత్యకీ సంబంధం ఉందనుకుంటాను" అన్నాడు స్వరాజ్యరావు.

"అవును. అదే ఆలోచించాలి. హత్య గురించి కొత్త విషయాలేమైనా తెలిశాయా" అడిగాడు యుగంధర్.

మీరు చలా హాయిగా నిద్రపోయాడు రాత్రి. నేను చచ్చేటంత పనిచేశాను. ఆ పిస్తోలు ఎవరిదో కనుక్కున్నాను"

"ఎవరిది?" రాజు అడిగాడు.

"మంగళ భర్త రామారావుది. అతను లైసెన్సు తీసుకుని రెండేళ్ల క్రితం ఆ పిస్తోలు కొన్నాడు. అతను ఇంకో రెండు పిస్తోళ్లు కూడా కొన్నాడు. .48 కాలిబర్ ఒకటి . 32 కాలిబర్‌ది ఒకటి. ఆ సన్యాసి గుండెలో రెండు పిస్తోలు గుళ్లు ఉన్నాయి ఒకటి 32 కాలిబర్ గుండు. ఇంకొకటి .48 కాలిబర్ గుండు"

"ఊ!" అన్నాడు యుగంధర్.

".48 కాలిబర్ గుండు సన్యాసి తొడుక్కున్న జుబ్బాలోంచి గుండెలోకి దూసుకున్నది. చొక్కా మీద తుపాకీ యందు మసి కనిపించింది. అంటే పిస్తోలు ఛాతీమీద పెట్టి హంతకుడు పేల్చాడు."

".32 కాలిబర్ గుండు?"

".32 కాలిబర్ పిస్తోలు చర్మానికి దగ్గరగా పెట్టి పేల్చ బడ్డది?"

"అంటే?" అడిగాడు రాజు.

"సన్యాసికి చొక్కా లేనప్పుడో, లేక సన్యాసి వేసుకున్న చొక్కా పైకి లాగో .32 కాలిబర్ పిస్తోలుతో గుండె మీద కాల్చాడు హంతకుడు. చొక్కా వేసుకునుండగా చొక్కా మీద గుండెకి దగ్గరగా పెట్టి .48 కాలిబర్ పిస్తోలు పేల్చాడు"

"సన్యాసి చావుకి ఏ గుండు కారణం?"

"అది చెప్పలేనన్నాడు సర్జన్. ఆ రెండు గుళ్లు ఒకదాని తర్వాత ఒకటి బహుకొద్ది వ్యవధిలో - ఒకటి రెండు నిమిషాల వ్యవధిలో పేల్చబడ్డాయి కనుక చావుకు ఏ గుండు కారణమైనదీ తేల్చి చెప్పలేకపోయాడు డాక్టరు. .32 కాలిబర్ పిస్తోలు కానీ ఉండవచ్చు. కానీ హేతువాదంతో ఆలోచిస్తే .48 కాలిబర్ పిస్తోలు ముందు పేల్చి ఉండాలని తేలుతోంది."

"ఎందువల్ల?" అడిగాడు యుగంధర్.

"సన్యాసి చొక్కా పైకి తీసి, పిస్తోలు గుండెమీద పెట్టి హంతకుడు పేల్చి ఉండడానికి అవకాశంలేదు. చొక్కా పైకి తీస్తూ ఉంటే సన్యాసి చూస్తూ ఊరుకుంటాడా. .48 కాలిబర్ పిస్తోలుతో ముందు చొక్కా మీద పేల్చాడు. సన్యాసి కింద పడిపోయాడు. తర్వాత చొక్కా పైకెత్తి రెండవ పిస్తోలుతో అంటే .32 కాలిబర్ పిస్తోలు చర్మానికి ఆనించి పేల్చి ఉంటాడు."

"హంతకుడు ఎందుకలా చేశాడంటారు?" అడిగాడు యుగంధర్.

"హత్య ఏ పిస్తోలుతో జరిగింది తేలక మనం తికమకలు పడడానికి"

"అట్టే తికమకలు పడకుండా కేవలం హేతువాదంతో నిర్ణయించారు మీరు. ఇలా నిర్ణయించువచ్చని హంతకుడు ఊహించి ఉండడా?"

"అతనికన్నా మనం తెలివైన వాళ్లమని అనుకుని ఉండడు" అన్నాడు స్వరాజ్యరావు ధీమాగా.

యుగంధర్ నవ్వాడు. "మీరు ఇప్పుడు విశదీకరించిన హేతువాదానికి ఎక్కువ తెలివితేటలు అవసరం మైడియర్ ఇన్స్పెక్టర్. సామాన్యమైన తెలివితేటలున్న వాళ్లెవరైనా మీరు చెప్పిన విషయం గ్రహించగలుగుతారు. హంతకుడు చాలా తెలివైనవాడనీ, చాలా తెలివిగా ఈ హత్య చేశాడని అనుకుంటాను. .48 కాలిబర్ పిస్తోలుతోనే ఈ హత్య జరిగిందని హేతువాదంతో మీరు నిర్ణయిస్తారని అనుకునే ఇలా చేశాడు."

స్వరాజ్యరావు ముఖం వేలం వేసి "అంతేనంటారా?" అన్నాడు.

"పిస్తోలు మీద వేలిముద్రలేవయినా కనిపించాయా?" అడిగాడు యుగంధర్.

"ఆ! నగల పెట్టెమీద వేలిముద్రలు లేవు కానీ, పిస్తోలు మీద స్పష్టమైన వేలిముద్రలున్నాయి. ఫైల్సన్నీ వెదికి పాత నేరస్థుల వేలిముద్రలతో పోల్చి చూడమని ఫింగర్ ప్రింట్స్ డిపార్టుమెంటుకి పంపాను. ఒకసారి ఆఫీసుకి ఫోను చేస్తానుండండి" అంటూ స్వరాజ్యరావు రిసీవర్ తీసి నెంబరు డయల్ చేసి, ఐదు నిమిషాలు మాట్లాడాడు.

"చాలా సులభంగా తేలింది యుగంధర్. ఫోర్జరీ కేసులో రెండేళ్లజైలు శిక్ష అనుభవించిన నాగయ్య అనే అతనివట" అన్నాడు స్వరాజ్యరావు. సంతోషంతో గర్వంగా ఒకసారి రాజుని చూసి "ఆ నాగయ్యని పట్టుకోమని ఆజ్ఞ ఇచ్చాను" అన్నాడు.

యుగంధర్ లేచి నిలుచున్నాడు. "ఆ నాగయ్య ఎవరో ఊహించవచ్చు. అతన్ని పట్టుకోవడం అంత కష్టంకాదు, పదండి" అన్నాడు.

"ఆ నాగయ్య ఎక్కడున్నాడో మీకు తెలుసా?"

"అతను నాగయ్య అని తెలియదు. జోగయ్య నాగయ్య అయివుండాలి. మారుపేర్లు పెట్టుకునేటప్పుడూ సామాన్యంగా అసలు పేరు మరిచిపోలేరు. అసలు పేరుకి పోలిక ఉన్న పేరే పెట్టుకుంటారు. ఈ కేసుతో సంబంధం ఉన్న వాళ్లల్లో ఇంతవరకూ జోగయ్య ఒక్కడే నేరాలు చెయ్యడంలో ఆరితేరినవాడిలా కనిపిస్తాడు." అంటూ యుగంధర్ కారు దగ్గరికి దారితీశాడు.

ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావూ, యుగంధరూ కారు వెనక సీటులో కూర్చున్నారు. రాజు డ్రయివ్ చేస్తున్నాడు. ఇరవై నిమిషాలలో ట్రస్టుపురంలో జోగయ్య ఇంటిముందు కారు ఆగింది. యుగంధరూ, స్వరాజ్యరావూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. జోగయ్య ఇంటి ముందు ఇంకో కారు ఉండడం ఆ కారు ఇద్దరూ గుర్తుపట్టడం అందుకు కారణం.

తళ తళ మెరుస్తోంది ఆ డిసోటా కారు. అది లాయర్ వజ్రాలరావుది.

వజ్రాలరావుతో యుగంధర్‌కీ, స్వరాజ్యరావుకీ బాగా పరిచయం ఉంది. వజ్రాలరావు ఊళ్లో ఉన్న క్రిమినల్ లాయర్స్‌లో దిట్ట. క్రిమినల్ 'లా'లో పండితుడు. కోర్టు రూంలో చిందులు తొక్కి జూరీలనీ, జడ్జీనీ, తన వాగ్ధాటితో బిత్తరపోయేటట్లు చేస్తాడు. చిక్కు ప్రశ్నలతో, హుంకరింపులతో ప్రతిపక్షసాక్షులని బెదిరించి, తెలివిగా ప్రాసిక్యూషన్ కేసుని అయోమయం చేసి నెగ్గుకొస్తాడు. అతను మేధావి. అతను ప్రతిభావంతుడు. అసమాన ప్రజ్ఞ విశేషాలు గల వకీలు.

కానీ అతని మేధస్సు వక్రమార్గంలో నడుస్తుంది. తన పార్టీ దోషి అని తెలిసినా కూడా, దొంగ సాక్ష్యాలు సృష్టించి, అబద్ధపు సాక్ష్యాలు చెప్పించి కేసు నెగ్గించడానికి ప్రయత్నిస్తాడు. అతనికి కావలసింది డబ్బు. వృత్తి ధర్మాలు కానీ, నీతి నియమాలు కానీ లేవు. అతనికి దొంగలతో, నేరస్తులతో పొత్తు. కొంత మంది ఆరితేరిన దొంగలు ముందుగా వజ్రాలరావు సలహా తీసుకుని, అతని ఆదేశానుసారం నేరాలు చేస్తారనీ, 'లా'లో ఉన్న కిటుకులూ, కీలకాలూ ఆసరాగా తీసుకుని వజ్రాలరావు వాళ్లకి సలహాలు ఇస్తాడనీ తత్ఫలితంగా ఆ నేరస్థులని పోలీసులు అరెస్టు చేయలేక పోతారనీ ప్రతీతి.

"యుగంధర్ మీ ఊహ సరయినదే జోగయ్యే నాగయ్య అయివుండాలి. వజ్రాలరావు ఇప్పట్నించే డిఫెన్సుకి పాచికలు వేస్తున్నాడు. రెండు పిస్తోళ్లతో రెండు విధాలుగా చొక్కామీదా, చొక్కాలేకుండా కాల్చడం వజ్రాలరావు సలహాతోనే చేసి ఉండాలి" అన్నాడు స్వరాజ్యరావు.

యుగంధర్ నవ్వాడు. వజ్రాలరావు చేసే పనులు యుగంధర్ ఆమోదించకపోయినా అతని తెలివితేటలు మెచ్చుకుంటాడు.

"లోపలికి వెళ్లి అసలు విషయం కనుక్కుందాం పదండి" అని స్వరాజ్యరావు కారు దిగాడు.

●●●

"**అడుగో వచ్చేశారు.** డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావూ, యుగంధరూ, అతని అసిస్టెంటూ. నీకు అట్టే వ్యవధి లేదు. ఊ!" పురమాయించాడు లాయర్ వజ్రాలరావు.

జోగయ్య కుర్చీలోంచి కొంచెంగా లేచి కిటికీలోంచి చూశాడు. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు కారు దిగడం చూశాడు. మొహం పాలిపోయింది. బెదురుతూ వజ్రాలరావుని చూసి "నిజంగా నన్ను కాపాడగలరా?" అడిగాడు గద్గద స్వరంతో.

"నువ్వు గాభరాపడక. నే చెప్పినట్లు చెయ్యి పారిపో!" అన్నాడు.

జోగయ్య కుర్చీలోంచి లేచి, చరచరా పెరటి గుమ్మం వైపు వెళ్ళాడు. ఒకసారి వెనక్కి తిరిగి వజ్రాలరావుని చూసి చప్పుడు చెయ్యకుండా పెరటి గుమ్మం తలుపు తీసుకుని బైటికి వెళ్ళిపోయాడు.

వజ్రాలరావు నవ్వుకుంటూ జేబులోంచి రుమాలు తీసి, మెడా, నుదురూ తుడుచుకుని, జేబురుమాలతో విసురుకుంటున్నాడు. స్వరాజ్యరావూ, అతని వెనక యుగంధరూ, రాజూ లోపలికి వచ్చాడు.

"హల్లో ఇన్‌స్పెక్టర్! హల్లో యుగంధర్!" అంటూ వజ్రాలరావు లేచి నిలుచున్నాడు. సన్నగా, చాలా సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. నలగని తెల్లని షార్క్ స్కిన్ సూటు తొడుక్కున్నాడు. రిమ్‌లెస్ కళ్ళద్దాలు, నెరసీ నెరవని పల్చని జుట్టు. ఎడం చేతి వేళ్ళకి మూడు ఉంగరాలు, బంగారం గొలుసు ఉన్న రోలెక్స్ చేతి గడియారం. రెండు ఫౌంటెన్ కలాల క్లిప్పులు కోటు జేబులో మెరుస్తున్నాయి.

"ఈ నాగయ్య కోసం ఇరవై నిమిషాల నుంచీ కాచుకున్నాను" అన్నాడు వజ్రాలరావు.

"ఇంట్లో లేడా?" అడిగాడు స్వరాజ్యరావు.

"ఏమో! తలుపు తెరిచి ఉంది లోపలికి వచ్చి పిలిచాను. అతను పలకలేదు. ఏ బాత్ రూంలోకో వెళ్ళి ఉంటాడని కాచుకున్నాను. ఇరవై నిమిషాలయిన అంతులేడు."

"అయితే ఓసారి లోపలికి వెళ్ళి చూడటంలో తప్పులేదేమో?" అన్నాడు స్వరాజ్యరావు.

"తప్పేముంది?" అన్నాడు వజ్రాలరావు.

రాజువైపు చూశాడు ఇన్‌స్పెక్టర్. రాజు లోపలికి వెళ్ళి అయిదు నిమిషాలలో తిరిగి వచ్చి "ఎక్కడా లేడు" అన్నాడు.

"ఇంటి తలుపులు బార్లా తెరిచి పెట్టి ఎక్కడికి వెళ్ళివుంటాడు?" అన్నాడు వజ్రాలరావు.

"మీరు అతనితో పని ఉండి వచ్చారా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"అవును ఇన్‌స్పెక్టర్ పోయినసారి ఫోర్జరీ కేసులో ఇతని తరుపున వాదించినప్పుడు నాకు ఫీజు బాకీ పడ్డాడు. జోగయ్య అని పేరు మార్చుకుని ఇక్కడ ఉంటున్నాడని నిన్న ఎవరో చెప్పారు.. వచ్చాను. ఇతను ఇంటిలో లేడని తేలింది కనుక నేను టైం వృధా చేసుకోవడం అనవసరం. ఇక వెళ్తాను" అని అక్కణ్ణించి బయల్దేరాడు వజ్రాలరావు.

"అతను కనిపిస్తే మీకు కబురు చేయమంటారా?" అడిగాడు స్వరాజ్యరావు వ్యంగ్యంగా.

"మీకు అతను కనిపిస్తే అతనే నాకు కబురు చేస్తాడనుకుంటాను. అతనికోసం మీరు వచ్చారంటే అతను ఏదో నేరం చేసి ఉండాలన్నమాట. కనుక అతనికి మళ్ళీ నాతో అవసరం కలుగుతుంది. నా కోసం అతనే కబురు చేస్తాడు. థాంక్సు" అని వజ్రాలరావు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళగానే స్వరాజ్యరావు పళ్ళు పటపట కొరికాడు. "ఈసారి వజ్రాలరావు పని పట్టాలి. నా ఊహ సరయినదయితే, వజ్రాలరావు సలహాతోనే ఈ హత్య జరిగింది. రెండు పిస్తోళ్ళతో ఇలా గందరగోళం చేయడం అతని ఆలోచనే అయివుండాలి. అది రుజువు చెయ్యగలిగామా, హత్యకి సహాయపడినందుకుగాను ఆక్ససరీ-బిఫోర్ అండ్ ఆఫ్టర్ ది ఫాక్టు ఆఫ్ మర్డర్ చార్జీ మీద వజ్రాలరావుకి సంకెళ్ళు తగిలించవచ్చు" అన్నాడు.

"వజ్రాలరావు అంత సులభంగా పట్టుపడే మనిషి కాడు" అన్నాడు యుగంధర్.

"ఎంత తెలివైనవాడయినా ఆత్మవిశ్వాసం హద్దుమీరితే పొరబాటు చేయడం కద్దు. మనం ఇక్కడ ఉండి ఏం చేస్తాం పదండి. నాగయ్య తిరిగివస్తే ఆఫీసుకి తీసుకురమ్మని చెప్పి ఒక సి.ఐ.డి కానిస్టేబుల్ని ఇక్కడ కాపలాకి పంపుతాను. మనం రామారావు ఇంటికి వెళదాం" అన్నాడు స్వరాజ్యరావు.

●●●

"కూర్చోండి" అన్నాడు రామారావు స్వరాజ్యరావు తనని పరిచయం చేసుకోగానే.

"ఏ.డి.1478 నెంబర్ గల .32 కోల్టు రివాల్వర్ మీదేగా?" అడిగాడు స్వరాజ్యరావు కూర్చుంటూ.

"నాకు నెంబర్ జ్ఞాపకం లేదు. .32 కోల్టు రివాల్వర్ ఒకటి నా దగ్గిర ఉండాలి. డైరీ చూసి చెబుతాను" అని రామారావు లేచాడు.

"దయచేసి ఆ రివాల్వర్ కూడా తీసుకురండి"

రామారావు తలవూపి లోపలికి వెళ్ళాడు. అయిదు నిమిషల తర్వాత తిరిగి హాల్లోకి వచ్చాడు. "అవును ఇన్స్పెక్టర్ ఆ రివాల్వర్ నాదే కానీ సారీ అది కనిపించడంలేదు .48 వెబ్స్టర్ రివాల్వర్ కూడా ఉండాలి నా దగ్గర. అదీ కనిపించడంలేదు" అన్నాడు.

"రెండూ పోయాయా?" అడిగాడు స్వరాజ్యరావు.

"ఏమో! గదంతా వెతికాను. ఎక్కడా లేవు. ఎలా పోయాయో అర్థంకాకుండా ఉంది. నేనే ఎక్కడయినా పెట్టానేమో? జ్ఞాపకంలేదు"

"మీ భార్య మంగళాదేవిగారు ఉంటున్న ఇంటి ఆవరణలో నిన్న రాత్రి ఒక సన్యాసి పిస్తోలుతో కాల్చి చంపబడ్డాడు. శవం దగ్గర .32 కాలిబర్ కోల్ట్ నెం. ఏ.డి.1478 రివాల్వర్ కనిపించింది. దానిమీద స్పష్టమైన వేలిముద్రలు కనిపించాయి. జోగయ్య అనే మీ స్నేహితుడివి ఆ వేలిముద్రలు" స్వరాజ్యరావు చెప్పాడు.

రామారావు తెల్లబోయి చూశాడు.

"హతుడి గుండెలోపల రెండు గుళ్ళు ఉన్నాయి. ఒకటి .32 కాలిబర్ గుండు. రెండోది. 48 కాలిబర్ గుండు. ఈ రెండు గుళ్ళల్లో ఏదయినా చావుకి కారణం అయివుండవచ్చు. "

రామారావు కళ్ళప్పగించి రెండు నిమిషాలు ఇన్స్పెక్టర్ని చూస్తూ ఉండిపోయాడు. "హత్య చేయబడింది ఎవరన్నారు సన్యాసా?" అడిగాడు.

"అవును."

"ఎలా ఉంటాడు?" అడిగాడు రామారావు.

"సన్యాసిలా ఉన్నాడు. కాషాయరంగు గూడకట్టు, లాల్చీ, గెడ్డం, జడలు కట్టిన జుట్టు, చేతికి తాయెత్తు -"

రామారావు మొహంలో మార్పు వచ్చింది నిట్టూర్పు వదిలి "పాపం!" అన్నాడు.

"ఆ సన్యాసి ఎవరో మీకు తెలుసా?" అడిగాడు స్వరాజ్యరావు.

రామారావు ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు. "ఆ పిస్తోలు మీద జోగయ్య వేలిముద్రలున్నాయా?" అడిగాడు.

"అవును. మీ పిస్తోళ్ళు .32 కోల్ట్, .48 వెబ్‌స్టర్. ఈ హత్య చేయడానికి ఉపయోగించబడ్డాయని అనుకోవచ్చు. వాటిని గురించి ఏమైనా చెప్పగలరా?"

రామారావు లేచి నిలుచున్నాడు. "ఇన్‌స్పెక్టర్ .32 కోల్టు నాదేనని తేలింది కనుక, .48 వెబ్‌స్టర్ నా దగ్గిరలేదు కనుక, హత్యకి ఉపయోగించిన రెండో పిస్తోలు నాదే అని మీరు అనడంలో మీ పొరపాటు లేదు. కానీ ఇది నమ్మండి. ఈ హత్యతో నాకెటువంటి సబంధమూలేదు. హత్యకి నా పిస్తోళ్ళు ఉపయోగించబడడానికి కారణం నాకు తెలియదు. ఆ హత్యతో నాకు సంబంధం ఉన్నదని పోలీసులు భావించాలని అలా చేసి ఉండవచ్చు. నా పిస్తోళ్ళన్నీ నా గదిలో బీరువా సొరుగులో పడివున్నాయ్" చెప్పాడు.

"తూటాలు నింపే ఉన్నాయా?"

"లేదు. తూటాలు పెట్టెలో ఉన్నాయి. పెట్టెలోంచి తుటాలు తీసుకుని ఉండవచ్చు."

"ఎవరు తీసుకునుండవచ్చో చెప్పగలరా"

"ఎలా చెప్పను? అవెప్పుడు పోయాయో తెలిస్తేగా? ఈ రెండేళ్ళలో ఎప్పుడయినా పోయి ఉండవచ్చు. ఈ మధ్య వాటిని నేను చూడలేదు. కోల్టు రివాల్వరు మీద జోగయ్య వేలిముద్ర లున్నాయన్నారు కనుక రెండూ అతనే తీసుకుని ఉండవచ్చు."

"అతనికి అవకాశం ఉందా?"

"ఆ! ఆరునెలల కిందట మాకు స్నేహం ఏర్పడింది. నా ఇంటికి తరుచు వస్తూ ఉంటాడు. నేను ఇంట్లో లేనపుడు వస్తే నాకోసం కాచుకుని ఉంటాడు. అట్లా చాలాసార్లు జరిగింది."

"సన్యాసి అని చెప్పగానే అదోవిధంగా చూశారు మీరు. ఎలా ఉంటాడని అడిగారు. సన్యాసి ఎవరైన మీకు తెలుసా?" అడిగాడు స్వరాజ్యరావు.

రామారావు మాట్లాడలేదు.

"ఎవరో సన్యాసి అర్ధరాత్రి మీ భార్య ఇంటికి ఎందుకు వెళ్ళాడో, అతను అక్కడ ఎందుకు హత్యచేయపడ్డాడో మీరేమైనా ఊహించగలరా?"

రామారావు లేచి నిలుచున్నాడు. ఒకసారి ఇటూ అటూ పచారు చేశాడు.

"నేనూ, మంగళా విడిపోయామనీ, ఆమె విడిగా ఉంటున్నదనీ, మా ఇద్దరికీ పొసగలేదనీ మీకిదివరకే తెలిసుండాలి. నేను మంగళని వివాహం చేసుకుని రెండేళ్ళయింది. నిన్న పొద్దున్న నా దగ్గరికి ఓ సన్యాసి వచ్చాడు. మంగళ ఎక్కడున్నదని అడిగాడు. మంగళతో నీకేం పనని నువ్వు ఎవరవనీ అడిగాను. అతను నవ్వి, మంగళ తన భార్య అని చెప్పాడు. మొదట నాకు అర్థంకాలేదు. పిచ్చివాడనుకున్నా. తర్వాత చెప్పాడు. ఆరేళ్ళ క్రితం తను మంగళని పెళ్ళిచేసుకున్నాననీ, పెళ్ళి అయిన ఆరు నెలలకి మనస్సు మారిపోయి సంసారం మీద విరక్తి కలిగిందనీ, ఇల్లువదిలి వెళ్ళిపోయి కాశీ, గయా, మానససరోవరం వెళ్ళి, అక్కణ్ణించి హిమాలయాలకి వెళ్ళాననీ అక్కడ సన్యాసం పుచ్చుకుని ఇంతకాలం తపస్సు చేసుకుంటూ ఉన్నాననీ చెప్పాడు. ఆరునెలల క్రితమే తిరిగి వచ్చాడుట. తన భార్య ఏమైందో అని బెంగుళూరులో తను ఎవరో బయటపడకుండా గోప్యంగా వాకబు చేయగా నన్ను పెళ్ళి చేసుకుని మద్రాసులో ఉంటున్నదని తెలిసిందిట. ఒకసారి చూడాలనిపించి వచ్చానని చెప్పాడు. సన్యాసం పుచ్చుకున్న మనిషికి ఇన్నేళ్ళ తర్వాత మళ్ళీ భార్యమీద మమకారం ఎందుకు

కలిగిందా అని నవ్వుకున్నాను. అసలు నాకు ఈర్ష్య కలగలేదు. అదీకాక మంగళకీ, నాకూ సంబంధం కూడా లేదు ఇప్పుడు. తనకి ఒకసారి పెళ్ళి అయిందని మంగళ నాతో చెప్పనందుకు కాస్త కోపం వచ్చినా అప్పుడే పోయింది. ఇప్పుడు ఆమెకీ, నాకూ సంబంధం లేదు కనుక ఆ చింత నన్నేమీ బాధించలేదు."

"ఆ సన్యాసికి మీ భార్య చిరునమా చెప్పారా?"

"చెప్పాను"

అతను చెప్పిన విషయాలు నిజమో కావో తెలుసుకోవడానికి ప్రయత్నించారా?" అడిగాడు యుగంధర్.

"లేదు. అతన్ని చూస్తే అబద్దాలు చెప్పడనిపించింది. నమ్మాను"

"అన్నట్లు శవం పక్కన ఒక ఖాళీ నగల పెట్టె కనపడ్డది. మీ భార్య నెక్లెస్ పెట్టుకునే పెట్టె అది, ఆ నెక్లెస్ మీ దగ్గిర ఇనపపెట్టెలో ఉండేదిట. అది పోయిందని నిన్న మీరు పోలీసు కంప్లైంటు ఇచ్చారుట, ఆ నెక్లెస్ పెట్టె ఎందుకు అక్కడ పడుందో చెప్పగలరా?"

"చెప్పలేను"

"ఆ నెక్లెస్ లక్షరూపాయలకి ఇన్సూర్ చేశారటగా!"

"అవును"

"క్లెయిం పెట్టారా?"

"ఆ!"

"మీ భార్య చెల్లెలు సరళ ఆ నెక్లెసు జోగయ్య ద్వారా దొంగిలించిందనీ, మీ భార్యకి దాన్ని ఇచ్చిందనీ, బహుశా మీ భార్య ఆదేశానుసారమే అతను నెక్లెస్ మీ ఇనపపెట్టెలోంచి తీసి ఉంటాడనీ నిన్న యుగంధర్ గారు మీతో చెప్పారుటగా! మరి పోలీసు కంప్లయింటు, ఇన్సూరెన్సు క్లయిమూ ఉపసంహరించుకోలేదా?"

"యుగంధర్‌గారు ఆయన చెప్పిన విషయాలకి రుజువులేవీ చూపించలేదు. నెక్లెసు నా భార్య దగ్గిరే ఉన్నదని రుజువు చేసివుంటే వెంటనే నేనిచ్చిన పోలీసు కంప్లయింటు, ఇన్సూరెన్సు క్లెయిం ఉపసంహరించుకునేవాణ్ణి, యుగంధర్ గారు నిజం చెబుతున్నారని నాకు ఏం నమ్మకం"

"పిస్తోళ్ళని గురించి తర్వాత నా వాఙ్మూలం వ్రాసి ఇవ్వవలసి వస్తుంది. మళ్ళీ కలుసుకుంటాను" అని స్వరాజ్యరావు లేచాడు.

"యుగంధరూ, రాజూ కూడా లేచివెళ్ళి కారెక్కారు. " రాజు కారు స్టార్టు చేశాడు.

"డియర్ యుగంధర్ మంగళ మీ క్లయింటా?" అడిగాడు స్వరాజ్యరావు.

యుగంధర్ అవునని తలూపాడు.

"కనుక ఆమెకి ఇబ్బంది ఏమీ కలగకుండా మీరు కనిపెడుతూ ఉండాలి కదూ!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ స్వరాజ్యరావుని ప్రశ్నార్థకంగా చూశాడు.

"రాజూ! నన్ను హెడ్ క్వార్టర్స్‌లో దింపేయ్" అన్నాడు స్వరాజ్యరావు.

కారు హెడ్ క్వార్టర్సు చేరుకునేటంతవరకూ ఇన్‌స్పెక్టర్ ఏమీ మాట్లాడలేదు. ఏదో దీర్ఘాలోచనలో ఉండిపోయాడు. యుగంధరూ ఏమీ మాట్లాడలేదు.

హెడ్ క్వార్టర్సు దగ్గిర కారు దిగుతూ "థాంక్స్ రాజూ మళ్ళీ కలుసుకుందాం యుగంధర్ గారూ" అని స్వరాజ్యరావు దిగి వెళ్ళిపోయాడు.

"ఇన్‌స్పెక్టర్ ఎందుకు అలా మారిపోయాడు. చాలా ముభావంగా ఉన్నాడే" అన్నాడు రాజు ఇన్‌స్పెక్టర్ వెళ్ళగానే.

యుగంధర్ నవ్వాడు. "మంగళ మన క్లయింటు కనుక మనమూ, తనూ కలిసి ఇక దర్యాప్తు సాగించడం ఇష్టం లేదతనికి."

"మంగళ మన క్లయింటయితేనేం?"

"సన్యాసిని హత్యచేసింది మంగళేనని ఇన్‌స్పెక్టర్ అనుమానం"

"మంగళ సన్యాసిని ఎందుకు హత్య చేస్తుంది?"

"ఆ సన్యాసి నిజంగా మంగళ భర్త అయితే, భర్త బతికి ఉండగా రామారావుని పెళ్ళి చేసుకున్నందుకు శిక్షార్హురాలు అవుతుంది. మరొక కారణం నెక్లెసు, భర్త బతికుండగా కన్యలాగా నటించి రామారావుని పెళ్ళిచేసుకునుంటే పెళ్ళిలో రామారావు మంగళకిచ్చిన నెక్లెసు స్త్రీ ధనం కాదు. ఆ నెక్లెసు మీద ఎటువంటి అధికారం ఆమెకి ఉండదు. అప్పుడు ఇనప్పెట్టెలోంచి నెక్లెసు తీసుకోవడం దొంగతనం అవుతుంది."

"సన్యాసిని తన ఇంటి కాంపౌండులో హత్య చేస్తే అసలు విషయం ఎలాగూ బయటపడుతుంది కనుక మీరు చెప్పిన కారణాలేవీ సరయినవి కావేమో!" అన్నాడు రాజు

"ఆ సన్యాసి ఆమె భర్త అని ఎవరికీ తెలియదని ఆశించి ఉండవచ్చు. రామారావుకి తెలిసినా రుజువు చెయ్యలేక పోవచ్చు. కొన్నేళ్ళ క్రితం పరారీ అయిన మనిషే హత్య చేయబడిన సన్యాసి అని కాని, అతను మంగళ భర్తని కాని రామారావు, పోలీసులు రుజువు చెయ్యడం కష్టం. అతనెవరో తనకు తెలియదని మంగళ అంటుంది. ఆ సన్యాసి బతికివుంటే, తనే ఆమె భర్తనని నిదర్శనలు చూపితే మంగళ స్థితిఎలా ఉంటుంది? స్వరాజ్యరావు మంగళాదేవిని అనుమానించడానికి తగిన కారణం ఉంది" అన్నాడు యుగంధర్.

"ఇక్కడినుంచి ఎక్కడికి?"

"మంగళ ఇంటికి."

యుగంధర్ కారు గేటు దగ్గర ఆగగానే మంగళ గుమ్మం దగ్గిరకి వచ్చి నిలుచున్నది.

"నిన్న రాత్రి మీరు హత్యచెయబడిన సన్యాసిని చూశారు కదా! గుర్తుపట్టారా" మంగళ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు యుగంధర్.

" లేదు."

"నిజమేనా?"

"అవును"

"ఆ సన్యాసి మొహం మళ్ళీ ఓసారి చూస్తే గుర్తుపట్టగలరేమో? మనం వెంటనే మార్చ్యురీకి వెళ్ళాలి" అన్నాడు యుగంధర్.

మంగళ తలవూపింది. వెంటనే ముగ్గురూ మార్చ్యురీకి బయలుదేరారు. ఆజ్ఞాపత్రం సంపాదించి మంగళని మార్చ్యురీలోకి తీసుకువెళ్ళాడు యుగంధర్. శవంపైన తెల్లటి దుప్పటి కప్పబడి ఉంది. రెండు నిమిషాలు రెప్పవాల్చకుండా సన్యాసి మొహం చూసింది మంగళ.

ఆమె మార్చ్యురీలోంచి బయటికి రాగనే "గుర్తుపట్టారా?" అడిగాడు యుగంధర్.

"ఆ? ఆయన నా భర్త" అన్నది.

యుగంధర్ అప్పుడు ఇంకేమీ అడగలేదు. కారు మంగళ ఇంటికి వెళ్ళేవరకూ మౌనంగా ఉన్నాడు.

ఇంట్లోకి వెళ్ళిన తర్వాత "ఇప్పుడు చెప్పండి" అడిగాడు యుగంధర్.

మంగళ కళ్ళల్లో నీళ్ళు లేవు. దిగులుగా లేరు. మనస్సు స్థంభించినట్లు, ఆలోచనా రహితమైనట్లు కళ్ళు కాంతి విహీనంగా, మత్తుగా ఉన్నయి.

"అవునండీ! ఆయన నా భర్త. ఆరేళ్ళ క్రితం మాకు వివాహమయింది" అన్నది.

యుగంధర్ దగ్గాడు. "మంగళాదేవిగారూ మొదటినుంచీ చెప్పండి?" అన్నాడు.

"మా నాన్నా, అమ్మా పోయిన తరువాత నన్నూ, సరళనీ మా మామయ్య తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. అక్కడే పెరిగాం ఇద్దరం. ఆరేళ్ళ క్రితం అంటే నాకు పంతొమ్మిదేళ్ళప్పుడు మా మామయ్య నాకు పెళ్ళి సంబంధం నిశ్చయించాడు. ఆయన పేరు జగన్ మోహన్. ఎం.ఏ పాసయ్యారు. వాళ్ళ సొంత ఊరు క్రిష్ణగిరి. ఆయన తండ్రీ, మావయ్యా స్నేహితులు. అనుకోవడమేమిటి, పెళ్ళిచూపులు జరగడమేమిటి, ముహూర్తం నిర్ణయించడమేమిటి, వివాహం కావడమేమిటి, ముహూర్తం నిర్ణయించడమేమిటి, వివాహం కావడమేమిటి అంత పదిరోజుల్లో జరిగిపోయింది. ఆయన చాలా తెలివైనవారనీ, గొప్ప వారవుతారనీ అందరూ చెప్పారు. నాకై నేను ఏరుకుని ఆయన్ని చేసుకోలేదు. అలాటి అవకాశమూ లేదు. ఒక సంవత్సరం గడిచింది. ఓ రోజు సాయంత్రం ఆయన ఇంటికి తిరిగి రాలేదు. అంతే. మళ్ళీ కనిపించలేదు. పోలీసు రిపోర్టు ఇచ్చారు వాళ్ళవాళ్ళు. ఏమీ ప్రయోజనం లేకపోయింది. మనిషి మాయమయ్యారు."

"అలా మాయమవ్వడానికి కారణమేమైనా ఉందా?" అడిగాడు యుగంధర్.

"మొదట మాకెవరికీ కారణం తెలియలేదు. ఆయన పెద్ద ఉద్యోగం చేస్తారనీ, ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్నదనీ అందరూ అనేవారు. కానీ మామయ్య ఆరా తీయగా తేలింది, ఆయన కాలేజీలో చదువుతుండగా ఒక ముస్లిం అమ్మాయిని ప్రేమించారట. ఆ అమ్మాయికి ఈయనంటే ఇష్టమే కానీ పెద్దల అభ్యంతరం వల్ల పెళ్ళి జరగలేదు. ఆ విచారంతో ఆయన కృశించి పోతుంటే వాళ్ళవాళ్ళు ఆయనకి పెళ్ళిచేస్తే కానీ బెంగపోదని అనుకున్నారుట. ఆయన పెళ్ళికి ఎందుకు ఒప్పుకున్నారో తెలియదు. బహుశా తల్లితండ్రులని సంతోషపెట్టాలని అంగీకరించి ఉంటారు. ఒక సంవత్సరం కాపురం చేసినా ఆయనకి ఆ ముస్లిం అమ్మాయి మీద ప్రేమపోకపోగా, లోలోపల రగులుతూ గుండెని కాల్చి ఉంటుంది. ఆయన నన్ను ప్రేమతో చూడలేదు. నా మీద ఆదరణ కనపరచలేదు.

"కానీ నన్ను అసహ్యించుకోనూ లేదు. నిరాదరణ చూపనూలేదు. అందుకే ఆయన గుండెలో దాచుకున్న ఆవేదనని నేను గ్రహించలేకపోయాను. ఇదంతా మామయ్య ఆరా తీయగా బయటపడింది. అప్పుడిక మేము చేసేదేమీలేదు. ఆయనకి ఆస్తికూడా లేదు. అత్తగారి ఇంటిలో ఉండడానికి నా మనసు ఒప్పుకోలేదు. ఒకవేళ ఆయన తిరిగి వచ్చినా ఆయనతో కాపురం చేయడానికి నా మనసు ఒప్పుకోదు. అందువల్ల మామయ్య ఇంటికి వెళ్ళిపోయాను. మామయ్య ఆయన్ని గురించి భోగట్టా చేసేవాడు అప్పుడప్పుడు. మాయమైన మనిషి కనిపించనే లేదు. బాధ భరించలేక ఆయన ఎక్కడికో వెళ్ళిపోయారనీ, ఆత్మహత్య చేసుకుని ఉంటారనీ అనుకున్నాము."

యుగంధర్ మంగళని తేరిపార చూశాడు. మొదట మంగళని చూసినప్పుడే ఆమె గతంలో ఏదో ఒక బాధాకరమైన అనుభవం పొంది ఉండాలని అనుకున్నాడు.

"అప్పటి నుంచీ కూడా మామయ్య నన్ను మళ్ళీ పెళ్ళిచేసుకోమని చెబుతూనే ఉండేవాడు. ఆ మొదటి అనుభవం తరవాత మళ్ళీ పెళ్ళి గురించి ఆలోచించలేకపోయాను. కాని చివరికి, నా మొదటి భర్త వెళ్ళిపోయిన అయిదేళ్ళకి ఒప్పుకున్నాను. పత్రికల్లో రామారావుగారు చేసిన మ్యాట్రిమోనియల్ ప్రకటన చూసి, ఉత్తరం రాసి ఈ పెళ్ళి చేశాడు మామయ్య."

"మీ మొదటి భర్త బతికున్నదీ లేనిదీ తెలియకుండా మళ్ళీ పెళ్ళి చేసుకునే అధికారం ఉన్నదని మామయ్య చెప్పాడు. రామారావుగారికి అదివరకు నాకు పెళ్ళయిన సంగతి చెబితే ఆయన పెళ్ళికి అంగీకరించరేమోనని మామయ్య ఆ సంగతి చెప్పవద్దన్నాడు నన్ను."

"మంగళాదేవిగారు పరారీ అయిన మీ భర్త జగన్ మోహన్ కాశీకి వెళ్ళి సన్యాసం పుచ్చుకున్నాడని రామారావుగారు చెప్పారు. ఇటీవల ఆయన తిరిగి వచ్చి రామారావుగారి ఇంటికి వెళ్ళాడు. మీరు అక్కడ లేనట్లు తెలియగానె అక్కణ్ణించి బయలుదేరాడు. మీ ఇంట్లోకి వచ్చాడా?"

మంగళ కళ్ళనీళ్ళతో యుగంధర్‌ని చూసింది.

"యుగంధర్‌గారూ మీరు నాకు తండ్రిలాంటివారు. మీరు నా కోసం పడుతున్న శ్రమకి ఋణం ఈ జీవితంలో తీర్చుకోలేను. నేను అబద్ధాలు చెప్పడంలేదు. ఆయన ఇంటిలోకి రాలేదు. నిన్న రాత్రి శవాన్ని చూసినపుడు చూసినపుడు నేను ఆయన్ని గుర్తుపట్టలేదు." అన్నది మంగళ.

యుగంధర్ తల ఊపాడు. "మీరు రామారావుగార్ని పెళ్ళి చేసుకుని ఎంతకాలమైంది?" అడిగాడు.

"1949వ సంవత్సరంలో"

"మీరు పెళ్ళి చేసుకునే ముందు పత్రికలో ప్రకటించారా?"

"నాకు తెలియదు"

"మీ చెల్లెలు సరళ ఎక్కడా కనిపించలేదు. మీ చెల్లెలు ఎటువంటి మనిషి?"

"అంటే?"

"లక్ష రూపాయల నెక్లెసు దొరికింది కదా అని దాన్ని తీసుకుని తన దారిన తను వెళ్ళిపోయే రకమా?"

"ఛ, ఛ అటువంటిది కాదు."

యుగంధర్ లేచి నిలుచున్నాడు. "మీ వద్దకు పోలీసులు వస్తే ఏదీ దాచకుండా నిజం చెప్పండి. అవసరామితే నాకు కబురు పంపండి" అన్నాడు.

మంగళ తల ఊపింది.

●●●

ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు తన ఆఫీసు గదిలోకి వెళ్ళగానే బల్లమీద టెలిఫోన్ మోగింది. టెలిఫోన్ తీసి "హల్లో!" అన్నాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ గొంతు మారిపోయింది.

"యస్ సార్ నేను కాచుకుని ఉంటాను. పంపించండి" అని టెలిఫోన్ పెట్టేశాడు ఇన్‌స్పెక్టర్. బల్లమీద బెల్ కొట్టాడు. కానిస్టేబుల్ రాగానే షార్టుహాండ్ టైపిస్టుని పిలవమని చెప్పాడు. అయిదు నిమిషాల తరువాత ఒక కానిస్టేబుల్ వెంట జోగయ్య ఇన్ స్పెక్టర్ గదిలోకి వచ్చాడు.

"నిన్ను చూసి చాలా కాలమయింది నాగయ్యా! రా! స్టేట్ మెంటు ఇస్తానన్నావటగా! కూర్చో" అన్నాడు స్వరాజ్యరావు.

"అవును సార్!" అని జోగయ్య ఇన్‌స్పెక్టర్‌కి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. అతను చెబుతుంటే షార్ట్ హాండ్ టైపిస్టు వ్రాసుకున్నాడు. తర్వాత అదంతా టైప్ చేసి కాగితాలు తెచ్చాడు. జోగయ్య చదివి సంతకం చేసి ఇచ్చాడు.

"ఆల్ రైట్" అని కానిస్టేబుల్ని చూసి "ఇతన్ని లాకప్‌లో పెట్టు" అన్నాడు స్వరాజ్యరావు.

●●●

**"చదువుకున్నవారు, లోకానుభవం కలవారు మీరెందుకు** ఇంత అవకతవకగా ప్రవర్తించారో నాకు అర్థం కాకుండా ఉంది" అని యుగంధర్ తన కెదురుగా కూర్చున్న నరసింహమూర్తిని విసుగ్గా చూశాడు.

నరసింహమూర్తి మంగళ మేనమామ. ఆయనని వెంటనే రమ్మని టెలిగ్రాం ఇచ్చింది మంగళ. రైలు దిగిన అరగంటకే యుగంధర్ని కలుసుకోవడానికి వచ్చాడాయన. నరసింహమూర్తి నలభై అయిదేళ్ళవాడు. బట్టతల, నల్లఫ్రేము కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. ఖద్దరు లాల్చీ తొడుక్కున్నాడు. గోచీపెట్టి పంచకట్టుకున్నాడు. లావుగా, పొట్టిగా ఉన్నాడు. మధ్యతరగతి కుటుంబీకుడు.. లేమితనమూ, డబ్బు చిక్కులూ ముడతలు పడ్డ మొహంలో, కళ్ళకింద నల్లని గుంటలలో, చూపులో వ్యక్తమవుతున్నాయి.

"ఇలా జరుగుతుందని అనుకోలేదు. జగన్ మోహన్ బతికున్నాడని కానీ, తిరిగి వస్తాడని కానీ, మంగళని వెతుక్కుంటూ బయలుదేరతాడని కాని అనుకోలేదు. మంగళమీద అతడెన్నడూ ఆపేక్ష చూపలేదు"

"ఇంకో రెండేళ్ళాగి, ఏడేళ్ళు మనిషి అంతులేడు కనుక "ప్రిజిమ్షన్ ఆఫ్ డెత్ సర్టిఫికెట్" అంటే మనిషి చనిపోయి ఉండవచ్చని సర్టిఫికెట్ కోర్టుద్వారా తెచ్చుకుని మంగళకి మళ్ళీ వివాహం చేసి ఉండవలసింది" అన్నాడు యుగంధర్.

"నిజమే! కానీ వయస్సులో ఉన్న మంగళ ఏకాంత జీవితం చూసి భరించలేకపోయాను. యవ్వనం పోయిన తర్వాత పెళ్ళి చేస్తే ప్రయోజనమేమిటని అనిపించింది. ఏ తప్పూ చెయ్యని ఆ అమాయకురాలు ఎడారి జీవితం ఎందుకు జీవించాలనిపించింది. జగన్మోహన్ తల్లిదండ్రులతో మాట్లాడాను. కొడుకు బతికున్నాడని వాళ్ళకి నమ్మకం లేదు. మంగళ పెళ్ళి ఆర్భాటంగా చెయ్యలేదు కనుక దానికి పెళ్ళయిందని బంధువులకి కొద్ది మందికి తప్ప ఎవరికీ తెలియదు. మంగళ జీవితం పాడు కావడం నా ఫ్రెండ్ జగన్మోహన్ తండ్రికి ఇష్టం లేదు. అందుకే 'మాకెవరికీ అభ్యంతరం లేదు. అవసరమైతే, చిక్కు ఏదైనా వస్తే అసలు వాళ్ళిద్దరికీ పెళ్ళికాలేదని అంటాము. మంగళకి మళ్ళీ పెళ్ళి చెయ్యండి' అన్నాడు. అందుచేత ధైర్యంగా చేశాను."

"రెండవసారి మంగళకి మీరు వరుణ్ణి ఏరడంతోనూ ఘోరమైన పొరపాటు చేశారు" అన్నాడు యుగంధర్.

"అవును. తర్వాత తెలిసింది. పత్రికలో రామారావు చేసిన ప్రకటన చూసి రాశాను. అతన్ని చూసినపుడు యోగ్యుడూ, గుణవంతుడూ అనుకున్నాను. అతనికి తల్లితండ్రులూ, అన్నతమ్ములూ, అక్కచెల్లెళ్ళు ఎవరూ లేరు. మంగళ సుఖపడుతుందనుకున్నాను"

యుగంధర్ నవ్వాడు. వాటన్నిటికన్నా రామారావు చాలా డబ్బు గలవాడు అని తెలియడం వల్ల కళ్ళు మూసుకుని మంగళని అతనికిచ్చి పెళ్ళి చేశాడని యుగంధర్ ఊహించాడు. లేమివల్ల డబ్బున్న వాళ్ళని చూస్తే ఒక విధమైన గౌరవం, ఆకర్షణ కలుగుతుంది. నరసింహామూర్తికి అందులో స్వార్థం లేకపోవచ్చు. కానీ తన మేనకోడలు లక్షాధికారికి భార్య అవుతుందనే ఆశ, సంతోషం ఆయనని ప్రోత్సహించి ఉంటాయని అనుకున్నాడు యుగంధర్.

"1951లో కాళేశ్వరరావుగారి ఆంటీ బైగమీ అండ్ డైవర్సు బిల్లు పాసవగానే తొందరపడినందుకు విచారించాను. ఎందుకయినా మంచిదని అప్పుడే పత్రికలలో ప్రకటించాను."

"ఏమని ప్రకటించారు?" అడిగాడు యుగంధర్.

"నా మేనకోడలు మంగళని ఆమె భర్త విడిచిపెట్టి వెళ్ళి ఆరేళ్ళు దాటిందనీ, వెంటనే తిరిగి రానట్లయితే భార్యని ఒదిలి వెళ్ళిపోయినట్లు భావించబడుతుందనీ, నా మేనకోడలికి మళ్ళీ పెళ్ళి చేయనున్నాననీ ప్రకటించాను. జగన్మోహన్ తండ్రితో ఆలోచించే ఈ పని చేశాను. తన కొడుకు జాడ తెలియలేదనీ, మంగళకి మళ్ళీ వివాహం చెయ్యమనీ ఆయన వెంటనే ఉత్తరం రాశాడు."

"మీ ప్రకటన రామారావు చూడలేదా?"

"ఊహూ! స్థానిక పత్రికలలో వేశాను. అంతే."

"రామారావుకీ, మంగళకీ ఏ పద్ధతిన వివాహం చేశారు?"

"హిందూ పద్ధతినే."

"ఎక్కడ?"

"మా ఇంటిలో"

"ఎవరయినా వకీలుని సలహా అడిగి చేసి ఉండవలసింది" అని యుగంధర్ లేచి నిలుచున్నాడు. గదిలో ఇటూ అటూ పచార్లు చేయసాగాడు.

"సరళ ఏమైంది?" అన్నాడు దిగులుగా నరసింహామూర్తి.

యుగంధర్ జవాబు చెప్పలేదు. అంతలో టెలిఫోన్ మోగింది.

"హల్లో! యుగంధర్ స్పీకింగ్," అయిదు నిమిషాలు టెలిఫోనులో విన్నాడు.

"వెంటనే బయలుదేరి వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేసి, నర్సింహమూర్తిని చూసి "మంగళ టెలిఫోను చేసింది" అన్నాడు.

"ఎందుకు?"

"డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు వచ్చాడుట."

"ఆ!"

"అరెస్టు వారంటు తెచ్చాడుట."

"ఏం నేరం చేసినందుకు?"

"హత్య చేసినందుకు. పదండి పోదాం." యుగంధర్ మొహం చాలా గంభీరంగా ఉంది. మంగళ ఇల్లు చేరుకునేంతవరకు మౌనంగా ఉన్నాడు. వెనక సీటులో కూర్చున్న నరసింహమూర్తితో గానీ, డ్రైవ్ చేస్తున్న రాజుతో గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

యుగంధర్ కారు దిగి హాల్లోకి వెళ్ళగానే ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు "హల్లో! యుగంధర్. మీతో మాట్లాడాలని ఆమె చెబితే మీకు ఫోను చెయ్యమన్నాను. మీరు వచ్చేటంత వరకూ ఆగమంటే సరేనన్నాను" అన్నాడు.

"థాంక్సు ఇన్‌స్పెక్టర్! ఒకసారి వారంటు చూపిస్తారా?" అడిగాడు యుగంధర్. స్వరాజ్యరావు వెంటనే వారంటు కాగితం ఇచ్చాడు.

నాగయ్య లేక జోగయ్య అనే వ్యక్తితో కలిసి కుట్రచేసి, అతని సహాయంతో మంగళ తన భర్త జగన్ మోహన్‌ని పదమూడో తేది రాత్రి 11.30 గంటలకి పిస్తోళ్ళతో కాల్చి హత్య చేసిన నేరం మీద అరెస్టు చేస్తున్నట్లు ఉన్నది వారంటులో.

స్వరాజ్యరావుతో యుగంధర్ పరిచయం ఈనాటిది కాదు. పటిష్టమైన సాక్ష్యం ఉంటేగాని స్వరాజ్యరావు అరెస్టు చెయ్యడానికి రాడు. తను ఛార్జీ దాఖలు చేసిన ముద్దాయిలు బోనెక్కాక శిక్ష అనుభవించవాలిసిందేగానీ విడుదల కాకూడదనే పట్టుదలగల మనిషి స్వరాజ్యరావు. తను అరెస్టు చేస్తున్న మనిషి నిజంగా నేరం చేశాడని పూర్తి నమ్మకం కలగనిదే అరెస్టు చేయడు అతను.

"నాగయ్య దొరికాడా?" అడిగాడు యుగంధర్.

"ఆ! నేరం ఒప్పుకుంటూ వాఙ్మూలంలో చెప్పాడు. యుగంధర్ ఇదివరలో మీరు ఎన్ని కేసులలోనో నాకు చాలా సహాయం చేశారు. మీకు సర్వదా నేను కృతజ్ఞుణ్ణి. ఓ సలహా ఇస్తాను. మన్నించండి. మా కేసు చాలా గట్టిది. మీ టయిం వృధా చేసుకోకండి"

"ఈమె చెల్లెలు సరళ కనపడిందా?"

"లేదు. మేము వెతకనూ లేదు."

యుగంధర్ మంగళవైపు తిరిగి "అమ్మా! ఈ అభియోగానికి మీరు ఏం జవాబు చెబుతారు?" అడిగాడు.

మంగళ కళ్ళల్లో నీళ్ళు లేవు. మొహంలో నెత్తురు లేదు. ఆమె మనస్సులో ఆలోచనలూ లేవు. దిగ్భ్రమతో కళ్ళు అప్పగించి చూస్తోంది. యుగంధర్ మళ్ళీ అడిగాడు.

"నాకేమీ తెలియదు. నేనెవర్నీ చంపలేదు. నేనెవరితోనూ కుట్ర చేయలేదు" అన్నది చివరికి.

అప్పగించి చూస్తోంది.

యుగంధర్ స్వరాజ్యరావు వైపు తిరిగాడు. స్వరాజ్యరావు మొహం పక్కకి తిప్పుకుని "నాకు టయిం అవుతోంది" అన్నాడు.

"అమ్మా! ఇక వెళ్ళండి" అన్నాడు. యుగంధర్. మంగళ నిద్ర మత్తులోంచి మేల్కొన్న దానిలా లేచింది. ముందు స్వరాజ్యరావూ, వెనక సార్జంటూ, వాళ్ళిద్దరికీ మధ్య మంగళా నడుచుకుంటూ పోలీసు వాను దగ్గరకి వెళ్ళారు. నరసింహమూర్తి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. వాసు బయల్దేరి వెళ్ళిపోయింది. నరసింహమూర్తి వెక్కి వెక్కి ఏడ్చాడు.

"మూర్తిగారూ! ఆడదాని మల్లే అలా ఏడవకండి. ఏడ్చి ఏం ప్రయోజనం. ముందు కర్తవ్యం ఆలోచించండి. ఎవర్ని అయినా క్రిమినల్ లాయర్ని కలుసుకోండి." నరసింహమూర్తి జేబులోంచి రుమాలు తీసి కళ్ళు తుడుచుకుని, యుగంధర్ దగ్గిరికి వచ్చి "ఇవి చేతులు కావు, కాళ్ళు అనుకోండి మంగళని ఈ ఉపద్రవంలోంచి మీరే తప్పించాలి" అన్నాడు.

"నా చేతనయిన సహాయం నేను చేస్తాను."

"యుగంధర్ గారూ! మీరు ఇప్పటికే చాలా సహాయం చేశారు మాకు. మీకింకా శ్రమ ఇవ్వడం న్యాయంకాదు. కానీ ఈ పరిస్థితిలో మిమ్మల్ని వేడుకోక తప్పదు. మంగళ డిఫెన్సుకి మీరే పూనుకోవాలి."

"నేనా?"

"డిటెక్టివ్ గానే కాక క్రిమినల్ లాయరుగా కూడా మీ ప్రతిభా విశేషాలు నాకు తెలుసు. మీరు వాదించి గెలిచిన కేసులు నాకు జ్ఞాపకం ఉన్నాయి. యుగంధర్ గారూ! వీలులేదనకండి."

"అవునుసార్! మంగళ నిర్దోషి అయితే మీరు తప్ప ఈ కేసు మరెవరూ గెలిపించలేరనుకుంటాను" అన్నాడు రాజు.

యుగంధర్ వెంటనే జవాబు చెప్పలేదు. "ఆలోచించి చెబుతాను, రేపు రండి" అన్నాడు నరసింహమూర్తితో.

## 11

యుగంధర్ నల్లకోటు వేసుకుని వసారాలో చరచర నడుచుకుంటూ వెళ్ళి కోర్టు హాలు చేరుకున్నాడు. యుగంధర్ని చూడగానే ఇన్స్పెక్టర్ స్వరాజ్యరావు లేచి ఎదురు వచ్చాడు.

"హల్లో! యుగంధర్. మంగళ తరపున మీరే కోర్టులో వాదించబోతున్నారని ప్రాసిక్యూటర్ చెప్పినా నేను నమ్మలేదు. ఇప్పుడు కూడా నమ్మలేకుండా ఉన్నాను. మీరే రంగంలోకి స్వయంగా దిగడానికి కారణమేమిటి? మంగళ నిర్దోషనని మీరు అనుకుంటున్నారా?" లేక" అని నవ్వుతూ. "మీకు బొత్తిగా డిటెక్షన్ కేసులు రావడం లేదా?" అన్నాడు.

యుగంధర్ కూడా నవ్వాడు, "నేరాలు జరిగిన మరుక్షణం దోషులని పట్టుకునే మీలాంటి ప్రతిభావంతులయిన పోలీసు ఆఫీసర్లు ఉంటే డిటెక్షన్‌కి నాకు కేసులు ఎక్కణ్ణించి వస్తాయి?" అన్నాడు.

"యుగంధర్ మంగళ నిర్దోషని మీరు సీరియస్‌గా అనుకుంటున్నారా? లేకపోతే మీరు స్వయంగా వాదించటానికి ఒప్పుకుంటారా?"

"అవును"

"ఆమె నిర్దోషి అనేందుకు కావలసిన సాక్ష్యం మీకు లభించిందా?"

"ఆ!"

"నాతో చెబితే సరిపోయేదిగా!"

"ఆమె దోషి అని మీరు అనుకున్నందుకు లభించిన సాక్ష్యాలు నాకు చెప్పారా? పోనీ ఇప్పుడు నేనా సాక్ష్యం మీకు చూపిస్తే కేసు ఉపసంహరించుకుంటారని మాట ఇస్తారా?" అడిగాడు యుగంధర్.

"అది నా చేతుల్లో లేదు."

"అయితే దాన్ని గురించి ఇప్పుడు చర్చించడం అనవసరం" అని యుగంధర్ అంటూవుండగా లాయర్ వజ్రాలరావు యుగంధర్ దగ్గరికి వచ్చాడు. వజ్రలరావు రావడం చూసి స్వరాజ్యరావు వెళ్ళిపోయాడు.

"హల్లో యుగంధర్. మిమ్మల్ని కోర్టులో నల్లగౌనులో చూడడం నాకు చాలా సరదాగా ఉంది. రెండుసార్లు మీకు ఫోన్ చేశాను. రెండుసార్లు మీ ఆఫీసుకి వచ్చాను. మిమ్మల్ని కలుసుకోవడం పడలేదు."

"అవునట. సారీ! ఏమిటి విశేషం?"

"నాగయ్యనీ, మంగళనీ కలిపి ఇద్దరి మీదా అభియోగం దాఖలు చేశారు. మనం కలిసి డిఫెన్సు జరిపించకూడదా?"

"ఉహూ"

"ఏం?"

"మంగళ నిర్దోషి అని నాకు నమ్మకముంది. మీ క్లయింటు నిర్దోషి అవునో కాదో నాకు తెలియదు"

"మీ క్లయింటు నిర్దోషయితే నా క్లయింటూ నిర్దోషిగా!"

"ఏమో! నా క్లయింటు తన డిఫెన్సు స్వతంత్రంగా నడిపించుకుంటుంది. మీ క్లయింటూ నిర్దోషిగా!"

"ఏమో! నా క్లయింటు తన డిఫెన్సు స్వతంత్రంగా నడిపించుకుంటుంది. మీ క్లయింటుతో పొత్తు అనవసరం."

వజ్రాలరావు యుగంధర్ని ఓరకంటితో చూశాడు. "ఏం దోషం అంతా నా క్లయింటు మీదికి నెట్టాలని చూస్తున్నారా?"

"అందులో తప్పులేదేమో? మీ క్లయింటు ఓ వాఙ్మూలం ఇచ్చాడుగా!"

"అవి టాక్టిక్స్ మిష్టర్ యుగంధర్. ప్రాసిక్యూషన్ని తప్పటడుగులు వేయించేందుకు వేసిన ప్లాను."

యుగంధర్ వజ్రాలరావుని సూటిగా చూశాడు. "నా క్లయింటుకి న్యాయం జరగాలి. నేను కోరేది అంతే! ఆమె హంతకురాలయితే శిక్ష అనుభవిస్తుంది. ఆమె నిర్దోషయితే విడుదల కావాలి. ప్రాసిక్యూషనూ, డిఫెన్సూ ఎత్తుకి పై ఎత్తులు వేయడానికీ, ఒకళ్ళని ఒకళ్ళు బోల్తా కొట్టించడానికీ హత్యకేసు ఆట కాదు. ఒక మనిషిని హత్య చేసిన ఘాతుకమైన నేరానికి విచారణ చేస్తారు. ఆ మనిషిని చంపిన హంతకులకి శిక్ష పడాలి. న్యాయం జరగాలి. ఇది న్యాయస్థానం - న్యాయం కోసం రెండు పక్షాలూ ఇక్కడికి వచ్చాయి ఇది ఆటలాడుకునే క్లబ్బు కాదు మిస్టర్ వజ్రాలరావు. ఈ విషయం మీరు జ్ఞాపకం ఉంచుకుంటారనుకుంటాను" అని యుగంధర్ అంటూ ఉండగా కోర్టు గుమాస్తా బల్లమీద కొట్టి ఛీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేటు కోర్టులోకి వస్తున్నారని హెచ్చరిక చేశాడు. కోర్టు గది నిశ్శబ్దమైంది.

ప్రాసిక్యూటరూ, అతని అసిస్టెంటులూ, స్వరాజ్యరావూ, ప్రాసిక్యూషన్ సాక్షులూ ఒక పక్కగా కూర్చున్నారు. యుగంధర్ వాళ్ళకి ఎదురుగా కూర్చున్నాడు. ముద్దాయిలు కోర్టులోకి తీసుకురాబడ్డారు. మేజిస్ట్రేటు కోర్టులోకి వచ్చాడు.

"యువర్ ఆనర్. కీ.శే. పూజ్యుల ఆదినారాయణరావు కుమార్తె, మొదటి ముద్దాయి అయిన మంగళాదేవీ, రెండవ ముద్దాయి అయిన నాగయ్యా కుట్రచేసి, 1953 ఫిబ్రవరి 13తేదీ రాత్రి 11.30 గంటలకి మొదటి ముద్దాయి మంగళాదేవి భర్త జగన్మోహన్ని పిస్తోళ్ళతో కాల్చి హత్య చేశారని ప్రాసిక్యూషన్ అభియోగం. బుద్ధిపూర్వకంగా ఆలోచించి, కుట్రచేసి హత్య చేయడంవల్ల ప్రాసిక్యూషన్ ఫస్టు డిగ్రీ మర్డర్ చార్జి దాఖలు చేసింది. ప్రాసిక్యూషన్ కేసు స్థూలంగా  వివరిస్తాను.

"ముద్దాయి మంగళాదేవి 1945 సంవత్సరంలో జగన్మోహన్ అనే యువకుణ్ణి వివాహం చేసుకుంది. వివాహం అయిన ఒక సంవత్సరం తర్వాత ఆమె భర్త జగన్మోహన్ పరారీ అయ్యాడు. ముద్దాయి మంగళాదేవి తన సంరక్షకుడైన మేనమామ ఇంటికి వెళ్ళిపోయింది. పరారీ అయిన జగన్మోహన్ తిరిగి రాలేదు. 1949 సంవత్సరంలో ధనికుడూ, యువకుడూ అయిన రామారావు అనే వ్యక్తి తనకి వధువు కావలెనని పత్రికలలో ప్రకటించాడు. ముద్దాయి మంగళాదేవి మేనమామ ఆ ప్రకటనకి జవాబు రాశాడు. ఉత్తర

ప్రత్యుత్తరాల తర్వాత రామారావూ, మంగళా ఒకర్నొకరు చూసుకోవడమూ, అన్యోన్య అంగీకారం కుదరడమూ జరిగింది. 1949 సంవత్సరం నవంబర్ 22 వ తేదీన ముద్దాయి మంగళకీ, రామారావుకీ వివాహం జరిగింది.

"జగన్మోహన్‌తో ముద్దాయి మంగళకి జరిగిన మొదటి వివాహం హిందూ వివాహ్హమని కోర్టువారు గమనించాలి. భర్త జగన్మోహన్‌తో ముద్దాయి మంగళకి జరిగిన మొదటి వివాహం హిందూ వివాహమని కోర్టువారు గమనించాలి. రామారావుతో ముద్దాయి మళ్ళీ పెళ్ళిచేసుకున్నదని కోర్టువారు గమనించాలి. రామారావుతో ముద్దాయికి జరిగిన రెండవ వివాహం కూడా హిందూశాస్త్ర ప్రకారమే జరిగిందని ప్రాసిక్యూషన్ రుజువు చేస్తుంది. చట్టరీత్యా కాని, శాస్త్రరీత్యాకాని ముద్దాయికి మళ్ళీ పెళ్ళిచేసుకునేందుకు అధికారం లేదు. ఆ రెండో పెళ్ళి చట్టరీత్యా అమలుకాదు.

"రామారావుని వివాహం చేసుకున్నప్పుడు ముద్దాయి మంగళాదేవికి మెజారిటీ వెళ్ళింది. వివాహానికి పూర్వంకాని, వివాహానంతరం కాని రెండవ భర్త రామారావుతో తనకి అదివరకు వివాహమయిన విషయం ఆమె చెప్పలేదు. మొదట జరిగిన వివాహం రహస్యంగా ఉంచి, రామారావుకి తను కన్య అనే అపోహ కలిగించి అతన్ని వివాహం చేసుకున్నది. వివాహం జరిగిన రెండేళ్ళకి రామారావుకీ, మంగళకీ మధ్య మనస్పర్ధలొచ్చాయి. ముద్దాయి మంగళని రామారావు ఇంట్లోంచి తరిమేశాడు.

"ఆమె మద్రాసులోనే ఇల్లు అద్దెకి తీసుకుని ఉంటోంది. మేనమామ ఇంటికి వెళ్ళిపోలేదు. రామారావుపైన దావా వేసింది - మనోవర్తికి కాదు; విడాకులకీ, పెళ్ళినాడు తనకి రామారావు పెట్టిన నగల కోసమూ, స్త్రీ ధనం కనక అవి తనకి చెందాలని ఆమె వాదం ఆ దావా విచారణకి రాకముందే ముద్దాయి మంగళాదేవికి ఒక వక్రపు ఆలోచన తట్టింది. రామారావు ఇంటినుంచి వస్తున్నప్పుడు ఇనపపెట్టె రెండో తాళం చెవి తనతో తెచ్చుకున్నది. ఆ తాళం చెవి రెండవ ముద్దాయి నాగయ్య కిచ్చి రామారావు ఇంట్లో ఇనపపెట్టెలోని వజ్రాల నెక్లెస్ దొంగతనం చేసి తెచ్చి తనకివ్వమని చెప్పింది.

"యువర్ ఆనర్! ముద్దాయి మంగళాదేవి అమాయకురాలు కాదు, చాలా గడుసు మనిషని నిరూపించడానికి ఈ పని చాలు. ఆ వజ్రాల నెక్లెసు ఖరీదు లక్షరుపాయలు. అది పెళ్ళినాడు ఆమెకి పెట్టబడింది. ముద్దాయి మంగళాదేవి తనే స్వయంగా రామారావు ఇంటికి వెళ్ళి నెక్లెసు తెచ్చుకునేందుకు అవకాశం లేదు కనుక రెండవ ముద్దాయి సహాయం కోరింది. నెక్లెసు తను దొంగతనం చేయించినట్లు రామారావుకి తెలిసినా తననేమీ చెయ్యలేడని అనుకున్నది మంగళాదేవి. చట్టరీత్యా ఆమె అప్పటికింకా రామారావు భార్య. ఆ నెక్లెస్ ఆమెదే. ఇనపపెట్టెని తాళం చెవితోనే తెరిచాడు. జోగయ్య. రామారావు ఒక వేళ పోలీస్ కంప్లైంటు ఇచ్చినా ఆ నెక్లెసు తనదనీ, తన నెక్లెసు తీసుకురమ్మని తనే జోగయ్యని పంపాననీ చెప్పేది మంగళాదేవి. అంతదూరం ఆలోచించే నెక్లెసు దొంగతనం చేయించింది.

"యువర్ ఆనర్. ముద్దాయి మంగళాదేవికి అనుకోని ఆటంకం ఒకటి ఏర్పడింది. ఫిబ్రవరి 13వ తేదీన ముద్దాయి మంగళ మొదటి భర్త జగన్ మోహన్ ఉన్నట్లుండి ఊడిపడ్డాడు. అకస్మాత్తుగా వచ్చి రామారావుని కలుసుకున్నాడు. తనకీ, ముద్దాయి మంగళకీ వివాహం జరిగిన విషయమూ, తను సంసారం పరిత్యజించి విరాగి అయిపోయిన విషయమూ రామారావుకి చెప్పాడు.

"హతుడు జగన్మోహన్ని ఆఖరుసారి సజీవంగా చూసింది రామారావు. తర్వాత హంతకులు అతన్ని చూశారు. ఫిబ్రవరి 13వ తేదీ అంటే హత్య జరిగిన రోజు మధ్యాహ్నం మూడు గంటలకి రెండవ ముద్దాయి నాగయ్య రామారావు ఇంటికి వెళ్ళాడు. రామారావు ఇంట్లో లేడు. అతనికోసం ఇంట్లో ఒక గంట కాచుకుని ఉండి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి 12.30 గంటలకి ముద్దాయి మంగళాదేవి తన తోటలో ఎవరో పిస్తోలు పేల్చి ఎవరినో చంపారని పోలీసు కంట్రోలు రూంకి ఫోను చేసింది. పోలీసు అధికారులు వెళ్ళి చూడగా ఒక సన్యాసి శవం కనిపించింది. ముద్దాయి మంగళాదేవిని ప్రశ్నిస్తే ఆ సన్యాసి ఎవరో తనకి తెలియదన్నది.

"యువర్ ఆనర్. జగన్మోహన్ని హత్య చేయడానికి ఒకముద్దాయి మంగళకే కారణం ఉన్నది. హత్యకి పూర్వం జరిగిన సంఘటన దృష్ట్యా ఆలోచిస్తే అకస్మాత్తుగా జగన్మోహన్ తిరిగి రావడం వల్ల ముద్దాయి మంగళకి నష్టమూ, చిక్కులూ కలిగాయి. ఆమెకీ రామారావుకీ

జరిగిన వివాహం చెల్లదు. అబద్ధాలు చెప్పి, మోసగించి పెళ్ళిచేసుకున్నందుకు ముద్దాయి శిక్షార్హురాలు అవుతుంది. రామారావుతో జరిగిన వివాహం చెల్లనట్లయితే స్త్రీ ధనం కింద నగలు అడిగే హక్కు ఆమెకి ఉండదు. రామారావు ఇంట్లోంచి నెక్లెస్ నాగయ్య ద్వారా దొంగతనం చేయించడం కూడా నేరమే అవుతుంది. ఆ ఇంట్లోగానీ, ఆ నగలమీద కానీ ఆమెకి ఎటువంటి అధికారమూ ఉండదు. తనకి అంతకు పూర్వము పెళ్ళయిందనీ, ఆ భర్త బతికి ఉన్నాడనీ ఎవరికీ తెలియకూడదు. అది రహస్యంగా ఉండాలి. జగన్మోహన్ ముద్దాయి ఇంటికి వెళ్ళినప్పుడు ఆమెకీ, అతనికీ జరిగిన సంభాషణ ఏమిటో ఊహించాలేగానీ సాక్ష్యమేమీలేదు. ఊహించడం కష్టం కాదనుకుంటాను.

"రెండవ ముద్దాయి నాగయ్యా, మొదటి ముద్దాయి మంగళా చాలా సన్నిహితులని ప్రాసిక్యూషను రుజువు చేస్తుంది. రెండవ ముద్దాయి నాగయ్య మొదటి ముద్దాయికి సహాయపడ్డాడనీ, నెక్లెసు దొంగిలించాడనీ రుజువు చేస్తాము. శవం పక్కన కనిపించిన పిస్తోలు మీద రెండవ ముద్దాయి వేలి ముద్రలున్నాయి. హత్య జరిగిన సమయంలో రెండవ ముద్దాయి హత్యాస్థలంలో ఉన్నట్లు రుజువు చేయగలము.

"యువర్ ఆనర్! ఇక ప్రాసిక్యూషన్ సాక్ష్యం ప్రవేశపెడుతుంది. ఆ సాక్ష్యాన్ని బట్టి మొదటి ముద్దాయి మంగళ, రెండవ ముద్దాయి నాగయ్య కలిసి జగన్మోహన్ని హత్యచేశారని రుజువవుతుంది" అని ప్రాసిక్యూటర్ రెడ్డి ప్రారంభోపన్యాసం ముగించాడు. తన ఉపన్యాసం అందరూ మెచ్చుకుంటున్నారా లేదా అని ఒకసారి కోర్టంతా కలయచూశాడు.

పోలీసు సర్జన్ ప్రాసిక్యూషన్ మొదటి సాక్షిగా బోను ఎక్కాడు. ప్రమాణ స్వీకారం, ఇతర లాంఛనాలు ముగిశాక ప్రాసిక్యూటర్ డైరెక్టు పరీక్ష ప్రారంభించాడు.

"ఫిబ్రవరి 13 తేదీ రాత్రి ఏం జరిగినదీ మీకు జ్ఞాపకమున్నదా?"

"జ్ఞాపకం ఉన్నది."

"ఏం జరిగింది?"

"రాత్రి ఒంటిగంటా అయిదు నిమిషాలకి సార్జంటు శివం టెలిఫోను చేసి నన్ను నుంగంబాకంలో రామన్స్ట్రీట్ 190 ఇంటికి వెంటనే రమ్మని ఇన్స్పెక్టర్ చెప్పమన్నారని చెప్పాడు."

"మీరు వెళ్ళారా? వెళ్ళాక ఏం జరిగింది?"

"వెళ్ళాను. ఆ ఇంటి తోటలో ఒక సన్యాసి శవం నేలమీద పడి ఉంది. ఆ శవాన్ని పరీక్ష చేశాను."

"పరీక్ష చేయగా మీకేం తెలిసింది?"

"ఆ సన్యాసి పిస్తోళ్ళు పేల్చి చంపబడ్డాడు. గుండెమీద నుంచి రక్తం కారి నేలమీద గడ్డ కట్టింది."

"ఆ శవాన్ని పోస్టుమార్టం చేశారా?"

"ఆ!"

"దయచేసి పోస్టుమార్టం పరీక్ష వివరాలు కోర్టువారికి చెబుతారా!"

"శవం గుండెలో రెండు పిస్తోలు గుళ్ళు ఉన్నాయి. అవి రెండు వేర్వేరు కాలిబర్ పిస్తోలు గుళ్ళు. రెండు పిస్తోళ్ళూ గుండెకి దగ్గరిగా పెట్టి కాల్చబడ్డాయి. అతి స్వల్పవ్యవధిలో అంటే కొన్ని క్షణాల వ్యవధిలో రెండు పిస్తోళ్ళూ పేల్చబడ్డాయి."

ప్రాసిక్యూటర్ రెండు గుళ్ళు తీసి సర్జన్కి చూపించి "వీటిని మీరు గుర్తుపట్టగలరా?" అడిగాడు.

**"ఆ ఇవే శవం గుండెలో కనిపించిన పిస్తోలు గుళ్ళు."**

"ఇవేనని ఎలా చెప్పగలుగుతున్నారు?"

"కత్తి మొనతో గుళ్ళమీద గుర్తుపెట్టాను"

ప్రాసిక్యూటర్ ఆ గుళ్ళని ఎక్జిబిట్ 'ఏ'గా దాఖలు చేశాడు.

"ఈ రెండు గుళ్ళూ ఒకదాని తర్వాత ఒకటి స్వల్ప వ్యవధిలో పేల్చబడ్డాయని మీకెలా తెలిసింది?"

"ఒక గుండు రైట్ వెంట్రికల్ ఆఫ్ ది హార్టులోనూ, మరొక్ గుండు లెఫ్టు వెంట్రికల్‌లోనూ కనబడ్డాయి. రెండు వెంట్రికల్స్‌లోంచి రక్తం చిమ్మింది. కనుక రెండు గుళ్ళూ తక్కువ వ్యవధిలో పేల్చబడి ఉండాలి."

"డాక్టర్ ఆ రెండు గుళ్ళలో ఏ గుండు ముందు పేల్చబడిందో చెప్పగలరా?"

"చెప్పలేను"

"రెండు పిస్తోళ్ళూ చెరో చేతితో పట్టుకుని పేల్చి ఉండవచ్చా?"

"వీలులేదు"

"ఎందువల్ల?"

"ఒక పిస్తోలు లాల్చీమీద ఛాతీకి ఆనించి పేల్చబడింది. రెండోది చొక్కా అడ్డం లేకుండా చేసి, చర్మానికి పిస్తోలు ఆనించి గుండెమీద పేల్చబడ్డది. కనుక రెండు పిస్తోళ్ళూ ఒకేసారి పేల్చి ఉండడానికి అవకాశం లేదు."

"డాక్టర్ హత్య ఎప్పుడు జరిగిందో నిర్ణయించారా!"

"ఆ! ఫిబ్రవరి13 వ తేదీ రాత్రి 11.30కీ, 11.40కీ మధ్య జరిగి ఉండాలి"

"ఎలా నిర్ణయించారు?"

"రిగర్ మార్టిస్ లక్షణాలని బట్టి, పోస్టుమార్టం, స్టెయినింగ్‌ని"

"డాక్టర్! హత్య 12.30కి జరిగి ఉండడానికి వీలులేదని నిశ్చయంగా చెప్పగలరా!"

"యస్. నేను శవాన్ని పరీక్ష చేయడానికి వెళ్ళినపుడు ఒంటిగంట అయింది. అప్పటికే శవం మీద పోస్టుమార్టం స్టెయినింగ్ గుర్తులు (అంటే శవం యొక్క చర్మం రంగు మారిపోవడం) వచ్చేశాయి. ప్రాణం పోయిన గంటా గంటన్నరకి కానీ ఈ పోస్టుమార్టం స్టెయినింగ్ ప్రారంభం కాదు. సామాన్యంగా నూటికి 90 సందర్భాలలో గంటన్నర అయితే కానీ రంగు మారడం మొదలు పెట్టదు."

"డాక్టర్. పోస్టుమార్టం బట్టి హత్య 11.30కి జరిగిందని నిర్ణయించారు కదా. తోటలో శవం పడున్న రీతిని బట్టిగాని మరే ఇతర శారీరక శాస్త్రాన్ని బట్టిగాని హత్య శవం పడున్న స్థలంలోనే జరిగిందో లేక మరెక్కడైనా జరిగిందో చెప్పగలరా?"

"గుండెలోంచి రక్తం జారి నేలమీద గడ్డకట్టింది. దాన్ని బట్టి నేను శవాన్ని చూసిన స్థలంలోనే హత్య జరిగిందని నిర్ణయించవచ్చు."

"ఆ స్థలం ఎక్కడో చెప్పండి."

"రామన్ స్ట్రీటు, నెం.130 ఇంటి తోటలో నైట్ క్వీన్ పొద దగ్గిర"

"థాంక్సు డాక్టర్" అని ప్రాసిక్యూటర్ డిఫెన్సు లాయర్లువైపు చూసి "క్రాస్ ఎగ్జామినేషన్ చేయవచ్చు" అన్నాడు.

లాయర్ వజ్రాలరావు లేచి నిలుచున్నాడు. ఒకసారి మేజిస్ట్రేటునీ, కోర్టులోఉన్న జనాన్నీ చూశాడు. నెమ్మదిగా సాక్షి బోను దగ్గిరికి వెళ్ళాడు.

"డాక్టర్! ఒక గుండు లాల్చీమీద, మరొక గుండు చర్మం మీదా పేల్చబడ్డాయి కనుక రెండూ ఒకేసారి పేల్చలేదని అన్నారు. రెండు గుళ్ళమీదా మీరు గుర్తులు పెట్టారు. దయచేసి ఏ గుండు లాల్చీమీదనుంచి పేల్చబడిందో, ఏది చర్మం మీద పేల్చబడిందో చెప్పండి" అడిగాడు.

"రెండు అడ్డగీతలు గీసి మధ్య చుక్కపెట్టిన గుండు లాల్చీమీద పేల్చబడింది. సున్నాగీసి దానిలో రెండు అడ్డగీతలు పెట్టింది చర్మం మీద పేల్చబడింది"

"డాక్టర్ ఆ రెండు గుళ్ళల్లో ఏ గుండువల్ల హత్య జరిగిందీ చెప్పలేనన్నాడు. సరే! వాటిలో ఏదైనా ఒక గుండు మాత్రమే కాల్చబడిందనీ, రెండవ గుండు కాల్చబడలేదనీ అనుకుంటే ఆ ఒక్క గుండువల్లే చావు సంభవించి ఉండవచ్చా?"

"ఉండవచ్చు."

"డాక్టర్. మరొక విషయం చెప్పండి. ఒక గుండు పేల్చిన తరువాత చాల స్వల్ప వ్యవధిలోనే రెండవ గుండు పేల్చబడింది అన్నారు. ఆ వ్యవధి ఎంత?"

"కొన్ని క్షణాలు"

"రెండు క్షణాలు అనుకోవచ్చా"

"ఆ!"

"ముప్పయి క్షణాల తర్వాత అయివుండవచ్చా!"

"ఆ!" "అయిదు నిమిషాలు అయివుండవచ్చా!"

"ఊహూ"

"సరే! ఒక నిమిషం అనుకుందా. గుండెలోకి పిస్తోలు పేల్చబడిన తర్వాత ఎన్ని నిమిషాలకి చావు సంభవిస్తుంది?"

"తక్షణమే"

"అంటే?"

"మరుక్షణమే ప్రాణం పోతుంది."

"కనుక రెండవసారి పిస్తోలు పేల్చకముందే, అంటే రెండో గుండు గుండెలోకి పోకముందే హతుడు మరణించి ఉండాలి అవునా?"

"అవును"

"కనుక రెండో గుండు శవం గుండెలో అంటే ప్రాణం లేని శరీరంలోకి పేల్చబడిందని అనవచ్చా?"

"అవును"

వజ్రాలరావు నవ్వుతూ ప్రాసిక్యూటర్ని చూసి "అంతే!" అన్నాడు.

డిటెక్టివ్ యుగంధర్ లేచాడు. యుగంధర్ లేచి నిలుచోగానే కోర్టులో సంచలనం కలిగింది. యుగంధర్ పేరు ప్రతిష్ఠలు విననివారు లేరు. మేజిస్ట్రేటు కూడా కుర్చీలో కొంచెం ముందుకు జరిగాడు.

"డాక్టర్ గుండెమీద గాయంలోంచి రక్తం కారి గడ్డ కట్టిందని చెప్పారు. రక్తం ఎటుకారింది? శవానికి ఎటువేపు నేలమీద రక్తం గడ్డ కట్టిందో చెప్పగలరా?"

"శవం ఎడమవైపునుంచి కుడివైపుకి రక్తం కారి నేలమీద గడ్డకట్టింది."

"మరి కొంచెం విపులంగా చెప్పండి."

"నేను శవాన్ని చూసినపుడు శవం కొద్దిగా కుడివైపుకి ఒత్తిగిలి ఉంది. రక్తం ఎడమవైపు నుంచి కుడివైపుకి కిందకి నేలమీదకి కారి గడ్డ కట్టింది."

"శవం తలవెనకగాని, మోచేతులమీదగానీ గాయాలు గీరుకునిపోయిన గుర్తులూ కనిపించాయా?"

"లేదు."

"డాక్టర్ ఓ మనిషి నిలుచునుండగా పిస్తోలుతో గుండెమీద కాల్చితే, గుండెలోంచి వెంటనే రక్తం కారుతుందా?"

"అవును."

"నిలుచున్న మనిషిని పిస్తోలుతో గుండెలో కాల్చితే రక్తం కిందకి కారుతుందికదూ!"

"అవును."

"శవం గడ్డిమీద పడివున్నదా?"

"అవును."

"నేలమీద దుమ్ముందా? లేక దిమ్మిస చేసిన గట్టినేలా?"

"దిమ్మిస చేసిన గట్టినేల."

"మనిషి ఆ నేలమీద నిటారుగా పడితే గాయాలు తగులుతాయా?"

"సాధారణంగా గాయాలు తగులుతాయి."

"హతుడు గుండెమీద నించి రక్తం కిందికి కారలేదు. శవం మీద వేరే గాయాలు ఏవీలేవు. కనుక హతుడు నిలుచునుండగా అతన్ని కాల్చలేదనీ, పడుకునుండగా కాల్చబడ్డాడనీ అనుకోవచ్చా?"

ప్రాసిక్యూటర్ చటుక్కున లేచి నిలుచున్నాడు. "యువర్ ఆనర్. అభ్యంతరం చెబుతున్నాను. సాక్షిని తన అభిప్రాయం చెప్పమనడం సమంజసం కాదు."

యుగంధర్ ప్రాసిక్యూటర్ని ఒకసారి తీక్షణంగా చూసి, "యువర్ ఆనర్ సాక్షి పోలీస్ సర్జన్. వైద్యశాస్త్రంలోనూ, శారీరక శాస్త్రంలోనూ ప్రవీణుడుగా ప్రాసిక్యూషన్ సాక్షిని క్వాలిఫై చేసింది. డిఫెన్సు అభ్యంతరం చెప్పలేదు. హతుడు నిలుచుండగా పిస్తోలు పేల్చబడిందీ లేనిదీ రక్తస్రావాన్ని బట్టీ, గాయాలనుబట్టీ, సర్జన్ నిర్ణయించగలిగితే ఆ నిర్ణయం ఊహించడం అని ప్రాసిక్యూటర్ ఎలా అనగలరు? అది ప్రవీణుని అభిప్రాయంగా కోర్టు అంగీకరించాలి. ఎక్స్‌పర్టుగా ప్రాసిక్యూటర్ క్వాలిఫై చేసిన సాక్షినే నేనీ ప్రశ్న అడుగుతున్నానని కోర్టువారు గమనించాలి."

మేజిస్ట్రేటు అభ్యంతరం తోసిపుచ్చాడు. సాక్షిని జవాబు చెప్పమని ఆదేశించాడు.

"యస్ సార్! హతుడు పడుకునుండగానే పిస్తోలు పేల్చబడిందని నిర్ణయించవచ్చు."

"థాంక్స్" అని యుగంధర్ కూర్చున్నాడు.

వజ్రాలరావు యుగంధర్ చెవిలో "కంగ్రాట్స్!" అన్నాడు.

మంగళ గత జీవితాన్ని గురించి కోర్టుకి తెలిపేందుకు ప్రాసిక్యూషన్ వరసగా సాక్షులని బోను ఎక్కించింది. జగన్మోహన్ తండ్రీ, జగన్మోహన్ బంధువులు ఇద్దరూ బోనెక్కి శవాన్ని తాము గుర్తుపట్టామనీ, ఆ శవం పరారీ అయిన జగన్మోహన్ అనీ ఖచ్చితంగా చెప్పారు. ముద్దాయి మంగళకీ, జగన్మోహన్‌కీ వివాహం జరిగిందనీ సాక్ష్యం ఇచ్చారు.

తర్వాత రామారావుకీ, మంగళకూ వివాహం జరిగిందని నిరూపించడానికి మరికొందరు సాక్షులని ప్రవేశపెట్టింది ప్రాసిక్యూషన్. మంగళ తరపున యుగంధర్ కాని, జోగయ్య తరపున వజ్రాలరావు కానీ ఆ సాక్షులని క్రాసు పరీక్ష చేయలేదు. తర్వాత రామారావు ఇంట్లో ఉండే ఒక దాసీదాన్ని, డ్రయివర్నీ బోనెక్కించారు ప్రాసిక్యూషన్. రామారావుకీ మంగళకీ పొసగలేదనీ, ఇద్దరూ కీచులాడుకునేవారనీ వాళ్ళిద్దరూ చెప్పారు. తప్పంతా సామాన్యంగా మంగళదేనని అనుకునేందుకు వీలుగా ఉంది వాళ్ళ సాక్ష్యం. యుగంధర్ వాళ్ళనీ క్రాసు పరీక్ష చెయ్యలేదు. వజ్రాలరావు వాళ్ళ సాక్ష్యంతో తనకేమీ సంబంధం లేనట్టూ ఊరుకున్నాడు.

తర్వాత ప్రాసిక్యూషన్ సాక్షిగా రామారావు బోను ఎక్కాడు. తనకీ, మంగళకీ వివాహం అయిందనీ, మంగళ కానీ, మంగళ మేనమామకానీ ఆమెకి పూర్వం జగన్మోహన్‌తో జరిగిన వివాహం గురించి తనకి చెప్పలేదనీ, మంగళ అవివాహితురాలు అనే అభిప్రాయంతోనే తను ఆమెని వివాహం చేసుకున్నాననీ డైరక్టు పరీక్షలో చెప్పాడు. మంగళ చాలా డబ్బు ఖర్చు పెట్టేదనీ, ఆమెకి డబ్బాశ ఎక్కువనీ, ముఖ్యంగా అందువల్లే, తామిద్దరి మధ్య మనస్పర్థలు రాసాగాయనీ కూడా చెప్పాడు. ఆమె కోరిన డబ్బంతా ఇవ్వటం మానినప్పటినుంచీ ఆమె తనతో చీటికీ మాటికీ పోట్లాడడం ప్రారంభించిందనీ, చివరికి ఒక రోజున ఒక ఆ ఇంట్లో ఉండనని వెళ్ళిపోయిందనీ చెప్పాడు.

"ఫిబ్రవరి 12వతేదీన మీ ఇనపపెట్టెలో ఉన్న నెక్లెస్ పోయిందని మీరు పోలీసు కంప్లెంటు ఇచ్చారు. అవునా?" ప్రాసిక్యూటర్ అడిగాడు.

"అవును."

"ఆ నెక్లెస్ ఎలా పోయిందో కోర్టువారికి చెబుతారా?"

"ఎలా పోయిందో నాకు తెలియదు. ఫిబ్రవరి 12వతేదీ మధ్యాహ్నం నేను నా ఇనపపెట్టె తెరిచాను. అందులో నెక్లెసు లేదు. ఇనపపెట్టె బద్దలు కొట్టబడలేదు. మారుతాళం చెవితో తీసిఉండాలనుకున్నాను. రాత్రి బయటినుంచి దొంగలెవరూ ఇంట్లోకి వచ్చిన నిదర్శనాలు లేవు. కనుక ఇంట్లో నౌఖర్లెవరయినా తీశారనుకుని పోలీసులకు రిపోర్టు ఇచ్చాను."

"ఆ నెక్లెసుని ఇనపపెట్టెలో మీరెప్పుడు చూశారు?" అడిగాడు ప్రాసిక్యూటర్.

"చాలారోజుల క్రితం. బహుశా నెల అయిందేమో?"

"రెండవ ముద్దాయి నాగయ్య మీకు స్నేహితుడా?"

"అతని పేరు నాగయ్య అని నాకు తెలియదు. మేమిద్దరము మొదటిసారి రైలులో కలుసుకున్నాం. తన పేరు జోగయ్య అని చెప్పాడు. తర్వాత తరచూ కలుసుకునేవాళ్ళం."

"అతను అంతకుముందు జైలుకి వెళ్ళివచ్చాడని మీకు తెలుసా?"

"తెలియదు."

"నెక్లెస్ పోయిన విషయం 12వతేదీ మీరు గమనించారు. అంతకు ముందురోజు రెండవ ముద్దాయి మీ ఇంటికి వచ్చాడా?"

"ఆ! అతను వచ్చినప్పుడు నేను ఇంట్లో లేను."

"మొదటి ముద్దాయి మంగళ మీ ఇంటికి ఆనాడు గానీ, మర్నాడు గానీ వచ్చిందా?"

"లేదు."

"మీకు తెలియకుండా వచ్చి ఉండడానికి అవకాశం ఉందా?"

"లేదు."

"మీ ఇనప్పపెట్టెకి ఎన్ని తాళం చెవులున్నాయి!"

"రెండు."

"రెండూ మీ వద్దనే ఉండేవా?"

"లేవు. మాకు పెళ్ళయిన కొత్తలో ఒకటి మంగళకిచ్చాను. ఆమె నా ఇంట్లోంచి వెళ్ళిపోతున్నపుడూ దాన్ని అడిగి తీసుకోవడం మర్చిపోయాను."

"ఫిబ్రవరి ఆ3వతేదీ పొద్దున్న పదిగంటలకి మీ ఇంటికి ఎవరయినా వచ్చారా?"

"ఓ సన్యాసి వచ్చాడు."

"ఆ సన్యాసి వచ్చినపుడు జరిగిన విషయాలు విపులంగా చెబుతారా?" అడిగాడు ప్రాసిక్యూటర్.

"నేను అప్పుడే బయటికి బయలుదేరబోతున్నాను. ఎవరో సన్యాసి వచ్చి నా భార్య క్షమించండి మొదటి ముద్దాయి పేరు చెప్పి ఇంట్లో ఉన్నదా అని నౌఖర్ని అడిగాడు". నౌఖరు వచ్చి నాకు చెప్పాడు. నేను వసారాలోకి వెళ్ళాను. ఓ సన్యాసి అక్కడ నిలుచున్నాడు.

'ఏం కావాలి?' అని అడిగాను.

'మంగళ ఇల్లు ఇదేనా?' అడిగాడు.

'ఎందుకు?' అని నేనడిగాను.

ఆమెని చూడాలని జవాబు చెప్పాడు.

ఎందుకో చెప్పమని కాస్త విసుగ్గా అడిగాను.

'నా భార్య కనుక' అన్నాడు.

ఎవరో పిచ్చివాడనుకున్నాను ముందు.

నవ్వి "మీ భార్య చిరునామా మీకు తెలియకపోవటమేమిటి? " అన్నాను.

అతను నవ్వాడు.

"మీరు మంగళ రెండో భర్త అనుకుంటాను. దయచేసి ఆమె చిరునామా చెబుతారా?" అని అడిగాడు సీరియస్‌గా.

అతను పిచ్చివాడు కాదనుకుని లోపలికి రమ్మన్నాను. హాల్లో కూర్చున్నాము. విపులంగా చెప్పమని అడిగాను. తన పేరు జగన్మోహన్ అనీ, మంగళ తన భార్య అనీ, వివాహం అయిన కొంతకాలానికి జీవితం మీద విరక్తి కలిగి తను హిమాలయాలకి వెళ్ళిపోయాననీ, ఈ మధ్యనే తిరిగి వచ్చి తన భార్య ఏమైందో విచారిస్తే మళ్ళీ పెళ్ళి చేసుకున్నదనీ, ఈ ఊళ్ళో ఉంటున్నదని తెలిసిందనీ చెప్పాడు. మంగళ చిరునామా చెప్పాను. వెళ్ళిపోయాడు."

"అతన్ని మళ్ళీ చూడడం సంభవించిందా?"

"లేదు అతను బతికుండగా చూడలేదు."

"అంటే?"

"పోలీసు అధికారులు మార్చురీకి నన్ను తీసుకెళ్ళి అతని శవాన్ని చూపించారు."

"జగన్మోహన్ మీ ఇంటినుంచి బయలుదేరేటప్పుడు తను ఎక్కడికి వెళ్ళబోతున్నదీ మీకు చెప్పాడా?"

"ఆ! మంగళ ఇంటికి వెళుతున్నానని చెప్పాడు."

ప్రాసిక్యూటర్ వెనక్కి తిరిగి తన బల్లదగ్గరకి వెళ్ళి ప్రాసిక్యూషన్ పరీక్ష అయిపోయిందని చెప్పాడు. లాయరు వజ్రాలరావు లేచాడు క్రాసు పరీక్ష చేయడానికి.

ప్రాసిక్యూటర్ చటుక్కున వెనక్కి తిరిగి "రామారావుగారూ! మీకు పిస్తోలు లైసెన్సు ఉన్నదా?" అడిగాడు.

"యస్! నా దగ్గిర మూడు పిస్తోళ్ళు ఉండేవి."

"ఉండేవి అంటున్నారు, ఇప్పుడు లేవా?"

"ఇప్పుడు వాటిలో ఒకటే నా దగ్గిర ఉంది."

"మిగతా రెండూ ఏమయ్యాయి?"

"పోయాయి."

"ఎప్పుడు?"

"ఫిబ్రవరి 14వతేదీకి పూర్వం. ఆ రోజు పోలీసు ఉద్యోగి వచ్చి ఆ పిస్తోళ్ళ విషయం నన్నడగగా బీరువా తెరిచి వెతికాను. మూడింటిలో రెండు కనిపించలేదు."

"వాటిని ఎవరు ఎప్పుడు దొంగిలించారో చెప్పగలరా?"

"చెప్పలేను. చనువుగా నా పడకగదిలోకి వచ్చే స్నేహితులెవరయినా తీసి ఉండచ్చు."

"రెండవ ముద్దాయికి మీ ఇంట్లో అంత చనువు ఉండేదా?"

"ఆ!"

ప్రాసిక్యూటర్ ఒక పిస్తోలు రామారావు చేతికి ఇచ్చి "ఇది మీదేనా? " అడిగాడు.

"అవును" అన్నాడు రామారావు.

"అవునని ఎలా చెప్పగలుగుతున్నారు?"

"నెంబర్‌ని బట్టి."

"థాంక్సు" అంటూ ప్రాసిక్యూటర్ ఆ పిస్తోలుని ఎక్జిబిట్ 'బి'గా కోర్టులో దాఖలు చేశాడు.

లాయర్ వజ్రాలరావు లేచి బోను దగ్గరికి వెళ్ళి "రామారావుగారు! మీరు ఇప్పుడు మీ పిస్తోల్‌ని గుర్తుపట్టిన పిస్తోలు కాలిబర్, పేరూ చెబుతారా?"

".48 వెబ్‌స్టర్."

"ఆ రెండు పిస్తోళ్ళూ మీ బీరువాలో ఉండేవని చెప్పారు. బీరువా తాళం వేసి ఉండేదా?"

"లేదు."

"హత్య జరిగిన ఎన్నాళ్ళకి పూర్వం మొదటి ముద్దాయి మీ ఇంటినుంచి వెళ్ళిపోయింది?"

"రెండు నెలలక్రితం."

"ఈ రెండు నెలలో ఎప్పుడయినా మీరా పిస్తోళ్ళని చూశారా?"

"లేదు."

"హత్య ఫిబ్రవరి 13వతేదీ జరిగింది. అంతకు రెండు నెలల క్రితం ఆ పిస్తోళ్ళని ఎవరయినా తీసుకుని ఉండవచ్చా?"

"ఆ!"

"థాంక్సు" అని వజ్రాలరావు తన కుర్చీ దగ్గరికి వెళ్ళిపోయాడు.

డిటెక్టివ్ యుగంధర్ లేచి నెమ్మదిగా బోను దగ్గరికి వెళ్ళాడు.

"ఇనపపెట్టెలో ఉన్న నెక్లెస్ పోయిందని చెప్పారు. దాన్ని మీరెక్కడకొన్నారు?"

"డైమండ్ మర్చంట్సు, లూలామర్స్ దగ్గిర."

"బిల్లు ఎవరి పేర్న వ్రాయించారు?"

"మంగళ పేర్న."

"ఆ నెక్లెసుని ఇన్స్యూర్ చేయించారు కదూ!"

"అవును."

"ఎప్పుడు?"

"ఆరునెలలక్రితం."

"ఎంతకి ఇన్సూరు చేయించారు?"

"లక్షరూపాయలకి"

"ఆ నెక్లెసు విలువ నిరూపించేందుకు బిల్లు చూపించారా?"

"లేదు."

"ఎందువల్ల చూపలేదు"

"బిల్లుపోయింది."

"అయితే దాన్నెలా ఇన్సూరెన్సు కంపెనీవారు విలువ కట్టారు."

"జీవన్‌లాల్ కంపెనీకి తీసుకు వెళ్ళి విలువ కట్టించాను."

"ఎవరి పేర్న ఇన్సూరు చేశారు?"

"నా పేర్న."

"రామారావుగారూ నెక్లెస్ మంగళ పేర్న కొన్నారు. ఇన్సూరెన్సు చేసింది మీ పేర్న. ఎందుకలా చేశారు?

"అప్పుడు మంగళా నేను సఖ్యంగానే ఉన్నాము. కనుక ఎవరిపేర్న ఇన్సూరు చేసినా ఒకటే అనుకున్నాను."

"మీరు ఉద్యోగం చేస్తున్నారా?"

"లేదు."

"అయితే మీకు సంపాదన ఏమిటి?"

"కొన్ని కంపెనీల పేర్లు ఏమిటో, మీకు దేనిమీద ఎంత లాభం వస్తోందో చెప్పగలరా?"

"మద్రాసు టైల్సు కంపెనీ, మద్రాసు కెమికల్ కంపెనీ, ఓరియంటల్ మెడికల్ స్టోర్సు, ఈస్టర్న్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ కంపెనీలలో పెట్టుబడి పెట్టాను. సాలుకి యాభై అరవై వేలదాకా ఆదాయం వస్తుంది."

"ఈ సంవత్సరం అంత లాభం వచ్చిందా?"

"లేదు."

"ఏమాత్రం లాభం వచ్చింది?"

"పది పదిహేను వేలదాకా లాభం వచ్చింది."

"ఆదాయం పన్ను కట్టారా?"

"లేదు."

"ఎందువల్ల?"

"మరొక కంపెనీలో నష్టం వచ్చింది."

"ఏ మాత్రం?"

రామారావు కొంచెం చిరాకుగా చూశాడు. జవాబు చెప్పలేదు.

"ఇన్‌కంటాక్స్ లెక్కలని బట్టి అది ఎలాగో తెలుస్తుంది" అన్నాడు యుగంధర్ నెమ్మదిగా.

"లక్షన్నర దాకా నష్టం వచ్చింది."

"కనక ప్రస్తుతం మీరు డబ్బు చిక్కుల్లో ఉన్నారా?"

"లేదు."

"సదరన్ బాంక్‌లో యాభైవేలు అప్పుచేశారా?"

"చేశాను."

యుగంధర్ చేతికున్న గడియారం చూసుకున్నాడు.

ఇంకా అయిదు నిమిషాలున్నది ఆనాటి విచారణ ముగియడానికి. మర్నాటివరకూ రామారావు క్రాస్ ఎగ్జామినేషన్ వాయిదా వేయించాలి. ఎలాగయినా తాత్సారం చెయ్యాలి అనుకున్నాడు.

"హతుడు మీ ఇంటికి వచ్చి మొదటి ముద్దాయి చిరునామా అడిగాడు. సరే! కొన్ని ఏళ్ళ క్రితం భార్యని వొదిలి వెళ్ళిపోయిన ఆ పెద్దమనిషి తనకి అకస్మాత్తుగా, అన్నేళ్ళ తర్వాత భార్యమీద ఎందుకంత అవ్యాజమైన ప్రేమ కలిగిందో చెప్పాడా?"

"లేదు. కానీ తన భార్య ఎలా ఉందో చూడాలనిపించడంలో ఆశ్చర్యం లేదు."

"నిజమే! మీ అభిప్రాయానికి విలువ ఇచ్చి తీరాలి. ఇటువంటి విషయాలలో అనుభవమున్న వారు మీరు. రామారావు గారూ! మంగళ మీ ఇంటినుంచి వెళ్ళిపోయాక ఆమెని చూడాలని మీకు ఎప్పుడైనా అనిపించిందా?"

రామారావు జవాబు చెప్పలేదు.

"ఆమెని కలుసుకున్నారా?"

"లేదు."

గడియారం అయిదు గంటలు కొట్టింది.

మేజిస్ట్రేటు యుగంధర్ని చూస్తూ "ఈ సాక్షిని మీరు ఇంకా క్రాస్ పరీక్ష చెయ్యవలసి ఉన్నదా? లేక పూర్తి అయిందా?" అడిగాడు.

"ఇంకా ఉంది."

"అయితే రేపటికి వాయిదా వేస్తాను!"

యుగంధర్ "యస్, యువర్ ఆనర్" అని వెనక్కి వెళ్ళి కూర్చున్నాడు.

●●●

**యుగంధరూ, రాజూ కోర్టునుంచి** బయటికి వచ్చి కారెక్కుతుండగా పోలీసు కమీషనర్ ప్రయివేటు సెక్రటరీ కారు దగ్గరకి వెళ్ళి "కమీషనర్ మీతో మాట్లాడాలిట. శ్రమకాకపోతే ఒకసారి రమ్మంటున్నారు" అన్నాడు.

యుగంధరూ, రాజు తిన్నగా కమీషనర్ ఆఫీసుకి వెళ్ళారు.

"మీ కోసమే కాచుకున్నాను యుగంధర్. ఏమిటి? సన్యాసి హత్యకేసులో మొదటి ముద్దాయి తరపున మీరు వాదిస్తున్నారట. ఈ మధ్య నేను శెలవు మీద ఉన్నాను.

ఇవాళే తిరిగి డ్యూటీలో చేరాను. మంగళ నిర్దోషని మీరు భావించి ఉంటే నాతో ఒక మాట చెబితే చాలుకదా! తొందరపడి ఆమెమీద కేసు దాఖలు చెయ్యనిచ్చేవాణ్ణికాను" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు సేకరించిన సాక్ష్యం బలంగా ఉంది. ఆమెని ఆయన అరెస్టు చెయ్యక తప్పింది కాదు"అన్నాడు యుగంధర్.

"అయ్యుండవచ్చు. కానీ మీ అభిప్రాయానికి ఎక్కువ విలువ ఇస్తాము. ఒక మనిషి నిర్దోషి అని మీరు తగిన కారణం లేనిదే అనరు. మీరు తప్పుచేయడం నేనింతవరకూ ఎరగను."

యుగంధర్ నవ్వాడు. "నా మీద మీ కంత గౌరవం ఉన్నందుకు థాంక్స్. మంగళ నిర్దోషి అని నిరూపించేందుకు నేనేమీ సాక్ష్యం ఇంతవరకు సంపాదించ లేకపోయాను. అందుకే పోలీసు ఉద్యోగంలో నాకున్న పరపతి ఉపయోగించ దలచుకోలేదు. స్వరాజ్యరావు నాకు మిత్రుడు. అతను తెలివైనవాడు. ఆమె నిర్దోషి అనుకోవడంలో నేనే పొరపడి ఉండవచ్చు" అన్నాడు.

కమీషనర్ యుగంధర్ని మెప్పుతో చూశాడు. "యుగంధర్ గారూ మీకు పరపతి ఉన్నా ఆ పరపతిని సద్వినియోగం చేస్తున్నానని పూర్తి నమ్మకముంటే గాని ఉపయోగించరు. అదే మీలో గొప్పతనం. అందుకే మీ మీద మాకు గౌరవం. స్వలాభం కోసం మీరు న్యాయానికి అడ్డురారు. ఒక విషయం జ్ఞాపకముంచుకోండి. మీ తెలివి తేటలమీదా, మీ అభిప్రాయాల మీదా పోలీసు డిపార్టుమెంటుకి చాలా గౌరవం ఉంది."

"థాంక్స్ వస్తాను" అని యుగంధర్ వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరుకోగానే "రాజూ! ఈ రాత్రి మనకి చాలా పనివుంది. వెంటనే భోజనం చేద్దాం" అన్నాడు.

భోజనాలయ్యాక సిగరెట్ వెలిగించి పడక కుర్చీలో పడుకున్నాడు. పదకొండు గంటలకి అలారం మోగేటట్లు పెట్టి కళ్ళు మూసుకున్నాడు. రాజు కూడా పక్కనే ఇంకో పడక కుర్చీలో పడుకున్నాడు.

సరిగ్గా పదకొండు గంటలకి అలారం మోగింది. యుగంధర్ చటుక్కున లేచాడు. రాజూ లేచాడు. ఇద్దరూ లోపలికి వెళ్ళి బీరువాలోంచి నల్లని దుస్తులు బయటికి తీశారు. బిగువుగా ఉన్న నల్లని పాంట్లు, నల్లని షర్టు వేసుకున్నారు. రబ్బర్ బూట్సు తొడుక్కున్నారు. చిన్న తువ్వాళ్ళంత నల్లని గుడ్డలు తీసి చెరొకటి జేబులో పెట్టుకున్నారు. సొరుగులోంచి సంచి ఒకటి తీశారు. అందులో స్క్రూడ్రయివర్, తీగె, రెంచీ, ఆకురాయి, టార్చిలైటు, ఆసిడ్ సీసా మొదలయినవి ఉన్నాయి. యుగంధర్ ఆ సంచిని జేబులో పెట్టుకున్నాడు. తర్వాత ఇద్దరూ పిస్తోళ్ళు జేబులో వేసుకున్నారు.

రాత్రి పన్నెండు గంటలయ్యేవరకూ ఉండి క్రిజ్లర్కారెక్కారు, నెమ్మదిగా డ్రయివ్ చేశాడు రాజు. తోవలో ఏమీ మాట్లాడుకోలేదు. నిర్మానుష్యంగా ఉన్న ఒక రోడ్ మీద ఓ చెట్టు కింద కారు ఆపారు. కారు తలుపులు తాళం వేసి అక్కణ్ణించి కాలినడకన బయలుదేరారు. రెండు ఫర్లాంగులు నడిచి ఒక ఇంటికి పదిగజాల దూరంలో, ప్రహరీ గోడ నీడకింద నిలబడ్డారు. రోడ్ మీద జనసంచారం లేదు. వీధి దీపాలు అంత కాంతిగా లేవు. రోడ్మీద ఎవరూ లేకుండా చూసి ఇద్దరు డిటెక్టివ్లూ ప్రహరీగోడ దూకి నెమ్మదిగా ఇంటి ఆవరనలో ఉన్న తోటలోకి వెళ్ళారు. అది పెద్ద తోట కాదు. ఒకటి రెండు వేపచెట్లు, క్రోటన్లు ఉన్నాయి. వాటి నీడల్లోంచి ఇంటి పెరటి గుమ్మమ వైపు నడిచారు. ఇంట్లో దీపాలు లేవు. పెరటి గుమ్మం తలుపు దగ్గర ఆగారు. యుగంధర్ జేబులోంచి సంచి తీశాడు. రాజు టార్చి వెలిగించి, వెలుగు కనపడకుండా చెయ్యి అడ్డం పెట్టి ఒకే ఒక కాంతిరేఖ తలుపు సందులమీద పడేటట్లు పట్టుకున్నాడు. అయిదు నిమిషాలు స్క్రూడ్రయివర్తో యుగంధర్ తంటాలు పడిన తర్వాత తలుపు తెరుచుకుంది. ఇద్దరూ చప్పుడు చెయ్యకుండా లోపలికి వెళ్ళి తలుపు దగ్గిర ఆగారు. జేబుల్లోంచి నల్లని గుడ్డలు తీసి ముఖాలు కనపడకుండా కట్టుకున్నారు. ఒకరు ఊపిరి తీసుకోవడం రెండోవాళ్ళకి వినిపిస్తోంది. రెండు నిమిషాలు చప్పుడు చెయ్యకుండా తలుపు దగ్గిర నిలబడి తర్వాత టార్చి వెలిగించారు. ఒక్కొక్క గదీ వెదక నారంభించారు. ఏ ఒక్కచోటూ విడవకుండా అంతా వెతికారు.

"నా ఊహ సరయినదయితే ఇక్కడే ఈ ఇంట్లోనే ఉండాలి" అన్నాడు యుగంధర్ రాజు చెవిలో.

"ఇంట్లోవాళ్ళు లేవకుండా మనం ఇల్లంతా ఎట్లా వెతుకుతాం?" అన్నాడు రాజు.

వంట ఇంటి వేపునుంచి సన్నని గురక వినిపించింది. యుగంధర్ అటు నడిచాడు. చాపమీద వంటవాడు పడుకుని నిద్రపోతున్నాడు. యుగంధర్ జేబులోంచి ఒక సీసా తీసి అందులోంచి ఏదో ద్రవం జేబురుమాలుమీద పోసి, ఆ వంటవాడి ముక్కు

దగ్గిర పెట్టాడు. అతను తల ఇటూ అటూ తిప్పి పక్కకి వాల్చేశాడు. రాజు జేబుల్లోంచి సన్నని తీగెతీసి అతని చేతులూ, కాళ్ళూ బిగించి జేబురుమాలుతో నోరు కట్టేశాడు.

మళ్ళీ వెతకడం ప్రారంభించారు. గోడలకున్న ఫోటోలని తీసి చూశారు. డబ్బాల మూతలు తీసి చుశారు. బల్లల సొరుగులు, నీళ్ళతో నిండివున్న అండాల అడుగులు - ఒక స్థలం కాదు. అంతా వెతికారు. ఎక్కడా ఏమీ కనిపించలేదు.

"మేడమీదకి వెళదాం" అన్నాడు యుగంధర్.

మేడమెట్లు ఎక్కుతున్నారు. అదిరిపడ్డారిద్దరూ. గోడ గడియారం ఠంగ్‌మని అరగంట కొట్టింది. గడియారం వంక చూశాడు యుగంధర్. గడియారం పెండ్యులం కనిపించలేదు. అద్దం నల్లగా ఉంది. వేళ్ళతో అద్దంపైన రాసి చూశాడు. వేళ్ళకి ఏమీ అతుక్కోలేదు. తలుపు లాగి చూశాడు. రాలేదు. అనుమానం కలిగి గడియారాన్ని గోడమీదనుంచి దింపాడు. స్క్రూడ్రయివర్‌తో తలుపు తెరిచాడు.

రాజు టార్చిలైటు వేశాడు. తళతళ మెరుస్తున్నది వజ్రాల నెక్లెసు గడియారం లోపల. యుగంధర్ మెట్లమీద కూర్చుని జేబులోంచి ప్లయర్స్ తీసి, చేతితో తాకకుండా నెక్లెస్ బయటికి తీశాడు.

"చేతులెత్తండి" అన్నాడు ఎవరో వెనక.

ఇద్దరి మీదా టార్చి వెలుగుపడింది. ఇద్దరూ చేతులెత్తారు.

"ఎవరు మీరు?" అంటూ పైనుంచి ఓ మనిషి మెట్లు దిగి వస్తున్నాడు. అతని చేతిలో ఉన్న పిస్తోలు రెండో చేతిలో ఉన్న టార్చి వెలుగులో మెరుస్తోంది.

"ఎవరు మీరు? ఏం చేస్తున్నారు?" అంటూ మెట్లు దిగి వస్తున్నాడు అతను.

యుగంధర్ కాని, రాజు కాని మాట్లాడలేదు. అతను మరికొన్ని మెట్లు దిగివచ్చి, "మీ రెవరు?" అని గద్దించాడు. వాళ్ళు జవాబు చెప్పలేదు. నల్లని ముసుగులు వేసుకున్న ఇద్దరి మొహాలని చూస్తున్నాడు. "మొహాలమీద ఉన్న ఆ గుడ్డ తీసెయ్యండి" ఆజ్ఞాపించాడు.

యుగంధర్ జంకుతూ ముసుగు తీస్తున్నట్లు నటించాడు. అతను ముసుగు కింద మొహాన్ని చూడడానికి ముందుకి ఒంగాడు. ఆ అదను చూసుకుని రాజు ముందుకి ఉరికి అతని చేతిమీద బలంగా ఒక దెబ్బకొట్టాడు. పిస్తోలు కింద పడిపోయింది. అతను రాజుతో కలియబడ్డాడు. ఇద్దరూ మెట్లమీద నుంచి దొర్లుతున్నారు. యుగంధర్ ఇద్దర్నీ చెరో చేత్తో పట్టుకున్నాడు. రాజు లేచి నిలుచున్నాడు. జేబులోంచి తీగ తీసి రాజు అతని చేతులూ, కాళ్ళూ కట్టేశాడు. అతని చేతిలోనుంచి కిందపడిన పిస్తోలు యుగంధర్ జేబులో వేసుకున్నాడు అతన్ని మెట్లమీదే ఒదిలేసి మేడమీదకి వెళ్ళాడు రాజుతో. మళ్ళీ వెతకడం ప్రారంభించారు. మేడమీద ఒక గదిలో ఆడవాళ్ళ హైహీల్స్ జత కనిపించింది. వాటిని కాగింతంతో పొట్లం కట్టాడు యుగంధర్. ఇంకో గదిలో యుగంధర్‌కి ఒక జేబురుమాలు కనబడ్డది. దాన్ని వాసన చూసి జేబులో పెట్టుకున్నాడు.

ఇద్దరూ కిందకి దిగి వచ్చారు. మెట్లమీద పడున్న మనిషికి కొద్దిగా క్లోరోఫాం వాసన చూపించి, చేతులకీ, కాళ్ళకీ కట్టిన తీగ ఊడదీశారు. తర్వాత వంటమనిషిని కట్టిన బంధాలు కూడా ఊడతీసి వచ్చిన దారిన బయటికి వెళ్ళారు. ప్రహరీగోడ దూకి వీధిలోకి వెళ్ళాక ఇద్దరూ ఒకర్నొకరు చూసుకుని నవ్వుకున్నారు.

"గుడ్!" అన్నాడు యుగంధర్. రాజు భుజం మీద చెయ్యివేసి ఆపి, "రాజూ! నీ దగ్గిర రివాల్వరు ఉందా?" అడిగాడు.

రాజు తల ఊపాడు. "నువ్వీ ప్రాంతాల్లో ఉండు. అతన్ని నీడలా వెంటాడు. ఏం జరిగినా సరే అతన్ని వదలకూడదు. విశేషమైనా ఉంటే, అవకాశం చూసుకుని ఆఫీసుకి ఫోను చెయ్యి."

రాజు సరేనని తల ఊపాడు. యుగంధర్ చెట్టుకింద ఆపిన తన కారు దగ్గరికి వెళ్ళాడు. ఇంటికి చేరుకోగానే తన కూడా తెచ్చిన వస్తువులు జాగ్రత్తగా ఇనప పెట్టెలో పెట్టి పడుకున్నాడు. తెల్లారి నిద్రలేవగానే, ఆ నాలుగు వస్తువులనీ బయటికి తీసి పరీక్షగా చూశాడు.

పిస్తోలు మళ్ళీ ఇనపపెట్టెలో పెట్టివేశాడు. జేబురుమాలు, హైహీల్సు, నెక్లెసు ఓ తోలు సంచిలో పెట్టుకుని బయలుదేరి తన స్నేహితుడైన ఒక రిటైర్డు ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టు ఇంటికి వెళ్ళాడు.

నెక్లెసు అతని చేతికిచ్చి, "దయచేసి ఈ నెక్లెసుకి ఉన్న బంగారు పతకం మిద వేలిముద్ర లేవయినా ఉన్నాయేమో చూడండి. ఈ నెక్లెసుని తర్వాత మీరు గుర్తు పట్టేందుకు ఏదయినా గుర్తుపెటుకోండి. మళ్ళీ కలుసుకుంటాను" అన్నాడు. అక్కణ్ణించి పెనిటెన్ షియరీకి వెళ్ళి తన క్లయింటు మంగళని కలుసుకుని మాట్లాడాడు.

●●●

మర్నాడు సన్యాసి హత్య విచారణ మళ్ళీ ప్రారంభం అయింది. క్రితం రోజు రామారావు క్రాసు పరీక్ష పూర్తికానందున మళ్ళీ అతనే బోనులో పిలిచారు.

"రామారావుగారూ మీకూ, ముద్దాయి మంగళకీ మనస్పర్థలు కలగడానికి కారణం ఏమిటి?" అడిగాడు యుగంధర్.

"ఆమెకి డబ్బాశ చాలా ఎక్కువగా ఉండడమూ, ఇతర స్త్రీలతో మీరు సంబంధం పెట్టుకోవడమూ, నీతి బాహ్యంగా ప్రవర్తించడమూ మీ ఇద్దరి మధ్యా మనస్పర్థలు కలగడానికి కారణమేమో చెబుతారా?"

"కాదు. నా కటువంటి వ్యసనాలు ఉంటే, పత్రికల్లో ప్రకటించి ఏరికోరి మంగళని ఎందుకు పెళ్ళిచేసుకుంటాను. కట్నం, కానుకలు నాకేమీ ఇవ్వలేదే?"

యుగంధర్ నవ్వాడు. "అవునవును. చాలా మంచి పాయింటు అది. మీరు ముద్దాయి మంగళని వివాహం చేసుకునే ముందు, ఒక నెలరోజుల ముందు మీ ఆరోగ్యం గురించి డాక్టర్ నిరంజనరావుని కలుసుకున్నారా?"

రామారావు కొంచెం సందేహించి "అవును" అన్నాడు.

"ఆయన ఏమని చెప్పాడు?"

రామారావు జవాబు చెప్పలేదు.

"మీకు క్షయరోగం వచ్చిందనీ, అట్టేకాలం బతకరనీ చెప్పాడా?"

"అవును."

"అయినప్పటికీ మీరు పెళ్ళిచేసుకున్నారు. ఎందువల్ల?"

రామారావు మొహం ఎర్రనయింది. జవాబు చెప్పలేదు.

"సరే ఎంతోకాలం బతకనుకదా ఇప్పుడయినా ఓ భార్య ఉంటే బావుంటుందని పెళ్ళిచేసుకున్నారనుకుంటాను. మిమ్మల్ని చికాకు పెట్టను. పెళ్ళయిన రెండు నెలలకి మీరు క్షయ ఎక్స్‌పర్టు డాక్టర్ వల్లభరావుని కలుసుకున్నారు కదూ!"

"అవును."

"ఆయన ఏం చెప్పారు?"

"నాకు క్షయరోగం లేదనీ, ఆరోగ్యంగానే ఉన్నాననీ చెప్పారు."

"మీరు డాక్టర్ నిరంజనరావుని మళ్ళీ కలుసుకుని అడిగారా?"

"అడిగాను . తను పొరపాటువల్ల అల్లా డయగ్నయిజ్ చేశారనీ, క్షమించమనీ అన్నాడు"

"సరే మొదటి ముద్దాయి మంగళ చెల్లెలు సరళ మీకు తెలుసా?"

"ఆ!"

"ఆమె మీ ఇంటికి రావడమూ, మీ ఇంట్లో ఉండడమూ ఎన్నడయినా జరిగిందా?"

"ఆ! మంగళా, నేను కలిసి ఉన్నప్పుడూ వచ్చి ఒక నెల రోజులున్నది."

"హత్య జరిగిననాడు ఆమె మీ ఇంటికి వచ్చిందా?"

"లేదు."

"సరళతో మీరు అసభ్యంగా ప్రవర్తించగా ఆమె తన అక్కకి ఆ విషయం చెప్పడం వల్ల మీకూ, మంగళకీ ఘర్షణ జరిగింది. అంతటితో మంగళకి అసహ్యమూ, విరక్తి కలిగి మీ ఇంటినుంచి వెళ్ళిపోయింది. నిజమేనా?"

"అబద్ధం"

"అంతే" అంటూ యుగంధర్ తన కుర్చీ వైపు తిరిగాడు. ఒకసారి కోర్టంతా కలయచూశాడు. ప్రేక్షకుల బెంచీమీద ఒక మూలగా అతని అసిస్టెంటు రాజు కనపడ్డాడు.

తర్వాత ప్రాసిక్యూటర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసరు స్వరాజ్యరావుని బోనులోకి పిలిచాడు. మొదటి నుంచీ చివర వరకూ - మంగళ ఫోను చెయ్యడం దగ్గరనుంచి మంగళనీ, నాగయ్యనీ అరెస్టు చెయ్యడం వరకూ చెప్పాడు. నాగయ్య తనంతట తనే వచ్చి హత్య చెయ్యడంలో మొదటి ముద్దాయికి తను తోడ్పడినట్లు ఒప్పుకుంటూ స్టేట్‌మెంటు ఇచ్చాడనీ చెప్పాడు.

లాయర్ వజ్రాలరావు చటుక్కున లేచి నిలుచున్నాడు. "యువర్ ఆనర్. పోలీసు ఉద్యోగుల బలవంతం మీద ఆ స్టేట్ మెంటు ఇచ్చాననీ, తను నిర్దోషిననీ, ఆ స్టేట్‌మెంటులో చెప్పిన విషయాలు నిజం కావనీ రెండవ ముద్దాయి కోర్టువారికి ఇదివరకే విన్నవించుకున్నాడు. రెండవ ముద్దాయి అరెస్టు చేయబడిన తర్వాత జైలులో ఉండగా మరొక స్టేటుమెంటుతో బాటు ఫైలు చేసుకోవలసిందని కోరుతున్నాను" అని స్వరాజ్యరావుని క్రాసు పరీక్ష చేయడానికి ఉపక్రమించాడు.

"రెండవ ముద్దాయి ఇల్లు మీరు సోదా చేశారా?"

"చేశాను."

"ఆ ఇంట్లో మీకు .48 కాలిబర్ వెబ్‌స్టర్ పిస్తోలు దొరికిందా?"

"లేదు."

".48 కాలిబర్ వెబ్‌స్టర్ పిస్తోలు మీకు ఎక్కడైనా దొరికిందా?"

"లేదు."

"హత్యాప్రదేశంలో రెండవ ముద్దాయి అడుగుజాడలు కనిపించాయని చెప్పారు. అని ఎట్లా ఉన్నదీ కూడా చెప్పారు. మీరు చెప్పినదాన్నిబట్టి రెండో ముద్దాయి ఆ తోటలోంచి బయిటికి పరిగెత్తాడని అనుకోవచ్చా?"

"ఆ!"

"అంతే" అని వజ్రాలరావు కూర్చున్నాడు.

డిటెక్టివ్ యుగంధర్ లేచి నిలుచున్నాడు. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుని చూసి చిన్నగా నవ్వాడు.

"హత్యాప్రదేశంలో మీకు ఖాళీ నెక్లెసు పెట్టె ఒకటి కనిపించింది. నిజమేనా?" అడిగాడు.

"నిజమే!"

"హత్యాప్రదేశంలో మీకు కనిపించిన ఆ ఖాళీ నెక్లెస్ పెట్టెకీ, హత్యకీ ఉన్న సంబంధం ఎందువల్ల మీరు చెప్పలేదు?"

"హత్యకీ, నెక్లెసు దొంగతనానికి ప్రత్యక్ష సంబంధం లేదు."

"అంటే?"

"దొంగలు ఇంట్లో జొరబడ్డారన్న అపోహ కలిగించడానికి మొదటి ముద్దాయి మంగళ ఆ పెట్టెని అక్కడ పడేసి ఉంటుంది."

"మొదటి ముద్దాయి ఇల్లు మీరు సోదా చేశారా?"

"చేశాను."

"మీకు నెక్లెసు కనిపించిందా?"

"లేదు."

".48 వెబ్‌స్టర్ పిస్తోలు కనిపించిందా?"

"లేదు."

యుగంధర్ చటుక్కున వెనక్కి తిరిగి తన స్థానంలోకి వెళ్ళిపోయాడు.

ప్రాసిక్యూటర్ లేచాడు.

"యువర్ ఆనర్. ప్రాసిక్యూషన్ సాక్ష్యం ఇంతటితో ముగిసింది. ప్రాసిక్యూషన్ అభియోగాన్ని గురించి ఇదివరకు విపులంగా చెప్పాను కనుక, డిఫెన్సు క్రాసు పరీక్షలో కలిగించామనుకున్న సందేహాలకి జవాబు మాత్రమే ఇప్పుడు చెబుతాను. హతుడు నిలుచుండగా పిస్తోలుతో కాల్చబడలేదనీ, పడుకునుండగా కాల్చబడ్డాడనీ, మొదటి ముద్దాయి తరపు డిఫెన్సు నిరూపించడానికి ప్రయత్నించింది. హతుడు పిస్తోలుతో కాల్చబడినట్లు అంగీకరించినపుడు, ఏ రీతిగా ఉన్నప్పుడు కాల్చబడ్డాడనేది ముద్దాయి నిర్దోషిత్వాన్ని ఎలా రుజువు చేశాం. హతుడు తనంతట తానే మొదటి ముద్దాయి ఇంటి తోటలోకి నడిచి వెళ్ళాడని అతని అడుగుజాడల దృష్ట్యా రుజువయింది. ముద్దాయి మంగళ తన మొదటి వివాహం రద్దుచేసుకోకుండానే మళ్ళీ పెళ్ళి చేసుకున్నది. మొదటి భర్త తిరిగి వచ్చాడు. అతను సన్యాసి. అతను తిరిగి రావటం వల్ల మొదటి ముద్దాయికి చాలా చిక్కులు కలిగాయి. స్త్రీ ధనంగా తను నెక్లెసు అడిగే హక్కు పోయింది. రామారావు దొంగతనానికి నేరం మోపవచ్చు. ఆ సన్యాసిని చంపడానికి మరెవరికీ కారణంలేదు. హత్యకి ఉపయోగించబడ్డ రెండవ పిస్తోలు ప్రాసిక్యూషన్ సంపాదించలేకపోవడం ప్రాసిక్యూషన్ కేసులో పెద్ద లోపంగా డిఫెన్సు చూపించింది.

"యువరానర్ హత్యాయుధం దొరకడం చాలా కష్టం. ముందుగా యోచించి హత్య చేసినపుడు మరీ కష్టం. మొదటి ముద్దాయికి తోడ్పడి రామారావు ఇంట్లో నుంచి వజ్రాల నెక్లెసు దొంగలించాడని ప్రాసిక్యూషన్ రుజువు చేసింది. మొదటి ముద్దాయి, రెండవ ముద్దాయి చాలా సన్నిహితులు. డబ్బుకోసమూ, స్త్రీ వ్యామోహంవల్లా రెండవ ముద్దాయి మొదటి ముద్దాయికి హత్యానేరంలో సహాయపడి ఉంటాడు.

"హత్యాయుధం మీద అతని వేలి ముద్రలు ఉండడం వల్లా, హత్యాప్రదేశంలో కనపడ్డ అతని అడుగుజాడలవల్లా రెండవ ముద్దాయి ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసరు ఎదుట నేరం ఒప్పుకుంటూ ఇచ్చిన మొదటి వాంగ్మూలం యదార్థమని రుజువయింది. రాత్రి పదకొండు గంటలకి మొదటి ముద్దాయి చెల్లెలు తనని వెంటనే రమ్మని తన ఇంటికి వచ్చి పిలిచిందనీ, తను ఆమెతో వెళ్ళాననీ, మొదటి ముద్దాయి ఇంటి ఆవరణలోకి వెళ్ళగానే, నైట్ క్వీన్ పొద దగ్గిర పిస్తోలు పేలడం వినపడడమూ, ఎవరో తన చేతిలో ఒక పిస్తోలు పెట్టి పరిగెత్తడమూ క్షణంలో జరిగాయనీ, తను భయపడి పిస్తోలు కింద పారేసి పరిగెత్తాననీ రెండవ ముద్దాయి చెప్పిన కథ నమ్మతగినది కాదు. .32 కాలిబర్ పిస్తోలు చర్మం మీద పేల్చబడింది. కనుక అది హత్యకి ఉపయోగించిన పిస్తోలు కాదన్ మై లెర్నెడ్ ఫ్రెండ్ వాదం హాస్యాస్పదంగా ఉంది. హతుడు స్పృహ లేకుండా ఉన్నట్లయితే ముందు చర్మం మీదా తర్వాత చొక్కాపైనా పిస్తోలు పేల్చడానికి అవకాశం ఉంటుంది. అంతేకాదు. ఇద్దరూ ఒకేసారి చెరో పిస్తోలుతో కాల్చితే ఎవరు పేల్చిన గుండు చావుకి కారణం అయినా రెండోమనిషి కూడా హత్యానేరం చేసినట్లు భావించాలి.

"యువర్ ఆనర్. ప్రాసిక్యూషన్ అభియోగాన్ని రుజువు చేసేందుకు కావలసిన సాక్ష్యం చూపించాం. కనుక ఇద్దరు ముద్దాయిలని సెషన్స్‌కి కమిట్ చేయమని ప్రాసిక్యూషన్ కోర్టువారిని కోరుతోంది" అని ప్రాసిక్యూషన్ సమీక్ష ముగించాడు.

వజ్రాలరావు యుగంధర్ దగ్గరికి వెళ్ళి ఏదో అడిగాడు. యుగంధర్ తలతిప్పాడు. వజ్రాలరావు నిలుచున్నాడు. యుగంధర్ ప్రేక్షకులు కూర్చున్న బెంచివైపు చూశాడు. రాజు ఇంకా అక్కడే కూర్చున్నాడు.

వజ్రలరావు డిఫెన్స్ తరపున వాదన మొదలు పెట్టాడు.

"యువర్ ఆనర్. రెండవ ముద్దాయి నాగయ్య మీద అభియోగం నిరాధారమైనదనీ, రెండవ ముద్దాయిని డిశ్చార్జ్ చెయ్యమనీ విన్నవించుకుంటున్నాను. రెండవ ముద్దాయి మీద హత్యానేరం మోపుతూ ప్రాసిక్యూషన్ చూపిన సాక్ష్యమేమిటి? .32 కాలిబర్ పిస్తోలుమీద అతని వేలిముద్రలున్నాయి అన్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధం అదేనా? కాదు. హేతువాదంతో ఆలోచిస్తే ఆ విషయం తేలుతుంది. హతుడు హత్య చేయబడే సమయంలో స్పృహ లేకుండా ఉన్నాడనీ, కనుక ముందర చర్మం మీద .32 కాలిబర్ పిస్తోలు పేల్చి తర్వాత చొక్కాపైన .48 వెబ్‌స్టర్‌తో పేల్చబడ్డాడనీ ప్రాసిక్యూషన్ వాదించింది.

"యువర్ ఆనర్. ప్రాసిక్యూషన్ ఒక విషయం ఆలోచించనే లేదు. .48 వెబ్‌స్టర్ పిస్తోలు ఎవరికీ కనిపించకుండా రెండో ముద్దాయి దాచివుంటే అదే విధంగా .32 కాలిబర్ పిస్తోలు కూడా ఎందుకు దాచలేదు? పోలీసు ఉద్యోగులకి సులభంగా దొరికేలా శవం పక్కన తన వేలిముద్రలున్న పిస్తోలు ఎందుకు పడేస్తాడు? నా క్లయింటుకి జీవితం మీద విరక్తి కలగలేదే మొదటి ముద్దాయి తన చెల్లెల్ని పంపి తనని హత్యాప్రదేశానికి పిలిపించిందనీ, అక్కడ అకస్మాత్తుగా .32 కాలిబర్ పిస్తోలు ఎవరో తన చేతిలో పెట్టారనీ, తను అదిరిపోయి దానిని కింద పడేసి పారిపోయాననీ రెండవ ముద్దాయి చెప్పిన విషయం నమ్మదగిందిగా లేదా!

హత్యా ప్రదేశానికి పిలిపించిందనీ, అక్కడ అకస్మాత్తుగ .32 కాలిబర్ పిస్తోలు ఎవరో తన చేతిలో పెట్టారనీ, తను అదిరిపోయి దానిని కింద పడేసి పారిపోయాననీ రెండవ ముద్దాయి చెప్పిన విషయం నమ్మదగిందిగా లేదా?

"యువర్ ఆనర్ రెండవ ముద్దాయి నిర్దోషి అని రుజువు చేసేందుకు హేతువాదంతో నిరూపించగల అంశాలు ఇంకా చాలా ఉన్నాయి. కానీ అవన్నీ ఇప్పుడు వివరించను.

"యువర్ ఆనర్ రెండవ ముద్దాయి అబద్ధం చెబుతున్నదీ నిజం చెబుతున్నదీ ఆమె సాక్ష్యంతో తేలిపోతుందే ప్రాసిక్యూషన్ ఎందువల్ల ఆమెని కోర్టులో హాజరు పెట్టలేదు?" అని గర్వంగా వజ్రాలరావు యుగంధర్ని చూశాడు.

మేజిస్ట్రేటు ప్రాసిక్యూటర్ స్వరాజ్యరావుతో రహస్యంగా మాట్లాడి "యువర్ ఆనర్. ఆమెకోసం పోలీసు అధికారులు వెతుకుతున్నారు. ఇంతవరకూ ఎక్కడా కనిపించలేదు" అన్నాడు.

ప్రాసిక్యూటర్ స్వరాజ్యరావుతో రహస్యంగా మాట్లాడి "యువర్ ఆనర్ ఆమెకోసం పోలీసు అధికారులు వెతుకుతున్నారు. ఇంతవరకూ ఎక్కడా కనిపించలేదు" అన్నాడు.

మేజిస్ట్రేటు కళ్ళద్దాలు తీసి తుడుచుకుని, చిన్నగా దగ్గి "ఆ సాక్షిని వెదికి పట్టుకోలేరా?" అడిగాడు ప్రాసిక్యూటర్ని.

"యువర్ ఆనర్ మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాము."

వజ్రాలరావు మేజిస్ట్రేటు వైపు చూశాడు. "యువర్ ఆనర్ ఆ సాక్షి కోర్టుకి తేబడేంతవరకూ గాని, ఆ సాక్షి రాద'ని అన్నాడు.

మేజిస్ట్రేటు ప్రాసిక్యూటర్ వైపూ, యుగంధర్ వైపూ చూసి "మీకు అభ్యంతరమా?" అడిగాడు.

"లేదు" అన్నాడు యుగంధర్.

ప్రాసిక్యూటర్ ఒక నిమిషం సందేహించి, స్వరాజ్యరావుతో మాట్లాడి "యువర్ ఆనర్ డిఫెన్స్ సాక్షులని కోర్టుకి తీసుకురావడం ప్రాసిక్యూషన్ బాధ్యత కాదు. విచారణ సాగించమని కోరుతున్నాను"అన్నాడు.

"అవును. మై లెర్నెడ్ ఫ్రెండ్ ప్రాసిక్యూటర్ చెప్పింది నేను ఒప్పుకుంటున్నాను. డిఫెన్సుకి సుముఖంగా ఉండే సాక్షులని కోర్టుకి రప్పించడం చాలా కష్టం. అంతేకాక, రెండవ ముద్దాయి ఇచ్చిన వాగ్మూలం యొక్క నిజానిజాలు తెలుసుకునేందుకు ఆ సాక్షిని పోలీసు

ఉద్యోగులు దర్యాప్తు దశలోనే ప్రశ్నించవలసింది. అదీ చెయ్యలేదు. ఒక ముఖ్యమైన సాక్షి పోలీసులకే కనిపించకపోతే మాకు ఎలా కనిపిస్తుంది? అయినా ఎందుకు కనిపించలేదు. పరారి అయిందా? దాచబడిందా? లేక ఆమె సాక్ష్యం వల్ల దోషి ఎవరో రుజువు అవుతుంది కనుక ఆమె కూడా హత్యచేయబడిందా?" అని వజ్రాలరావు అంటుండగా కోర్టు గడియారం అయిదు గంటలు కొట్టింది.

"రేపటికి వాయిదా వేస్తున్నాను. ఆలోగా సరళని ప్రాసిక్యూషన్ వెతికి కోర్టులో హాజరు పెడుతుందని ఆశిస్తాను" అని మేజిస్ట్రేటు లేచాడు.

వజ్రాలరావు నవ్వుతూ యుగంధర్ దగ్గరికి వచ్చాడు. "ఎలా ఉంది నా డిఫెన్స్?" అడిగాడు.

"మీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి" అన్నాడు యుగంధర్.

వజ్రాలరావు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. స్వరాజ్యరావు యుగంధర్ దగ్గరికి వచ్చి, "వజ్రాలరావు చాలా పెద్ద ఎత్తేవేశాడు. దోషం అంతా మీ క్లయింటు మీదికి నెట్టేశాడు. సరళని కోర్టుకి తీసుకురాకపోతే అతని క్లయింటు విడుదలయినట్లే" అన్నాడు.

"అవును."

"ఆమెని మీ సాక్షిగా ఎందుకు పిలిపించరు?" అడిగాడు స్వరాజ్యరావు.

యుగంధర్ స్వరాజ్యరావుని చాలా కోపంగా చూశాడు. "సాక్షులని దాచి, నిజాన్ని కప్పిపుచ్చి నేను కేసు గెలవడానికి ప్రయత్నిస్తాననుకున్నారా ఇన్‌స్పెక్టర్. నా క్లయింటు దోషి అయితే శిక్ష అనుభవిస్తుంది. నాకు కావలసింది న్యాయం జరగడం," అన్నాడు.

"సారీ యుగంధర్ క్షమించండి. మీకు సరళ జాడలు తెలియవన్నమాట" అన్నాడు స్వరాజ్యరావు.

"అవును. తెలియవు. సరళని పట్టుకునేందుకు నేను ప్రయత్నం చేస్తున్నాను. ఆమెని నేను ఈ రాత్రి పట్టుకోలేకపోతే రేపు పొద్దున ఆమె శవం మనకి దొరుకుతుంది" అంటూ యుగంధర్ చరచరా నడిచి కారు దగ్గరికి వెళ్ళాడు. వెళుతూ చుట్టూ చూశాడు. రాజు ఆ దరిదాపుల్లో లేడు.

●●●

రాజు టీ కొట్టు బయటవున్న బెంచీమీద కూర్చుని సిగరెట్ వెలిగించాడు. చేతిగడియారం చూసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటలవుతోంది. ఒకసారి చేతులు జాపి ఒళ్ళు విరుచుకున్నాడు. క్రితం రాత్రి యుగంధర్ తనూ విడిపోయినప్పటినుంచీ రాజు డ్యూటీమీదే ఉన్నాడు. రాత్రంతా ఆ ఇంటిముందు కాపలా కాచాడు తెల్లారిన తర్వాత కూడా అక్కణ్ణించి కదలలేదు. నిద్రపోలేదు. విశ్రాంతి కూడా తీసుకోలేదు.

క్రితం రాత్రి యుగంధరూ, రాజూ కలిసి ఏ ఇంట్లోకి జొరబడ్డారో ఆ ఇంటిముందే రాజు ఇప్పుడు కాపలా కాస్తున్నాడు. ఆ రోజు పొద్దున్న ఆ ఇంట్లోంచి వచ్చిన మనిషిని వెంటాడాడు. ఆ మనిషి పదిగంటలకల్లా బయలుదేరి మేజిస్ట్రేటు కోర్టుకి వెళితే వెనకే తనూ వెళ్ళాడు. ఆ మనిషి కోర్టులో ఉన్నంత సేపూ తనూ ఉన్నాడు. ఆ మనిషి కోర్టులోంచి బయలుదేరగానే తనూ అతని వెనకే బయలుదేరాడు. ఆ మనిషికి తెలియకుండా అతన్ని వెంటాడాడు. అతని ఇంటికి కాస్త దూరంలో ఉన్న టీ కొట్టు దగ్గిర బెంచీ మీద కూర్చున్నాడు ఇప్పుడు. ఆ క్షణాన రాజుని చూసి ఎవరూ గుర్తుపట్టలేరు. మాసిన గెడ్డం, నల్లని బట్టలు, చెదిరిన జుట్టు, జిడ్డిమొహం.

రాజు బెంచీమీదనుంచి లేచాడు. అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాడు. ఆ ఇంటి ప్రహరీగోడ ప్రక్కగా నడిచాడు. ఒకసారి వీధి రెండువేపులా చూశాడు. తననెవరూ చూడటం లేదని నిశ్చయం చేసుకుని ఒక్క ఉరుకు ఉరికి గోడదాటాడు. తోటలో బాగా చీకటిగా ఉంది.

రాజు చెట్ల వెనక నుంచి ఇంటిదగ్గరికి వెళ్ళాడు. మేడమీద గదిలో మాత్రం దీపం వెలుగుతోంది. పైకి చూశాడు. తను వెంటాడుతున్న మనిషి ఆ గదిలో తల దువ్వుకుంటున్నాడు. బయిటికి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడని రాజు తెలుసుకుని, ఓపిగ్గా

కాచుకున్నాడు. ఆ మనిషి మేడమీదనుంచి దిగివచ్చి, మోటారు షెడ్ వైపు వెళ్ళాడు. మోటారు షెడ్ గోడపక్కన నక్కి దాక్కున్నాడు. షెడ్ వైపు వెళ్ళాడు. మోటారు షెడ్ గోడపక్కన నక్కి దాక్కున్నాడు. షెడ్ తలుపులు తెరవడం, కారు తలుపులు తెరవడం వినిపించింది. ధైర్యం చేసి రాజు తలుపుకీ, గోడకీ మధ్య ఉన్న సందులోంచి చూశాడు. రేడియేటర్‌లోకి ఆ మనిషి చూడడం కనిపించింది. బానెట్ తెరిచి ఉంది. ఆ మనిషి రావడం చూసి రాజు చటుక్కున నీడలోకి పోయాడు.

ఆ మనిషి షెడ్ పక్కగా నడుస్తూ ఇంటి వెనక్కి వెళుతుండడం చూసి రాజు చాలా ధైర్యం చేశాడు. చటుక్కున షెడ్‌లోకి వెళ్ళి డిక్కీ తెరిచి, డిక్కీలో దూరి, తలుపు మూసివేశాడు. ఎందుకయినా మంచిదని జేబులోంచి రివాల్వర్ తీసి చేతిలో పట్టుకున్నాడు. రేడియేటర్లో నీళ్ళు తగ్గడం వల్ల ఆ మనిషి నీళ్ళు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్ళి ఉండాలని రాజుకి తెలుసు. రెండు నిమిషాల తర్వాత బూట్సు చప్పుడు, తర్వాత రేడియేటర్లో నీళ్ళు పోస్తున్న చప్పుడు వినిపించాయి. బేనెట్ మూసిన చప్పుడు, తలుపు తెరిచిన చప్పుడు, కారు స్టార్టు అయిన చప్పుడు - రాజు విన్నాడు.

కారు గేటుదాటి వీధిలో ప్రవేశించింది. తిన్నగా హైరోడ్ మీద ఒక మైలుదూరం వెళ్ళి, అక్కణ్ణించి ఎన్నో మలుపులు తిరిగింది. ఎక్కడికి వెళుతున్నదీ జ్ఞాపకం ఉంచుకునేందుకు రాజు కారు ఎటు వెళుతున్నదీ గమనిస్తున్నాడు. వెళ్ళిన రోడ్‌లోనే మళ్ళీ వెళుతున్నట్లు రాజు గ్రహించాడు. గడియారం చూసుకున్నాడు. కారు బయలుదేరి ముప్పావు గంట అయింది. ముప్పావుగంటలో మద్రాసులో ఒక చివర్నించి ఇంకో చివరికి వెళ్ళివుండవచ్చు. తొమ్మిదిగంటలయింది. కారు ఆగింది. కానీ కారులోంచి ఆ మనిషి దిగినట్లు చప్పుడు వినిపించలేదు. డిక్కీలోకి కూడా చల్లని గాలి వస్తోంది. అగ్గిపుల్ల గీసిన చప్పుడు, కాళ్ళు కదల్చిన చప్పుడు రాజుకి వినిపించాయి. ఆ మనిషి కారులోనే కూర్చునుండాలి. ఊపిరి పీల్చడానికి కూడా రాజుకి భయంగా ఉంది.

చల్లనిగాలి వీస్తూ ఉండడం బట్టి కారు మెరీనా మీద ఎక్కడో ఆగి ఉండాలని నిశ్చయించుకున్నాడు రాజు. గంట సేపు అక్కడే ఉండి తర్వాత కారు బయలుదేరింది. మలుపు తిరిగిన తర్వాత స్పీడు ఎక్కువైంది మళ్ళీ తిరిగిన వీధులే తిరుగుతోంది. తనని ఎవరూ వెంటాడకుండా ఆ మనిషి జాగ్రత్తపడుతున్నట్లు రాజు గ్రహించాడు. నవ్వుకున్నాడు. మరొక అరగంట ప్రయాణం చేసిన తర్వాత కారు ఆగింది. ఆ మనిషి కారులోంచి దిగినట్లు తలుపు చప్పుడయింది. ఒక నిమిషం ఆగి, రాజు డిక్కీ తలుపు కొంచెం తెరిచి బయటికి చూశాడు. ఓ పార్కు ముందు కారు ఆగివుంది. తను వెంటాడుతున్న మనిషి పార్కులోకి వెళ్ళడం చూశాడు రాజు. చటుక్కున డిక్కీలోంచి బయిటికి వచ్చి తనూ పార్కులోకి వెళ్ళాడు ఆ మనిషి పార్కు వెనుక గేటులోంచి వీధిలోకి వెళ్ళి యాభై గజాలు నడిచి ఓ ఇంటిముందు ఆగడం, తాళం తీసి లోపలికి వెళ్ళడం రాజు చూశాడు.

ఊరికి దూరంగా ఉన్న క్రోంపేట అది. ఇళ్ళు కూడా దూరదూరంగా ఉన్నాయి. ఆ ఇంటికి కాంపౌండు గోడలేదు కానీ, ఫెన్సింగు ఉంది. అందులోంచి దూరి రాజు గుమ్మం వైపు వెళ్ళాడు. తలుపు లోపల గడియవేసి ఉంది. నవ్వుకుంటూ జేబులోంచి తీగతీసి, తలుపు గొళ్ళెం తీగెతో బిగించాడు. తరువాత ఇంటి ముందువైపుకి వెళ్ళాడు. వాకిలి తలుపు లోపల గడియపెట్టి ఉంది. దానికి బయట గొళ్ళెం పెట్టి, తీగె చుట్టాడు. మళ్ళీ ఇంటి వెనకకి వెళ్ళి మురికినీళ్ళు పోయే గొట్టం దగ్గిర ఆగాడు. ఆ గొట్టాన్ని పట్టుకుని నెమ్మదిగా పైకి పాకాడు రాజు. ఎవరూ లేరని నిశ్చయించుకుని డాబా మీదికి వెళ్ళాడు.

"నన్నేం చేయదలచావ్?" ఒక స్త్రీ కంఠం.

"నిన్ను ఒదిలేస్తాను" అన్నది ఒక పురుష కంఠస్వరం.

"నిజంగానా?"

"అవును. నీకొక గ్లాసులో మందుపోసి ఇస్తాను. అది తాగు, స్పృహ పోతుంది. నిన్ను తీసుకు వెళ్ళి మీ ఇంటి ప్రాంతాలలో వదిలేస్తాను. నీకు తెలివి వచ్చేటప్పటికి తెల్లారుతుంది. అప్పటికి నేను ఎవరికీ కనిపించకుండా పారిపోతాను."

"నువ్వు ఇచ్చే మందులో విషం కలిపి ఇస్తావేమో?"

"నిన్ను చంపాలనే ఉద్దేశం ఉంటే అంత కష్టం ఎందుకు? ఇప్పుడు గొంతు నులిమి చంపితే ఏం చెయ్యగలవు?"

రాజు ఈ సంభాషణంతా విన్నాడు. డాబామీద బోర్లా పడుకుని నెమ్మదిగా పాకుతూ, వాళ్ళున్న గదివైపు వెళ్ళాడు. చీకట్లో ఒక సీసా చేతికి తగిలి దొర్లి చప్పుడయింది. మరుక్షణం వసారాలో దీపం వెలిగింది.

"కదలక కదిలితే ప్రాణం దక్కదు."

రాజు కళ్ళెదుట పిస్తోలు ఉన్నది. అలా చిక్కిపోయినందుకు రాజు తనని తను తిట్టుకున్నాడు. పడుకునే రెండు చేతులూ పైకి ఎత్తాడు. ఆ మనిషి దగ్గరికి రావడం చూశాడు. ఉన్నట్లుండి తలమీద గొడ్డలితో కొట్టినట్లయింది. ఒక మూలుగు మూలిగి రాజు కళ్ళు మూశాడు. స్పృహలేదు.

మళ్ళీ స్పృహ వచ్చేసరికి తలమీద రోకళ్ళతో కొడుతున్నట్లు బాధగా ఉంది. రెండు చేతులూ కుర్చీ వెనక్కి విరిచి కట్టబడ్డాయి. అంతా చీకటిమయంగా ఉంది. ఆ చీకట్లో కళ్ళు చీల్చుకుని చూశాడు రాజు. తన పక్కన ఎవరో ఊపిరి పీలుస్తుండడం వినిపించింది.

"సరళా!" అన్నాడు రాజు.

"అవును"

"అతనేడి?"

"కిందికి వెళ్ళాడు. బహుశా నాకు మందు కలిపి తీసుకు వస్తున్నాడేమో!"

"గుడ్!" అంటూ రాజు కుర్చీతో సహా సరళ కూర్చున్న చోటికి జరిగి ఆమె చేతులకి కట్టివేసి ఉన్న ముడులు అతికష్టమ్మీద ఊడదీశాడు. "త్వరగా నా కట్లు విప్పు" అన్నాడు. క్షణంలో అతని చేతుల తాళ్ళు విడిపోయాయి. "అలగే కుర్చీలో కూర్చో" అని రాజు జేబులో వెతుక్కున్నాడు. పిస్తోలు లేదు. అంతలో మెట్లమీద చప్పుడు అయింది.

"దీపం స్విచ్ ఎక్కడున్నది? " అడిగాడు రాజు.

"తలుపు వెనక" అన్నది సరళ.

రాజు ఒక్క గంతున తలుపు వెనక్కి వెళ్ళి నిలుచున్నాడు. మెట్లమీద అడుగుల చప్పుడు దగ్గరగా వినపడ్డది. అతను గదిలోకి వచ్చి తలుపు వెనుక ఉన్న స్విచ్ మీద చెయ్యి వేశాడు. రాజు వెనకనుంచి వచ్చి పిస్తోలున్న అతని చేతిని ఒక చేత్తో పట్టుకుని, మెలిపెడుతూ రెండో చేత్తో గట్టిగా గడ్డం మీద కొట్టాడు. అతని చేతిలోంచి పిస్తోలు కిందపడి ఖంగుమన్నది. అతను కిందపడ్డాడు. రాజు అతని మీదకి ఉరికాడు. రాజుని డొక్కలో ఒక తన్ను తన్ని లేచి పరిగెత్తాడు అతను. రాజు కూడా లేచి పరిగెత్తాడు అతను. కానీ రాజు డాబామీదికి వెళ్ళేసరికి అతను మురుగు నీటి గొట్టం పట్టుకుని కిందికి దిగిపోతున్నాడు.

రాజు అతని వెంట దిగదలచుకోలేదు. అతనివద్ద ఇంకో పిస్తోలు ఉండవచ్చు. తను దిగుతుండగా కాలిస్తే వెనక్కి తిరిగాడు. గదిలో దీపం జిగేలు మని వెలుగుతోంది.

"చేతులెత్తు. లేకపోతే కాల్చేస్తాను" అని బెదరించడం వినపడింది రాజుకి. ఉలిక్కిపడి రాజు చేతులెత్తాడు. సరళ చేతిలో పిస్తోలు పట్టుకుని తలుపు దగ్గిర నిలుచున్నది. రాజు తల తిరిగినట్లయింది. గడ్డం మీద కొట్టాడు. అతని చేతిలోంచి పిస్తోలు కిందపడి ఖంగుమన్నది. అతను కిందపడ్డాడు. రాజు అతనిమీదికి ఉరికాడు. రాజుని డొక్కలో ఒక తన్ను తన్ని లేచి పరిగెత్తాడు అతను. రాజు కూడా లేచి పరిగెత్తాడు. కానీ రాజు డాబామీదికి వెళ్ళేసరికి అతను మురుగునీటి గొట్టం పట్టుకుని కిందికి దిగిపోతున్నాడు.

రాజు అతని వెంట దిగదలచుకోలేదు. అతనివద్ద ఇంకో పిస్తోలు ఉండవచ్చు. తను దిగుతుండగా కాలిస్తే? వెనక్కి తిరిగాడు. గదిలో దీపం జిగేలుమని వెలుగుతోంది.

"చేతులెత్తు. లేకపోతే కాల్చేస్తాను" అని బెదరించడం వినపడింది రాజుకి. ఉలిక్కిపడి రాజు చేతులెత్తాడు. సరళ చేతిలో పిస్తోలు పట్టుకుని తలుపు దగ్గిర నిలుచున్నది. రాజు తల తిరిగినట్లయింది. సరళ తనని బెదిరితోంది. ఇదేమిటి యుగంధర్ ఆలోచించి హేతువాదంతో చేసిన నిర్ణయాలన్నీ తప్పా తప్పు కావడానికి వీలులేదే సరళకీ, హంతకుడికీ సంబంధం ఏమిటి?

సరళ పిస్తోలు గురిపెట్టి ముందుకు వచ్చింది. చీకట్లో డాబా పిట్టగోడ దగ్గిర నిలుచున్న రాజుని చూసి "మీరా?" అని పిస్తోలు కిందకి దింపింది.

రాజు నవ్వి "అదిరిపోయాను" అని "మీకా పిస్తోలు ఎక్కడిది?" అడిగాడు.

"ఇది మీ పిస్తోలు. మిమ్మల్ని తలమీద కొట్టాక, పిస్తోలు తెచ్చి కిటికీలో పెట్టాడతను. మీరిద్దరూ కలియబడగానే, నేను కిటికీ దగ్గరికి వెళ్ళి పిస్తోలు తీసుకున్నాను" అంటూ సరళ పిస్తోలు రాజుకి అందించింది. రాజు దాన్ని తీసుకుని గదిలోకి వెళ్ళాడు. గదిలో ఇంకో పిస్తోలు నేలమీద పడివుంది. జేబులోంచి రుమాలు తీసి ఆ పిస్తోలుని రుమాలులో చుట్టుకున్నాడు.

"నేను కిందకి దిగి వెళుతున్నాను. తలుపు బయట గొళ్ళానికి చుట్టిన తీగె విప్పి వెళ్ళిపోతాను. మీరు తిన్నగా వెళ్ళి యుగంధర్ గారిని కలుసుకోండి. రుమాలులో చుట్టిన ఈ పిస్తోలు వారి కివ్వండి. జరిగినదంతా చెప్పండి" అని పిట్టగోడ అవతలకి దిగాడు రాజు.

## 14

మర్నాడు విచారణ ప్రారంభం కాబోతున్నదనగా ఒక నిమిషం ముందు యుగంధర్ కోర్టు ఆవరణలో కారు ఆపాడు. మేజిస్ట్రేటు కోర్టులోకి రావడం, యుగంధర్ రావడం ఒకేసారి జరిగాయి. యుగంధర్ వెంట వచ్చిన సరళని చూసి నాగయ్యా, మంగళా ఆశ్చర్యపోయారు. నాగయ్య వజ్రాలరావుని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. వజ్రాలరావు ముఖంలో నెత్తురు చుక్కలేదు. వజ్రాలరవు తేరుకుని నాగయ్య చెవిలో ఏదో చెప్పాడు. మేజిస్ట్రేటు తన స్థానంలో కూర్చున్నాడు.

ఉన్నట్లుండి కోర్టులో సంచలనం బయలుదేరింది. నిలబడి ఉన్న నాగయ్య చెట్టు విరిగినట్లు అమాంతం కుప్పగా కూలిపోయాడు. చేతులూ, కాళ్ళూ తన్నుకోవడం ప్రారంభించాడు.

స్వరాజ్యరావూ, ప్రాసిక్యూటరూ, వజ్రాలరావూ చుట్టూ చేరారు. యుగంధర్ లేచి వెళ్ళి నాగయ్య చెయ్యి తీసి నాడి చూశాడు. తనలో తను నవ్వుకున్నాడు.

నాగయ్య కాళ్ళూ చేతులూ తన్నుకోవడం మానేసి స్పృహలేకుండా పడివున్నాడు.

"ఏమిటి జరిగింది?" అడిగాడు మేజిస్ట్రేటు.

"నా క్లయింటు మూర్ఛ వచ్చి పడిపోయాడు. యువర్ ఆనర్ వెంటనే వైద్యం చేయించాలి. జైలుకి పంపివేయమని వేడుకుంటున్నాను. నా క్లయింటు ఆరోగ్యం బాగుపడేవరకూ విచారణ వాయిదా వేయాలని కోరుతున్నాను" అన్నాడు వజ్రాలరావు.

●●●

**యుగంధర్ చటుక్కున మేజిస్ట్రేటు వైపు** తిరిగి "యువర్ ఆనర్. రెండవ ముద్దాయి ఆరోగ్యం సరిగా లేకపోతే అతన్ని వెంటనే జైలుకి పంపి చికిత్స చేయించడం అవసరమే. కానీ విచారణ వాయిదా వేయనవసరం లేదు. మొదటి ముద్దాయి డిఫెన్సు విచారణ సాగించమని కోరుతున్నాను. రెండవ ముద్దాయి తరపున డిఫెన్సు తర్వాత ప్రారంభించవచ్చు. తన క్లయింటుకి ఎటువంటి అపచారం జరక్కుండా మైలర్నడ్ ఫ్రెండ్ వజ్రాలరావు కనిపెట్టి ఉండవచ్చు" అన్నాడు యుగంధర్.

"మీరు చెప్పింది సబబుగానే ఉంది" అని మేజిస్ట్రేటు నాగయ్యని జైలుకి తీసుకు వెళ్ళమని ఆజ్ఞ ఇచ్చి, యుగంధర్‌ని డిఫెన్సు ప్రారంభించమన్నాడు.

"యువర్ ఆనర్ డిఫెన్స్ తరపున నేను ప్రారంభోపన్యాసం ఇవ్వదలచుకోలేదు. మొదటి సాక్షిగా బాలిస్టిక్ ఎక్స్‌ఫర్ట్ అయిన మిస్టర్ భాష్యాన్ని పిలుస్తున్నాను" అన్నాడు యుగంధర్.

ప్రమాణ స్వీకారం అయిన తర్వాత యుగంధర్ ఒక పిస్తోలు తీసి సాక్షి చేతికిచ్చి "ఈ పిస్తోలుని మీరింతకు ముందు చూశారా?" అడిగాడు.

"చూశాను"

"ఎప్పుడు?"

"ఇవాళ ఉదయం"

"మీకు దాన్ని చూపించిందెవరు?"

"మీరే."

" ఆ పిస్తోలు పేరేంటి?"

".48 వెబ్‌స్టర్."

"దాన్ని పేల్చి చూశారా?"

"చూశాను."

"ఆ పేల్చిన గుండు ఏం చేశారు?"

"మీకే ఇచ్చాను."

యుగంధర్ ఓ పిస్తోలు గుండు తీసి "ఇదేనా?" అడిగాడు.

"అవును."

యుగంధర్ ప్రాసిక్యూషన్ ఎక్జిబిట్‌గా దాఖలు చేసిన .48 కాలిబర్ గుండుని అడిగి తీసుకుని సాక్షికిచ్చాడు. "ఈ రెండు గుళ్ళకీ పోలిక ఉందా?" అడిగాడు.

"ఆ! ఈ రెండూ ఒకే పిస్తోలు నుంచే పేల్చబడాయి."

యుగంధర్ మేజిస్ట్రేటు వైపు తిరిగి "ఈ పిస్తోలునీ, ఈ గుండునీ డిఫెన్సు తరపున ఎక్జిబిట్‌గా దాఖలు చేస్తున్నాను. ఈ పిస్తోలు మీద నెంబరు, రామారావు బీరువాలోంచి పోయిన పిస్తోలు నెంబరు ఒకటేనని కోర్టువారు గమనించగోరతాను" అన్నాడు యుగంధర్.

ప్రాసిక్యూటర్ క్రాస్ పరీక్ష చేయడానికి లేచాడు. స్వరాజ్యరావు యుగంధర్ పక్కకి వచ్చి "మీకీ పిస్తోలు ఎక్కడ దొరికింది?" అడిగాడు.

యుగంధర్ నవ్వి "నా పక్కన కూర్చున్న అమ్మాయి సరళ. ఇంకో, పదినిమిషాలలో ప్రాసిక్యూషన్ కేసుని పటాపంచలు చేస్తుంది. కాచుకోండి" అన్నాడు.

స్వరాజ్యరావు ఆదుర్దాగా "యుగంధర్ మీకూ, నాకూ వైరం ఎందుకు? మాకు నిజం చెప్పకూడదా?" అడిగాడు.

"ఎందుకు చెప్పకూడదు చెబుతాను. కానీ కేసు విచారణ సాగుతుండగా ఎలా చెబుతాను? వాయిదా అడిగి తీసుకోండి" అన్నాడు యుగంధర్.

స్వరాజ్యరావు ప్రాసిక్యూటర్ దగ్గరికి వెళ్ళి చెవిలో ఏదో చెప్పాడు. ప్రాసిక్యూటర్ తల తిప్పి "యువర్ ఆనర్ మొదటి ముద్దాయి డిఫెన్సు వారు ప్రవేశపెట్టిన కొత్త సాక్ష్యం వల్ల కేసు రుపు మారిపోయింది. వాయిదా కోరుతున్నాను" అన్నాడు.

మేజిస్ట్రేటు ఆనాటి మధ్యాహ్నానికి విచారణ వాయిదా వేశాడు.

యుగంధర్ కన్సల్టింగ్ రూములో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు, పోలీస్ కమీషనర్, ప్రాసిక్యూటరు కూర్చునున్నారు. ఓ పక్కగా సరళ కూర్చునుంది. యుగంధర్ తన రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్నాడు. యుగంధర్ సరళ వేపు తిరిగి "జరిగింది క్లుప్తంగా చెప్పు" అన్నాడు.

సరళ గొంతు సవరించుకుంది. "ఆ రోజు నెక్లెస్ బావకి ఇవ్వడానికి మీ దగ్గిర్నుంచి బయలుదేరాను. ఆళ్వారుపేట కార్నర్లో బావ వస్తూండగా చూసి చెయ్యి ఊపి, కారు ఆపి నా టాక్సీ పంపించేశాను. బావ కారెక్కాను. మాట్లాడాలనీ, ఇంటికి వెళ్దామనీ చెప్పాను. ఇంటికి వెళ్ళాక సహాయం చేసిన సంగతీ చెప్పి, క్షమించమంటూ నెక్లెసు ఇచ్చేశాను. నన్ను చాలా తిట్టాడు. తనని చాలా చిక్కుల్లో పెట్టానన్నాడు. అంతలో నౌఖరు వచ్చి ఎవరో సన్యాసి వచ్చాడనీ, అమ్మగారిని అడుగుతున్నాడనీ చెప్పాడు. బావ వసారాలోకి వెళ్ళి అయిదు నిమిషాలలో సన్యాసిని వెంట పెట్టుకుని వచ్చాడు "సరళా! మీ బావ వచ్చాడు" అన్నాడు నవ్వుతూ. జగన్మోహన్ని నేను గుర్తుపట్టాను. అక్కా బావా విడిపోయారని తెలిసిందనీ, అక్కయ్యని చూడాలనిపించి వచ్చాననీ చెప్పాడు. నాతో ఇంటికి రమ్మన్నాను. రామారావు మమ్మల్ని వెళ్ళనియ్యలేదు. మంగళతో తనకి మొదట పెళ్ళయిందని కోర్టులో సాక్ష్యం చెప్పమని సన్యాసిని అడిగాడు. ఆ విధంగా రాసి ఇవ్వమనీ, అవసరమైనపుడు కోర్టుకి రావాలనీ అన్నాడు. జగన్మోహన్ తనకి అక్కయ్య మీద ఏమీ కోపం లేదనీ, ఆమెకి మళ్ళీ అపచారం చెయ్యననీ, అటువంటి సాక్ష్యం చెప్పననీ అన్నాడు. 'అయితే నిన్నీ ఇంట్లో నుంచి బయటికి వెళ్ళనివ్వను' అన్నాడు బావ సన్యాసితో. 'వెళ్ళనివ్వక ఏం చేస్తావు? కోర్టులో నన్ను బోను ఎక్కిస్తే అసలు మంగళ ఎవరో నాకు తెలియదంటాను' అన్నాడు. జగన్మోహన్. ఇద్దరూ చాలాసేపు వాదించుకున్నారు. రామారావు గదిలోంచి బయటికి వెళ్ళి తలుపు బయట గడియ పెట్టాడు. కాసేపటికి జోగయ్య వచ్చాడు. ఇద్దరూ కలిసి నన్నూ, జగన్మోహన్నీ చేతులూ, కాళ్ళూ కట్టి లోపల గదిలో పడేశారు.

రాత్రి ఎప్పుడో మమ్మల్ని గదిలోంచి బయటికి తీసుకువచ్చారు. చేతులకి కట్లు అలాగే ఉంచి కళ్ళకి కట్టిన గంతలు మాత్రం విప్పారు. ఇద్దర్నీ కారెక్కించుకున్నారు. అక్కయ్య ఇంటిదగ్గర కారు ఆపారు. పిస్తోళ్ళు చేతుల్లో పట్టుకుని బెదిరిస్తూ, మమ్మల్ని కారు దిగి ముందుకి నడవమన్నారు. నైట్ క్వీన్ పొద చేరుకునేటప్పటికి రామారావు చేతిలో ఉన్న పిస్తోలు లోంచి పొగ వస్తోంది. జోగయ్య నన్ను కారు దగ్గరికి తీసుకువెళ్ళాడు. అయిదు నిమిషాల తర్వాత రామారావు వచ్చి నన్నూ, జోగయ్యనీ కారు ఎక్కించుకున్నాడు. జోగయ్యని తోవలో దింపేశాడు. నన్ను ఇంటికి తీసుకువెళ్ళి గదిలో పడేసి తలుపు గడియ పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఓ రాత్రివేళ తిరిగి వచ్చి, నన్ను మళ్ళీ కారు ఎక్కించుకుని క్రోం పేటలో ఒక ఇంటికి తీసుకెళ్ళి ఆ ఇంట్లో బంధించాడు. రోజూ నాకు తిండీ తిప్పలూ అమర్చి వెళుతుండేవాడు" అని ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చి క్రితం రాత్రి రాజు తనని విడిపించడం విశదంగా చెప్పింది.

"రాజేడి? రామారావు ఏమైనట్లు?" అడిగాడు కమీషనర్ యుగంధర్ని.

"రాజు రామారావుని వెంటాడుతూ ఉంటాడు. రామారావు తప్పించుకు పోయేందుకు ప్రయత్నిస్తూ ఉంటాడు. ఏ క్షణాన్నయినా రామారావు జాడ తెలుపుతూ రాజు టెలిఫోను చెయ్యవచ్చు" అని చెప్పాడు యుగంధర్.

"థాంక్స్ యుగంధర్ ఇంతకీ మీరు నిజం ఎలా కనుక్కున్నారు?" అడిగాడు కమీషనర్.

"మంగళ హంతకురాలు కాదని మొదటే నాకు తోచింది. కారణం సన్యాసి ఆమె ఇంటికి వచ్చినట్లు శవం తోటలో పడివుండడం తప్ప మరే నిదర్శనమూ లేకపోవడం. రెండో కారణం ఏమంటే పదకొండున్నరకి హత్య జరిగింది. పన్నెండున్నర వరకూ మంగళ ఊరుకుని, పన్నెండున్నరకి ఎందువల్ల నాకు ఫోను చేసింది? హత్య జరిగిన గంట తర్వాత ఆ విషయం నాకు తెలియజేయడం వల్ల ఆమెకి

లాభమేమిటి? హత్యకి రెండు పిస్తోళ్ళు ఉపయోగించడమూ, సరళని దాచెయ్యడమూ, ఖాళీ నెక్లెస్ పెట్టి హత్యా ప్రదేశంలో పడేయడమూ ఇవన్నీ ఎవరో తెలివిగా ఆలోచించి, కేసు అయోమయం చేయడానికి చేశారని ఊహించాను.

''మంగళ అంత తెలివయినది కాదు. జోగయ్య సహాయంతో మంగళ హత్య చేసివుంటే, వజ్రాలరావు జోగయ్య డిఫెన్స్‌తో పాటు మంగళ డిఫెన్సుకు కూడా పూనుకునేవాడు. ముందు జోగయ్య ఎందువల్ల నేరం ఒప్పుకున్నాడు? తర్వాత ఆ వాగ్మూలం అబద్దమని ఇంకో వాంగ్మూలం ఎందుకిచ్చాడు? ఈ విషయాలను బట్టి ఆలోచించగా దీనికంతా వెనక ఎవరో ఉండి ఈ నాటకం ఆడిస్తున్నారని తోచింది.

''జగన్మోహన్‌ని హత్య చేయడానికి ఎంత ఆలోచించినా జోగయ్యకి కారణం ఉన్నట్లు కనిపించలేదు. రామారావుకి కూడా కారణం లేదనుకున్నాను మొదట. తర్వాత ఊహించాను. మంగళ తనని వివాహం చేసుకోక పూర్వం ఆమెకి వివాహమైందని నిరూపిస్తే తనకి మంగళతో జరిగిన వివాహం చెల్లదు. అటువంటి పక్షంలో నెక్లెస్ మంగలకి ఇవ్వవలసిన అవసరం ఉండదు. రామారావు ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుసుకున్నాను. నెక్లెసు పోయిందని అతను పోలీసు కంప్లైంటు ఇచ్చి, ఇన్సూరెన్సు కంపెనీకి క్లెయిం పెట్టాడు. సరళ నెక్లెసు తెచ్చి ఇచ్చింది. కానీ ఆ సంగతి బయిటికి పొక్కకుండా చేస్తే రామారావుకి నెక్లెసు ఉంటుంది డబ్బూ వస్తుంది.

''మంగళకీ, రామారావుకీ జరిగిన పెళ్ళి చెల్లదని నిరూపించేందుకు జగన్మోహన్ సాక్ష్యం అవసరం. అతను సాక్ష్యం ఇవ్వనన్నాడు. అతన్ని కోర్టుకి రప్పించినా ప్రయోజనం లేదు. కానీ అతని శవం దొరికితే, ఆ శవం ఫలానా మనిషిదని బయటపడక తప్పదు. అప్పుడు అతను మంగళ భర్త అని తేలిపోతుంది. రామారావుకీ, మంగళకీ జరిగిన వివాహం చెల్లదు. ఈ కోణంలోంచి ఆలోచించగా రామారావు హత్యచేయడానికి కారణం కనిపించింది. అది దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తే, రామారావు సరళని ఎక్కడో దాచి ఉండాలి, లేదా ఆమెని కూడా చంపి శవాన్ని ఎక్కడో దాచి ఉండాలి అనుకున్నాను.

''నేనూ రాజూ రామారావు ఇంట్లోకి మొన్నరాత్రి జొరబడి ఇల్లంతా గాలించాము. నెక్లెసు, సరళ రుమాలు, కాళ్ళజోడు కనిపించాయి. జైలుకి వెళ్ళి వాటిని మంగలకి చూపించాను. వాటిని మంగళ గుర్తుపట్టి, సరళవేనని చెప్పింది. సరళ రామారావు ఇంటికి వెళ్ళిందనీ, నెక్లెసు ఇచ్చిందనీ నిర్ధారణ అయింది. నెక్లెస్‌కి ఉన్న పతకం మీది వేలిముద్రలు పరీక్ష చేయించాను. అవి రామారావువని తేలింది. రాజుని రామారావు వెంటాడమని చెప్పాను. సరళని రామారావుకి వ్యామోహమున్నదని మంగళ అంతకుముందు నాకు చెప్పి ఉండడమే అలా అనుకోడానికి కారణం. .48 కాలిబర్ పిస్తోలు రామారావునుంచి రాజు సంపాదించి సరళ ద్వారా నాకు పంపించాడు'' అన్నాడు యుగంధర్.

''జోగయ్య, అంటే నాగయ్య ఎందుకు నేరం ఒప్పుకుంటూ వాంగ్మూలం ఇచ్చాడు?'' అడిగాడు కమీషనర్.

''అదంతా వజ్రాలరావు చిట్కా. కేసుని గంగరగోళం చేయడానికి వేసిన ఎత్తు. సరళని తీసుకుని జోగయ్య కారు దగ్గరికి వెళ్ళగానే, .32 కాలిబర్ పిస్తోలుని జేబురుమాలుతో పట్టుకుని జగన్మోహన్ వేసుకున్న జుబ్బా పైకిలాగి చర్మానికి ఆనించి పేల్చాడు రామారావు. అప్పుడు దానికి సైలెన్సరు ఉండి ఉంటుంది. తరువాత రామారావు బయలుదేరి జోగయ్యను దింపేసి, సరళని ఇంటికి తీసుకెళ్ళి గదిలో బంధించి తిరిగివచ్చి, సైలెన్సరు లేకుండా మళ్ళీ పిస్తోలు పేల్చి, వెంటనే పరిగెత్తివెళ్ళిపోయాడు.

''తిన్నగా జోగయ్య ఇంటికి వెళ్ళి, .32 కాలిబర్ కోల్టుమీద జోగయ్య వేలిముద్రలున్నాయనీ, అది శవం పక్కన పడిఉన్నదనీ, పోలీసులు అతన్ని పట్టుకుంటారనీ జోగయ్యని బెదిరించి ఉంటాడు. సరళని దాచేస్తాననీ, నిజం బయటపడదనీ చెప్పి ఉంటాడు. జోగయ్య బెదిరిపోయి లాయర్ వజ్రాలరావు చెప్పినట్లు నడుచుకునేందుకు ఒప్పుకుని ఉంటాడు.

అంతలో బల్లమీది టెలిఫోను గణగణ మోగింది. ''హల్లో! యుగంధర్ స్పీకింగ్ హియర్'' అని రెండు నిమిషాలు టెలిఫోనులో విని. కమీషనర్ని చూసి ''రాజు టెలిఫోను చేశాడు. రామారావు వెనువెంటనే ఉన్నాడు. విల్లిపురంలో ఓ చిన్న హోటల్లో ఉన్నాడుట'' అన్నాడు.

"థాంక్స్, విల్లిపురం పోలీసు స్టేషన్‌కి ఫోను చేస్తాను. హోటలు పేరు కనుక్కోండి" అన్నాడు కమీషనర్.

యుగంధర్ టెలిఫోనులో రాజుని అడిగి హోటలు పేరు తెలుసుకుని కమీషనర్‌కి చెప్పాడు.

కమీషనరూ, స్వరాజ్యరావూ, ప్రాసిక్యూటరూ లేచి నిలుచున్నారు. "మంగళ మీద కేసు ఉపసంహరించుకుంటాము" అన్నాడు ప్రాసిక్యూటర్. తలుపు వరకూ వెళ్ళి, వెనక్కి తిరిగి "యుగంధర్ మీరు పూనుకోనట్లయితే మంగళకి శిక్ష తప్పేది కాదు. హత్య చేసింది ఆమేనని నేనూ అనుకున్నాను" అన్నాడు. యుగంధర్ నవ్వాడు. "నేను నిమిత్తమాత్రుణ్ణి. చీకట్లో చేసే పనులు ఎవరికీ తెలియవని అనుకుంటారు అందరూ. చీకటికి వెయ్యికళ్ళున్నాయి. ఆ వెయ్యికళ్ళూ దుర్మార్గుల్ని కనిపెట్టి చూస్తూనే ఉంటాయి" అన్నాడు యుగంధర్.

***(సమాప్తం)***